మంగళవారం
18-11-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి: 10, సంచిక: 57
పేజీలు: 8, వెల: రూ.5.00
Simultaneously published from
Hyderabad,Vijayawada, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్రలో
మ్యాగజైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్
మరియు
పోస్టర్లు
పాంప్లేట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి: 94405 73343

సౌదీలో ఘోర విషాదం

ఆయిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టిన బస్సు

45 మంది మక్కా యాత్రికుల సజీవదహనం

మృతులంతా హైదరాబాద్ వాసులే

ఒకే కుటుంబంలో 18 మంది మృతి

రియాద్/హైదరాబాద్: సౌదీ అరేబియాలో ఘోర విషాదం చోటుచేసుకుంది. భారతీయ యాత్రికులతో ఉన్న బస్సు డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో 45 మంది సజీవ దహనమయ్యారు. మృతులంతా హైదరాబాద్ వాసులే. మక్కాలో పవిత్ర ఉమ్రా యాత్ర ముగించుకుని మదీనా వెళ్తుండగా ఈ ఘోరం జరిగింది. మదీనా నగరానికి సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఉండగా... వీరు ప్రయాణిస్తున్న బస్సు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ఓ డీజిల్ ట్యాంకర్‌ను బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న వేగానికి బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగినట్లు ప్రాథమిక సమాచారం. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 46 మంది ఉండగా, ఒకరు మాత్రం ప్రాణాలతో బయటపడ్డారు. భారత కాలమానం ప్రకారం సోమవారం తెల్లవారుజామున 1:30 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. మక్కా నుంచి మదీనాకు వెళ్తుండగా ముఫరహత్ సమీపంలో డీజిల్ ట్యాంకర్‌ను యాత్రికుల బస్సు ఢీకొట్టింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ప్రమాదం జరిగినపుడు ఎక్కువ మంది గాఢనిద్రలో ఉన్నారు. సమాచారం అందిన వెంటనే సౌదీ అధికారులు, రక్షణ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. హైదరాబాద్ సీపీ సజ్జనార్ ప్రమాద వివరాలు వెల్లడించారు. 'హైదరాబాద్ నుంచి మొత్తం 54 మంది బృందం జెద్దాకు వెళ్లింది. నవంబరు 23 వరకు టూర్ ప్లాన్ చేశారు. వీరిలో నలుగురు వ్యక్తులు ఆదివారం కారులో మదీనాకు వెళ్లారు. మరో నలుగురు మక్కాలోనే ఉండిపోయారు. మిగతా 46 మంది మక్కా నుంచి మదీనాకు బస్సులో బయల్దేరారు. మదీనాకు 25

- మిగతా 2 లో

ఒకే కుటుంబంలో తీరని శోకం

ఈ ప్రమాదంలో మరణించిన వారిలో 18 మంది హైదరాబాద్ విద్యానగర్‌కు చెందిన ఒకే కుటుంబ సభ్యులు కావడం ఈ విషాద తీవ్రతను రెట్టింపు చేసింది. రిటైర్డ్ రైల్వే ఉద్యోగి అయిన నజీరుద్దీన్, తన కుటుంబ సభ్యులందరితో కలిసి ఎంతో భక్తిశ్రద్ధలతో ఈ యాత్రకు వెళ్లారు. మక్కాలో ప్రార్థనలు ముగించుకుని మదీనాకు వెళ్లే మార్గమధ్యంలో వారి కుటుంబంపై విధి ఇలా పగబట్టింది. ఒకేసారి కుటుంబంలోని 18 మందిని కోల్పోవడంతో వారి బంధువులు, స్థానికులు శోకసంద్రంలో మునిగిపోయారు.

బంగ్లా మాజీ ప్రధాని హసీనాకు

మరణ దండన

- ఢాకా కోర్టు సంచలన తీర్పు
- మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడినట్లు అభియోగాలు
- ఇది రాజకీయ కుట్ర: హసీనా

ఢాకా: బంగ్లాదేశ్ రాజకీయాల్లో సంచలనం చోటుచేసుకుంది. ఆ దేశ మాజీ ప్రధాని, అవామీ లీగ్ అధినేత్రి షేక్ హసీనాకు మరణశిక్ష విధిస్తూ అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ (ఐసీటీ) సంచలన తీర్పు వెలువరించింది. గతేడాది జులైలో జరిగిన ప్రదర్శనల సందర్భంగా మానవతా వ్యతిరేక నేరాలకు పాల్పడ్డారని నిర్ధారిస్తూ ఈ శిక్ష ఖరారు చేసింది. ఇదే కేసులో బంగ్లాదేశ్ మాజీ హెూంమంత్రి అసదుజ్జమాన్ ఖాన్ కమల్‌కు కూడా ఐసీటీ మరణ శిక్ష విధించింది. అలాగే అప్పటి పోలీస్ చీఫ్ చౌధురి అబ్దుల్లాకు ఐదేళ్ల కారాగార శిక్ష విధించింది. మానవత్వం లేకుండా నేరాలకు పాల్పడ్డారన్న అభియోగాలపై వాదనలు విన్న ఐసీటీ... సోమవారం హసీనాను దోషిగా తేల్చింది. 2024 జులై-ఆగస్టులో జరిగిన ఆందోళనల్లో 1400 మృతి చెందారని ఐసీటీ న్యాయమూర్తి

- మిగతా 2 లో

ఎమ్మెల్యేల అనర్హతపై 4వారాల్లో నిర్ణయం

న్యూఢిల్లీ: తెలంగాణలో ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌కు సుప్రీంకోర్టు సూచించింది. తెలంగాణలో పదిమంది ఎమ్మెల్యేల అనర్హత అంశానికి సంబంధించి దాఖలైన మూడు వేర్వేరు పిటిషన్లను సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం విచారించింది. స్పీకర్‌కు మరో 4 వారాల గడువు ఇస్తూ... ఈలోపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలని ధర్మాసనం సూచించింది. కేసు విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. సదరు

- మిగతా 2 లో

బీహార్ అసెంబ్లీలో విపక్ష నేతగా తేజస్వి

పట్నా : రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడీ) నేత తేజస్వి యాదవ్ బీహార్ అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా ఎన్నికయ్యారు. పట్నాలోని తేజస్వి నివాసంలో సోమవారం జరిగిన ఆర్‌జేడీ ఎమ్మెల్యేల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రఘోపూర్ నియోజవర్గం నుంచి ఎమ్మెల్యేగా తేజస్వి గెలిచారు. ఎమ్మెల్యేలు జరిపిన సమావేశంలో ఎన్నికల్లో 'మహాగట్బంధన్' ఓటమికి కారణాలను విశ్లేషించినట్టు తెలుస్తోంది. ఆర్‌జేడీ దయనీయ పరిస్థితికి లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె రోహిణి ఆచార్య

- మిగతా 2 లో

బెంగాల్ రాజ్‌భవన్‌లో తనిఖీలు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ రాజ్‌భవన్ ప్రాంగణంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రి నిల్వ చేశారంటూ తృణమూల్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ చేసిన ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. వీటిని తీవ్రంగా పరిగణించిన గవర్నర్ సీవీ ఆనంద బోస్... సోమవారం రాజ్‌భవన్‌లో భద్రతా సిబ్బందితో తనిఖీలు చేయించారు. 'ఆయుధాలు, మందుగుండు సామగ్రిని నిల్వ చేశారా అని గుర్తించేందుకు కోల్‌కతా పోలీసులు, కేంద్ర బలగాలు, బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో కూడిన బృందానికి గవర్నర్ బోస్ నేతృత్వం వహించారు' అని ఓ అధికారి మీడియాకు

- మిగతా 2 లో

సీఎం రేవంత్ దిగ్భ్రాంతి

సౌదీ బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా

విశాలాంధ్ర - హైదరాబాద్: సౌదీ అరేబియాలో భారతీయ యాత్రికులతో వెళ్తున్న బస్సు ఘోర ప్రమాదానికి గురికావడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మక్కా నుంచి మదీనా వెళ్తుండగా ఈ ప్రమాదం జరగడం... అందులో హైదరాబాద్ యాత్రికులు కూడా ఉండడంతో వెంటనే స్పందించిన సీఎం... పూర్తి వివరాలు తెలుసుకోవాలని సీఎస్, డీజీపీ ని అదేశించారు. తెలంగాణకు చెందిన వారు ఎంత మంది ఉన్నారని ఆరా తీశారు. కేంద్ర విదేశాంగ శాఖ, సౌదీ ఎంబస్సీ అధికారులతో మాట్లాడాలని సూచించారు. అవసరమైతే వెంటనే సహాయక చర్యలకు రంగంలోకి దిగాలని అదేశించారు. దీంతో సీఎస్ రామకృష్ణారావు ... దిల్లీలో ఉన్న రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ ను అప్రమత్తం చేశారు. ప్రమాదంలో మన రాష్ట్రానికి చెందిన వారు ఎంత మంది ఉన్నారనే వివరాలు సేకరించి వెంటనే అందించాలని అదేశించారు. మృతుల్లో రహీమున్నీసా, రహమత్ బీ, షెహనాజ్ బేగం, గౌసియా బేగం, కదీర్ మహ్మద్, మహ్మద్ మౌలానా, షోయబ్ మహ్మద్, సోహైల్ మహ్మద్, మస్తాన్ మహ్మద్, పర్వీన్ బేగం, జకియా బేగం, షౌకత్ బేగం, ఫర్హీన్ బేగం, జహీన్ బేగం, మహ్మద్ మంజూర్, మహ్మద్ అలీతో పాటు మరో ఇద్దరు ఉన్నట్లు గుర్తించారు. కాగా, వీరంతా మెహదీపట్నం ఫ్లైజోన్ ఏజెన్సీ ద్వారా టికెట్లు బుక్ చేసుకుని ఈనెల తొమ్మిదో తేదీన హైదరాబాద్ నుంచి ఉమ్రాకు బయల్దేరారు. మక్కా యాత్ర విజయవంతంగా పూర్తిచేసుకుని మదీనాకు వెళ్తున్న సమయంలో రోడ్డు ప్రమాదం జరిగింది. మదీనాకు 25 కి.మీ దూరంలో బస్సు-డీజిల్ ట్యాంకర్ ఢీకొన్నాయి. ఇదిలా ఉండగా... సౌదీ అరేబియాలో బస్సు ప్రమాదంలో మరణించిన బాధిత కుటుంబాలకు రూ. ఐదు లక్షలు పరిహారం అందించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. మంత్రి అజారుద్దీన్, ఎంఐఎం ఎమ్మెల్యే, మైనారిటీ విభాగానికి చెందిన ఒక అధికారితో కూడిన ప్రభుత్వ ప్రతినిధి బృందాన్ని వెంటనే సౌదీకి పంపించాలని నిర్ణయం తీసుకున్నారు. మృతదేహాలను మత సంప్రదాయం ప్రకారం అక్కడే అంత్యక్రియలు చేయాలని,

- మిగతా 2 లో

డిసెంబరు రెండో వారంలో

'స్థానిక' నోటిఫికేషన్?

- 1 నుంచి 9 వరకు ప్రజాపాలన వారోత్సవాలు
- సౌదీకి మంత్రి అజహరుద్దీన్ నేతృత్వంలో బృందం
- కేబినెట్ కీలక నిర్ణయం

విశాలాంధ్ర - హైదరాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అదేవిధంగా ప్రజాపాలన ఏర్పడి రెండేళ్లు పూర్తి కావడంతో వారోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం కేబినెట్ సమావేశం జరిగింది. వివిధ అంశాలపై కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక విజయంతో ఊపు మీద ఉన్న కాంగ్రెస్ పార్టీ ఇదే జోష్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. హైకోర్టు కూడా ఎన్నికల నిర్వహణపై ఒత్తిడి చేస్తుండడంతో ఎన్నికలు నిర్వహించాలని భావించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంపై హైకోర్టులో పిటీషన్ దాఖలు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో కోర్టు పాత రిజర్వేషన్లతో ఎన్నికలకు వెళ్లవచ్చని సూచించింది. దీనిపై గత కొన్ని రోజులుగా అధికార పార్టీలో చర్చ జరుగుతోంది. పార్టీ పరంగా 42 శాతం బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం ఇస్తూ ఎన్నికలకు వెళ్లేందుకు సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. డిసెంబరు రెండో వారంలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం ఉంది. అదేవిధంగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తి అవుతున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం

- మిగతా 2 లో

ఆరోగ్య శాఖలో కొలువుల పండుగ

- ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు 1,284 మంది ఎంపిక
- భర్తీ ప్రక్రియలో మరో 7 వేలకు పైగా పోస్టులు
- మంత్రి రాజనర్సింహ

2లో

రాష్ట్రాభివృద్ధే లక్ష్యం

8, 9 తేదీల్లో గ్లోబల్ సమ్మిట్

పెట్టుబడులకు అనుకూల వాతావరణం

అందుబాటులో నైపుణ్య మానవ వనరులు: భట్టి

విశాలాంధ్ర-దుండిగల్: అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి పరచడమే లక్ష్యమని, ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. డిసెంబరు ఎనిమిది, తొమ్మిది తేదీల్లో నిర్వహించే గ్లోబల్ సమ్మిట్ ఏర్పాటులో భాగంగా వేదిక ఖరారు కోసం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్‌లో సర్వే నెంబర్ 453,454లో ప్రభుత్వ భూమిని సోమవారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్, కలెక్టర్ మను చౌదరి, నర్సింహా రెడ్డి లతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. భట్టి

- మిగతా 2 లో

దళారులను ఆశ్రయించొద్దు

మిల్లర్లే ధాన్యం కొనుగోలు చేయాలి: కూనంనేని

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : ఆరుగాలం కష్టపడి పండించిన పంటను వెంటనే అమ్ముకోవాలన్న ఆతృతతో దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పాల్వంచ మండలం సోములుగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా సహకార సంఘాల అధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. తక్షణమే ప్రతిపాదిత గ్రామాల్లో కేంద్రాలను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. కేంద్రాల సంఖ్యను పెంచడం ద్వారా రైతులకు రవాణా ఖర్చులు ఆదా అవుతాయన్నారు. ప్రతి కేంద్రాన్ని అధికారులు, సొసైటీ ఉద్యోగులు నిత్యం పర్యవేక్షించాలని కోరారు. ఆలస్యమైనా... దళారుల వల్లో పడకుండా తమ పంటను కొనుగోలు కేంద్రాలలోనే అమ్మి మద్దతు ధర తోపాటు బోనస్ కూడా పొంది లాభపడాలన్నారు. ధాన్యాన్ని జాప్యం లేకుండా వెంటనే మిల్లర్లు కొనుగోలు చేయాలన్నారు. గొనె సంచుల కొరత లేకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సొసైటీ ఉపాధ్యక్షుడు కంపెల్లి కనకేష్, తహసిల్దార్ దార ప్రసాద్, ఎంపీడీవో విజయ భాస్కర్, ఎరంశెట్టి ముత్త య్య, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, అన్నారపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకట్రావు, నిమ్మల రాంబాబు, రంజిత్, మోహన్ రావు, భూక్య విజయ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నితీశ్ రాజీనామా

20న తిరిగి ప్రమాణస్వీకారం

బీహార్‌లో కొలువుదీరనున్న కొత్త ప్రభుత్వం



పట్నా: బీహార్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరేందుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు నీతీశ్ సీఎం పదవికి రాజీనామా చేశారు. ఈ నెల 20న నూతన ప్రభుత్వం ఏర్పడనుంది. ఆ రోజున నితీశ్‌కుమార్ మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయనున్నట్లు సమాచారం. కాగా సోమవారం బీహార్ ప్రస్తుత మంత్రివర్గం సమావేశమై తదుపరి చర్యలు తీసుకునేందుకు సీఎం నితీశ్ కుమార్‌కు అధికారం ఇస్తూ తీర్మానం చేసింది. అనంతరం కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు వీలుగా ముఖ్యమంత్రి, మంత్రులు గవర్నర్‌కు రాజీనామా సమర్పించారు. ఇక ఈనెల 21 నాటికి ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియ పూర్తవుతుందని బీజేపీ బీహార్ శాఖ అధ్యక్షుడు దిలీప్ జైస్వాల్ వెల్లడించారు. మంగళవారం ఉదయం రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ శాసనసభాపక్ష సమావేశమవుతుందని,

- మిగతా 2 లో

ఇదీ లోకం!

సార్‌తో సమస్య ఏమిటంటే ఈ ప్రపంచంలో ఆయనొక్కడే పనిచేస్తున్నాననుకుంటాడు!

రష్యాతో వ్యాపారం చేస్తే...500 శాతం సుంకాలు: ట్రంప్

వాషింగ్టన్: గత కొన్ని రోజులుగా రష్యా ఉక్రెయిన్‌పై భీకర వైమానిక దాడులు చేస్తున్న క్రమంలో రష్యాతో వ్యాపారం చేసే ఏదేశాన్నయినా వదిలిపెట్టబోమని... ఆయా దేశాలపై అత్యం కఠిన ఆంక్షలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. రష్యా నుంచి ముడి చమురును కొనే దేశాలు, దానిని శుద్ధి చేసి తిరిగి విక్రయించే దేశాలపై 500 శాతం దాకా సుంకాలను విధిస్తామన్నారు. ఈమేరకు కఠిన ప్రతిపాదనలతో కూడిన ఓ బిల్లును అధికార రిపబ్లికన్ పార్టీ అమెరికా సెనేట్‌లో ప్రవేశపెట్టిందని... ఒకవేళ ఆ బిల్లుకు అమెరికా కాంగ్రెస్ ఆమోద ముద్ర లభిస్తే, తాను స్వాగతిస్తానని ట్రంప్ వెల్లడించారు. 500 శాతం సుంకాలను ఎదుర్కొనే దేశాల జాబితాలో ఇరాన్‌ను చేర్చాలని తాను సూచించానని, తప్పకుండా ఆ దేశాన్ని జాబితాలో చేరుస్తారని పేర్కొన్నారు. ఫ్లోరిడా నుంచి వాషింగ్టన్‌కు బయలుదేరే ముందు విలేకరులతో మాట్లాడుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా వాణిజ్య భాగస్వాములపై 500 శాతం సుంకాలను విధించే ప్రతిపాదనతో కూడిన బిల్లును అధికార రిపబ్లికన్ పార్టీ సెనెటర్ లిండ్సే గ్రాహం, విపక్ష డెమొక్రటిక్ పార్టీ సెనెటర్ రిచర్డ్ బ్లూమెంథాల్ కలిసి అమెరికా సెనెట్‌లో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు పేరు 'శాంక్షనింగ్ రష్యా యాక్ట్ ఆఫ్ 2025'. 85 మంది సెనెటర్ల కనీస మద్దతుతో ఈ బిల్లును సెనెట్‌లో చర్చకు పెట్టారు. దీనికి సెనెట్‌లోని అత్యంత కీలకమైన 'విదేశీ సంబంధాల కమిటీ' ఏకగ్రీవ మద్దతు లభించే అవకాశాలు ఉన్నాయి. ఈ బిల్లుకు అమెరికా కాంగ్రెస్ ఆమోదం లభిస్తే, రష్యా వాణిజ్య భాగస్వాములపై 500 శాతం సుంకాలను విధించే అధికారం అధ్యక్షుడు ట్రంప్ చేతికొస్తుంది. ఈ అధికారంతో ప్రధానంగా చైనా, భారత్‌లను ట్రంప్ లక్ష్యంగా చేసుకునే అవకాశాలు ఉన్నాయని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఇక ఇరాన్, ఉత్తర కొరియాలాంటి దేశాలు ఆ జాబితాలో ఉంటాయి. ఇప్పటికే ఉక్రెయిన్‌లోని చాలా భూభాగాన్ని రష్యా సైన్యం ఆక్రమించుకుంది. ఇప్పుడు తూర్పు ఉక్రెయిన్‌లోని కీలకమైన రైల్వే హబ్ 'పోక్రోవ్‌స్క్'ను స్వాధీనం చేసుకోవడంపై రష్యా బలగాలు దృష్టి పెట్టాయి.

ఎప్‌స్టీన్ ఫైల్స్‌పై ట్రంప్ 'యూటర్న్'

అమెరికాలో సంచలనం రేపిన సెక్స్ కుంభకోణం ఎప్‌స్టీన్ ఫైల్స్ విషయంలో అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయం మార్చుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన ఫైల్స్‌ను బహిర్గతం చేసే బిల్లుకు మద్దతు ఇవ్వాలని హౌస్ రిపబ్లికన్లను కోరారు. ఇంతకుముందు దీన్ని వ్యతిరేకించిన ట్రంప్... ఇప్పుడు నిర్ణయం మార్చుకోవడం చర్చనీయాంశమైంది. ఈ మేరకు ట్రంప్ ఎప్‌స్టీన్ ఫైల్స్ కేసును ఉద్దేశించి ట్రూత్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.'దాయడానికి ఏమీ లేదు. రిపబ్లికన్ పార్టీ విజయాల నుంచి దృష్టి మరల్చడానికే రాడికల్ లెఫ్ట్ డెమోక్రాట్ లు సృష్టించిన తప్పుడు ప్రచారం. రిపబ్లికన్లు మళ్లీ అమెరికా ప్రయోజనాలపై దృష్టి కేంద్రీకరించాలి' అని కోరారు. ఈ వారంలోనే ఎప్‌స్టీన్ ఫైల్స్ బహిర్గతానికి సంబంధించిన బిల్లు ఓటింగ్‌కు వచ్చే అవకాశం ఉంది.

పాక్‌లో రాజ్యాంగ సవరణపై భగ్గుమన్న నిరసనలు

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో ఇటీవల ఆమోదం పొందిన 27వ రాజ్యాంగ సవరణ తీవ్ర రాజకీయ దుమారం రేపుతోంది. రాజ్యాంగాన్ని వక్రీకరించి, ప్రాథమిక హక్కులను కాలరాస్తున్నారంటూ ఈ సవరణకు వ్యతిరేకంగా పాకిస్థాన్ అవామీ తెహ్రీక్ (పీఏటీ), దాని మహిళా విభాగం సింధియానీ తెహ్రీక్ (ఎస్టీ) అధ్వర్యంలో సింధ్ ప్రావిన్స్‌లో ఆందోళనలు జరుగుతున్నాయి. కార్పొరేట్ ఫార్మింగ్, సింధు నదిపై కొత్త కాలువలు, సింధ్ వనరుల దోపిడీని నిరసిస్తూ కార్యకర్తలు వీధుల్లోకి వచ్చి తమ గళం వినిపిస్తున్నారు. ఆదివారం జైల్ రోడ్ నుంచి స్థానిక ప్రెస్ క్లబ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీఏటీ అధ్యక్షుడు వసంద్ థారీ మాట్లాడుతూ, 27వ సవరణ ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి అని అభివర్ణించారు. ఈ సవరణ ద్వారా పాలకులు రాజ్యాంగాన్ని వక్రీకరించి, ప్రాథమిక హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. సింధ్ ఖనిజ, ఇతర వనరులను అడ్డూ అదుపూ లేకుండా దోచుకోవడానికే ఈ సవరణను తీసుకొచ్చారని ధ్వజమెత్తారు. కార్పొరేట్ ఫార్మింగ్ పేరుతో లక్షలాది ఎకరాల భూములను బడా సంస్థలకు కట్టబెట్టే కుట్ర జరుగుతోందని విమర్శించారు. ర్యాలీ ముగింపులో వివిధ తీర్మానాలు ఆమోదించారు. 27వ సవరణ కింద అధ్యక్షుడికి, ఫీల్డ్ మార్షల్‌కు జీవితకాలం రక్షణ కల్పించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇది వారిని చట్టానికి, దేశంలోని 25 కోట్ల మంది పౌరులకు అతీతులుగా మారుస్తుందని, ఇది రాచరిక పాలనను అమలు చేయడమేనని తీర్మానంలో పేర్కొన్నారు. కాగా, ఈ నెల 13న అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ ఈ వివాదాస్పద బిల్లుపై సంతకం చేయడంతో అది చట్టంగా మారింది. అంతకుముందు పార్లమెంట్‌లోని ఉభయ సభలు దీనికి ఆమోదం తెలిపాయి. మరోవైపు, ప్రధాన ప్రతిపక్ష కూటమి 'తహ్రీక్-ఇ-తహఫుజ్ అయీన్-ఇ-పాకిస్థాన్' (టీటీఏపీ) కూడా ఈ సవరణపై పోరాటానికి సిద్ధమైంది. వచ్చే శుక్రవారాన్ని 'బ్లాక్ డే' పేరుతో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు చేపట్టాలని పిలుపునిచ్చింది.

రాగి గనిలో ప్రమాదం...

32 మంది కార్మికుల మృతి

కాంగో: ఆఫ్రికా దేశం కాంగోలోని రాగి గనిలో వంతెన కూలిపోయిన ఘటనలో 32 మంది మృతి కార్మికులు దుర్మరణం పాలయ్యారు. లువాలాబా ప్రావిన్స్‌లోని కలాండో సైట్‌లో ఉన్న రాగి గని లో వందలమంది కార్మికులు పనిచేస్తున్నారు. అయితే, ఇందులో కాల్పుల శబ్దం వినిపించడంతో ఇరుకైన వంతెనపై ఒక్కసారిగా కార్మికులు పరుగులు తీశారు. దీంతో వంతెన కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదం కారణంగా దాదాపు 32 మంది మృతిచెందినట్లు మైనింగ్ ఏజెన్సీ తెలిపింది. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. కాంగోలో మైనింగ్ గని ముఖ్యమైన జీవనాధారం. దాదాపుగా 20 లక్షల మంది ఈ గని ద్వారా ఉపాధి పొందుతున్నారు. పరోక్షంగా లక్షలాదిమంది దీని మీద ఆధారపడి బతుకుతున్నారు. కాగా ఈ గనిలో భద్రతా చర్యలు సరిగ్గా లేవన్న విమర్శలున్నాయి. ప్రమాదానికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

అన్నదాతా సుఖీభవ...

రేపు రైతు ఖాతాల్లో రెండో విడత నగదు జమ

విశాలాంధ్ర - సచివాలయం: 'అన్నదాత సుఖీభవ' రెండో విడత నిధులు ఈ నెల 19న రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. కేంద్రం ఇచ్చే పీఎం కిసాన్ నిధులకు రాష్ట్ర వాటా కలిపి మొత్తం రూ.ఏడువేలు అందించనున్నారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి రైతుకూ లబ్ధి చేకూరాలని, అన్నదాతలకు చేయూతనివ్వడం భారం కాదు... బాధ్యత అని ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ... వైయస్సార్ జిల్లా కమలాపురం నియోజకవర్గంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తారు. అయితే వెబ్‌ల్యాండ్‌లో గతంలో పట్టాదారుల పేర్లతో తప్పుగా నమోదైన ఆధార్ నంబర్లను సరిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించి సర్వీసు ఛార్జీ రూపంలో వసూలు చేయాల్సిన రూ.2.72 కోట్లకు మినహాయింపు ఇచ్చింది. తద్వారా వీరందరికి 'అన్నదాతా సుఖీభవ' ప్రయోజనాలు అందనున్నాయి. రాష్ట్రంలో 5.44 లక్షల మంది అర్హులైన రైతులు తొలివిడతలో ఈ పథకం కింద ఆర్థిక సాయాన్ని పొందలేకపోయారు. సర్వే నంబరు, విస్తీర్ణం, ఇతర వివరాలన్నీ సరిగానే ఉన్నా వెబ్ ల్యాండ్ లో ఆధార్ నంబర్లు తప్పుగా నమోదు కావడమే దీనికి కారణం. కొందరికి రైతు పేరు, తండ్రి పేర్లలో అక్షర దోషాలున్నాయి. పాత సర్వే నంబర్లే కాకుండా... రీసర్వే తర్వాత నమోదైన ఎల్పీఎం నంబర్లకు కూడా ఆధార్, మొబైల్ నంబర్లు, పేర్లు తప్పుగా నమోదయ్యాయి. ఇలాంటి జాబితా వ్యవసాయశాఖ నుంచి రెవెన్యూ శాఖకు చేరినా కొన్ని నెలలుగా పరిష్కారం కావడం లేదు. తహసీల్దారు లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని సరిదిద్దాలంటే మొబైల్ నంబర్, ఆధార్ సీడింగ్ కింద లబ్ధిదారులు దరఖాస్తు చేసుకుని రూ.50 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. సమస్య పరిష్కారంలో భాగంగా ఈ ఛార్జి వసూలు చేయకుండానే సర్వే నంబరు/ల్యాండ్ పార్సిల్ మ్యాప్ (ఎల్పీఎం) తో పట్టాదారు ఆధార్ నంబర్లు మ్యాపింగ్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. 5.44 లక్షల మంది రైతులకు 'అన్నదాత సుఖీభవ' వర్తింపజేయాలని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ఉత్తర్వులు ఇచ్చారు.

ఆరోగ్య శాఖలో కొలువుల పండుగ

విశాలాంధ్ర-హైదరాబాద్ : ప్రభుత్వాసుపత్రుల్లో రోగులకు మెరుగైన సేవలు అందుతున్నాయని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ (గ్రేడ్-2) పోస్టులకు ఎంపికయిన అభ్యర్థుల జాబితాను సోమవారం ఆయన విడుదల చేశారు. ప్రభుత్వాసుపత్రుల్లోని 1,284 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి గత ఏడాది చివరిలో వైద్య, ఆరోగ్య సేవల నియామక బోర్డు నోటిఫికేషన్ విడుదల చేయగా, 24,045 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 23,323 మంది బోర్డు నిర్వహించిన పరీక్షకు (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) హాజరయ్యారు. వీరిలో పోస్టులకు ఎంపికయిన వారి జాబితాను బోర్డు సిద్ధం చేయగా, రాష్ట్ర సచివాలయంలో ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా, ఇతర అధికారులతో కలిసి దామోదర్ రాజనర్సింహ సోమవారం ఆ జాబితా విడుదల చేశారు. అనంతరం ఉద్యోగాలకు ఎంపికయిన అభ్యర్థుల వివరాలు, వారు సాధించిన మార్కుల వివరాలను బోర్డు వెబ్‌సైట్‌లో అధికారులు అప్‌లోడ్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉద్యోగం సాధించిన అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వాసుపత్రుల్లో మౌలిక వసతుల కల్పనకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 9 వేలకు పైగా పోస్టులను భర్తీ చేశామని, మరో 7 వేలకు పైగా పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతున్నదని అన్నారు. డాక్టర్లు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్ వంటి ముఖ్యమైన పోస్టులతో పాటు వైద్య సేవలు మెరుగుపర్చేందుకు అవసరమైన ఇతర అన్ని రకాల పోస్టులను భర్తీ చేస్తున్నామని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చే నాటికి డాక్టర్లు, సిబ్బంది లేక వెలవెలబోయిన ఆసుపత్రులు ఇప్పుడు కళకళలాడుతున్నాయని మంత్రి అన్నారు. డాక్టర్లు, సిబ్బంది రాకతో ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని, వీలైనంత త్వరలో మిగిలిన పోస్టుల భర్తీ ప్రక్రియను కూడా పూర్తి చేస్తామని తెలిపారు.

నితీశ్ రాజీనామా

(మొదటిపేజీ తరువాయి)

తర్వాత కేంద్రం నుంచి వచ్చిన పరిశీలకుల సమక్షంలో ఎన్డీయే శాసనసభాపక్షం సమావేశం అవుతుందని, అక్కడ ముఖ్యమంత్రి ఎంపికకు సంబంధించిన లాంఛనాలు పూర్తి చేస్తామని వివరించారు. గాంధీ మైదాన్‌లో ప్రమాణస్వీకార కార్యక్రమం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరుకానున్నారు.

35 నుంచి 36 మంది మంత్రులు ఉండే అవకాశం ఉందని కేంద్ర మంత్రి, హిందుస్తాన్ అవామీ మోర్చా-ఎస్ అధిపతి జితన్ రామ్ మాంఝీ చెప్పారు. బీజేపీ నుంచి 16 మంది మంత్రులు, జేడీయూ నుంచి 14 నుంచి 15 మంది, లోక్‌జనశక్తి రామ్ విలాస్ పార్టీ నుంచి ముగ్గురు ఉంటారని ఆయన వెల్లడించారు. హిందుస్తాన్ అవామీ మోర్చా-ఎస్ నుంచి ఒకరు, రాష్ట్రీయ లోక్ మోర్చా నుంచి మరొకరు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశముందని మాంఝీ వివరించారు. ప్రభుత్వ ఏర్పాటుపై బీజేపీ బీహార్ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా ఉన్న కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో మాంఝీ ఇప్పటికే చర్చలు జరిపారు.

రాష్ట్రీయ లోక్ మోర్చా అధ్యక్షుడు ఉపేంద్ర కుష్వాహా కూడా ధర్మేంద్ర ప్రధాన్‌తో సమావేశమయ్యారు.

1985 బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ భారీ విజయం సాధించింది. అప్పట్లో లోక్‌దళ్ పార్టీ నుంచి హర్నౌత్ నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొందిన నితీశ్‌కుమార్... ఐదేళ్ల తర్వాత ఎంపీగా ఎన్నికయ్యారు.

బీహార్‌లో రిజర్వేషన్ల ఉద్యమం కొనసాగుతున్న వేళ జార్జ్ ఫెర్నాండెజ్‌తో కలిసి 1994లో సమతా పార్టీని ఏర్పాటుచేశారు. 2000లో తొలిసారి ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన ఆయన కేవలం వారం రోజులే (2000 మార్చి 3- 10) కొనసాగారు. అనంతరం జనతాదళ్ (యునైటెడ్)ను ఏర్పాటుచేసి, రాష్ట్రంలో మిత్రపక్షాలతో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశారు. ఇప్పటివరకు తొమ్మిదిసార్లు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు.

సౌదీలో ఘోర విషాదం

(మొదటిపేజీ తరువాయి)

కిలోమీటర్ల దూరంలో ఈ బస్సు చమురు ట్యాంకర్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో 45 మంది చనిపోయారు. అబ్దుల్ షోయబ్ అనే వ్యక్తి ఒక్కరే బయటపడ్డారు. ప్రస్తుతం అతడు ఆసుపత్రిలో ఉన్నాడు' అని సజ్జనార్ పేర్కొన్నారు.

స్పందించిన విదేశాంగశాఖ

ఈ ప్రమాదంపై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రయత్నిస్తోంది. మృతులు, గాయపడిన వారి వివరాలను సేకరించి వారి కుటుంబాలకు సమాచారం అందించేందుకు సౌదీ అధికారులతో సమన్వయం చేసుకుంటోంది. మరోవైపు పోలీసులు ప్రమాదానికి గల కారణాలు ఏంటనే దానిపై విచారణ జరుపుతున్నారు. మరోవైపు మృతుల్లో తెలంగాణ, హైదరాబాద్ వాసులు ఉండటంతో వారు ఏ ఏజెన్సీ ద్వారా యాత్రకు వెళ్లారనే విషయం తెలుసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. ప్రమాదానికి గురైన బస్సు పూర్తిగా దగ్ధమైందని, బాధితులను గుర్తించడం సవాలుగా మారిందని పేర్కొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తం

సౌదీ అరేబియాలో జరిగిన బస్సు ప్రమాదంలో హైదరాబాద్‌వాసులు ఉన్నారన్న సమాచారంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ ప్రమాదంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పూర్తి వివరాలు తెలుసుకోవాలని సీఎస్, డీజీపీని ఆదేశించారు. తెలంగాణకు చెందిన వారు ఎంత మంది ఉన్నారని ఆరా తీశారు. కేంద్ర విదేశాంగ శాఖ, సౌదీ ఎంబసీ అధికారులతో మాట్లాడాలని సూచించారు. అవసరమైతే వెంటనే తగిన సహాయక చర్యలకు రంగంలోకి దిగాలని ఆదేశించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో సీఎస్ రామకృష్ణారావు ఢిల్లీలో ఉన్న కో ఆర్డినేషన్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్‌ను అప్రమత్తం చేశారు. జెద్దాలో ఉన్న కాన్సులేట్ జనరల్, రియాద్‌లోని డిప్యూటీ అంబాసిడర్‌తో మాట్లాడారు. కాగా, బస్సు ప్రమాద బాధిత కుటుంబాలకు తగు సమాచారాన్ని, సహాయ సహకారాలు అందించేందుకు అధికారులు సచివాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.

మోదీ, జైశంకర్ దిగ్భ్రాంతి

సౌదీ బస్సు ప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, విదేశాంగమంత్రి జైశంకర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని మోదీ ఆకాంక్షించారు. సౌదీ అరేబియా అధికారులతో భారత సిబ్బంది నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. రియాద్, జెద్దాలోని భారత రాయబార కార్యాలయాలు సహాయక చర్యలు చేపడుతున్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

మృతులంతా హైదరాబాదీలే: హజ్ కమిటీ

సౌదీ అరేబియాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 45 మంది హైదరాబాద్ వాసులు మరణించినట్లు తెలంగాణ హజ్ కమిటీ అధికారికంగా ప్రకటించింది. పవిత్ర ఉమ్రా యాత్రకు వెళ్లిన వీరి ప్రయాణం విషాదాంతంగా ముగిసింది. మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన 18 మంది ఉండటం అందరినీ తీవ్రంగా కలచివేస్తోంది. ఈ దుర్ఘటనతో హైదరాబాద్ నగరంలో, ముఖ్యంగా మృతుల కుటుంబాల్లో తీరని విషాదం అలుముకుంది. ఈ భయానక ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న మొత్తం 45 మంది అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. మృతుల్లో 17 మంది పురుషులు, 18 మంది మహిళలు, 10 మంది చిన్నారులు ఉన్నారని హజ్ కమిటీ అధికారులు తమ ప్రకటనలో వివరించారు.

సీఎం రేవంత్ దిగ్భ్రాంతి

(మొదటిపేజీ తరువాయి)

బాధితకుటుంబ సభ్యులను ఒక్కో కుటుంబానికి ఇద్దరిని తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు.

కేసీఆర్ సంతాపం

సౌదీ అరేబియాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో తెలంగాణ వాసులు మరణించడంపై కేసీఆర్ దిగ్భ్రాంతి చెందారు. ఉమ్రా యాత్రలో భాగంగా మక్కా నుంచి మదీనా వెళుతున్న బస్సులో ప్రయాణిస్తున్న 42 మంది రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడంపై విచారం వ్యక్తం చేస్తూ సంతాపం ప్రకటించారు. మృతుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని, గాయపడినవారికి మెరుగైన చికిత్స అందజేయాలని కోరారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రాష్ట్రాభివృద్ధే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ తెలంగాణ రైజింగ్ విజన్-2047లో భాగంగా ప్రభుత్వం... తెలంగాణ నుంచే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులను ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. హైదరాబాద్‌లో అనుకూలమైన వాతావరణం... అత్యంత నైపుణ్యం తో కూడిన మానవ వనరులు ఉన్నందున పెట్టుబడిదారులను మరింతగా ఆకర్షిస్తోందని అన్నారు.

అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, ఆర్డీవో శ్యామ్ ప్రకాష్, కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్, సీఐ సతీష్ కుమార్, మేడ్చల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, బొంగునూరి కిషోర్ రెడ్డి, కావాలి గణేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల అనర్హతపై 4వారాల్లో నిర్ణయం

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్లపై మూడునెలల్లోపు నిర్ణయం తీసుకోవాలని జులై 31న జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. అయితే విభిన్న కారణాలవల్ల ఆలోపు నిర్ణయం తీసుకోవడం సాధ్యం కానందున స్పీకర్‌కు మరో రెండునెలలు గడువు ఇవ్వాలని కోరుతూ తెలంగాణ శాసనసభ కార్యదర్శి దాఖలు చేసిన మిసిలేనియస్ అప్లికేషన్ సీజేఐ ధర్మాసనం ముందు 14వ నంబరులో లిస్ట్ అయింది. అలాగే మూడునెలల్లోపు నిర్ణయం తీసుకోవాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై కోర్టు ధిక్కరణ కింద చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలుచేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్ 36వ నంబరులో ఉంది. స్పీకర్ మూడునెలల్లోపు నిర్ణయం తీసుకోవడంలో విఫలమైనందున నేరుగా న్యాయస్థానమే తమ పిటిషన్లపై విచారణ చేపట్టి నిర్ణయం వెలువరించాలని కోరుతూ కేటీఆర్ దాఖలు చేసిన మరో రిట్ పిటిషన్ 37వ నంబరులో లిస్ట్ అయింది. ఈక్రమంలో ఆయా పిటిషన్లపై సోమవారం విచారణ చేపట్టిన న్యాయస్థానం స్పీకర్‌కు మరో 4 వారాల గడువు ఇచ్చింది

బెంగాల్ రాజ్‌భవన్‌లో తనిఖీలు

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. ప్రస్తుతం పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ' (ఎస్ఐఆర్) కొనసాగుతోంది. ఎన్నికల ప్రక్రియను ప్రక్షాళన చేసేందుకు 'ఎస్ఐఆర్' ఎంతో అవసరమని శనివారం గవర్నర్ వ్యాఖ్యానించారు. ఇది జరిగిన గంటల వ్యవధిలోనే గవర్నర్, రాజ్‌భవన్‌ను తృణమూల్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ లక్ష్యంగా చేసుకున్నారు. 'రాజ్‌భవన్ లోపల బీజేపీ నేరస్థులకు గవర్నర్ ఆశ్రయం కల్పించారు. వారికి బాంబులు, తుపాకులు సమకూర్చారు' అని తీవ్ర ఆరోపణలు చేశారు.

విపక్ష నేతగా తేజస్వి

(మొదటిపేజీ తరువాయి)

కారణమంటూ ఆరోపించిన సంజయ్ యాదవ్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. విస్తృత చర్చల అనంతరం ఈవీఎంల హ్యాకింగ్, ఎన్నికల కమిషన్ పక్షపాత వైఖరే ఓటమికి కారణాలనే అభిప్రాయానికి వచ్చారు. ఈ నెల 14న వెలువడిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో 243 సీట్లలో ఎన్డీఏ 202 సీట్లు గెలుచుకోగా, మహాగట్బంధన్ 35 స్థానాలకు పరిమితమైంది. వీటిలో 25 స్థానాలను ఆర్‌జేడీ గెలుచుకుంది. కాంగ్రెస్ కేవలం 6 సీట్లకే పరిమితమయింది.

'స్థానిక' నోటిఫికేషన్?

(మొదటిపేజీ తరువాయి)

చేపట్టిన సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని నిర్ణయించింది. ప్రజాపాలన వారోత్సవాల వల్ల స్థానిక సంస్థల్లో కూడా కాంగ్రెస్ కు లాభం చేకూరుతుందని భావిస్తున్నారు. అందులో భాగంగానే డిసెంబరు ఒకటి నుంచి తొమ్మిది వరకు ప్రజాపాలన వారోత్సవాలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయం తీలుకుంది. సౌదీ ఆరేబియాలో మక్కా నుంచి మదీనాకు ప్రయాణిస్తున్న బస్సు ప్రమాదానికి గురైన దుర్ఘటనలో మరణించిన బాధిత కుటుంబాలకు రూ.ఐదు లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని మంత్రిమండలి నిర్ణయించింది. ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. మంత్రి అజహరుద్దీన్ నేతృత్వంలో ఎంఐఎం ఎమ్మెల్యే, మైనారిటీ విభాగానికి చెందిన ఒక అధికారితో కూడిన ప్రభుత్వ ప్రతినిధి బృందాన్ని వెంటనే సౌదీ అరేబియాకు పంపించాలని సమావేశం నిర్ణయించింది.

హసీనాకు మరణ దండన

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నారు. తనకు వ్యతిరేకంగా ఢాకాలో ఆందోళనకు దిగిన విద్యార్థులను చంపేయమని షేక్ హసీనా ఆదేశాలు జారీ చేశారని న్యాయమూర్తి తీర్పులో వెల్లడించారు. నిరసనకారులపై ప్రాణాంతక ఆయుధాలు ఉపయోగించేలా షేక్ హసీనా పోలీసులు, సైన్యాన్ని ఆదేశించారని మరో న్యాయమూర్తి తీర్పులో ప్రస్తావించారు. గాయపడినవారికి వైద్యం అందించేందుకు కూడా ఆమె నిరాకరించినట్లు తెలిపారు. షేక్ హసీనా అధికారంలో ఉండేందుకు బలప్రయోగం చేశారని పేర్కొన్నారు. తీర్పు ఇవ్వడంలో ఏదైనా ఆలస్యం జరిగితే క్షమించాలని కోరారు.

ఢాకాలో హైఅలర్ట్

మరోవైపు ఈ తీర్పు నేపథ్యంలో బంగ్లాదేశ్‌లో ముఖ్యంగా రాజధాని ఢాకాలో హై అలర్ట్ ప్రకటించారు. ఎవరైనా వాహనాలు తగలబెట్టేందుకు, బాంబులు విసిరేందుకు ప్రయత్నిస్తే వారిని కాల్చివేయాలంటూ ఢాకా పోలీస్ చీఫ్ షేక్ మహమ్మద్ సజ్జత్ అలీ ఆదేశాలు జారీ చేశారు. ఇక తీర్పు నేపథ్యంలో ఐసీటీ చుట్టూ భద్రతను కట్టుదిట్టం చేశారు.

అంతర్జాతీయ క్రిమినల్ కోర్టులో విచారణకు సిద్ధం

ఐసీటీ తీర్పును షేక్ హసీనా తీవ్రంగా ఖండించారు. ఇది పూర్తిగా పక్షపాతంతో కూడిన, రాజకీయ ప్రేరేపిత తీర్పు అని ఆమె అభివర్ణించారు. ఢాకాలో మహ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'రిగ్డ్ ట్రిబ్యునల్' ఈ తీర్పు ఇచ్చిందని హసీనా ఆరోపించారు. ఈ మేరకు ఐఏఎన్ఎస్ తన కథనంలో వెల్లడించింది. "ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నిక కాని ఈ ప్రభుత్వంలోని కొందరు తీవ్రవాదులు, నన్ను, నా పార్టీ అవామీ లీగ్‌ను రాజకీయంగా అంతం చేయాలనే దురుద్దేశంతోనే ఈ కుట్ర పన్నారు" అని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యూనస్ పాలనలో దేశంలో ప్రజా సేవలు కుప్పకూలాయని, శాంతిభద్రతలు క్షీణించాయని ఆమె విమర్శించారు. గతేదాది జరిగిన ఆందోళనల్లో ఇరువర్గాల మరణాల పట్ల తాను విచారం వ్యక్తం చేస్తున్నానని, అయితే నిరసనకారులను చంపమని తాను గానీ, తన పార్టీ నేతలు గానీ ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని హసీనా స్పష్టం చేశారు. తనపై మోపిన ఆరోపణలను సరైన న్యాయస్థానం ముందు ఎదుర్కోవడానికి తాను భయపడనని తెలిపారు. ఈ కేసును హేగ్‌లోని అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసీసీ) ముందు విచారణ జరపాలని తాను తాత్కాలిక ప్రభుత్వానికి సవాల్ విసురుతున్నానని, అక్కడ తాను నిర్దోషిగా బయటకు వస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఐసీసీ విచారణ జరిపితే తమ మానవ హక్కుల ఉల్లంఘనలు బయటపడతాయనే భయంతోనే తాత్కాలిక ప్రభుత్వం తన సవాల్‌ను స్వీకరించడం లేదని ఆమె ఆరోపించారు.

ఢిల్లీలోని రహస్య ప్రదేశంలో నివాసం

విద్యార్థుల ఆందోళనలతో అనూహ్యరీతిన ప్రధానమంత్రి పీఠం నుంచి దిగిపోయిన షేక్ హసీనా గతేదాది ఆగస్టు 5న బంగ్లాదేశ్‌ను వీడి భారత్‌కు వచ్చారు. నాటినుంచి ఆమె ఢిల్లీలోని ఓ రహస్య ప్రదేశంలో నివసిస్తూ, అప్పుడప్పుడు సోషల్ మీడియా వేదికగా పలు జాతీయ మీడియాలకు ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. తీర్పుకు ముందు కూడా తన దేశాన్ని ఉద్దేశించి సందేశం విడుదల చేశారు. ఎవరూ బాధపడొద్దని అవామీ లీగ్ కార్యకర్తలను కోరారు. "నేను బతికే ఉన్నాను. ఉంటాను. ప్రజల సంక్షేమం కోసం నా పనిని ప్రారంభిస్తాను. వాళ్లు ఏ తీర్పు అయినా ఇవ్వనివ్వండి. నాకు సంబంధం లేదు. దేవుడు ఇచ్చిన ప్రాణం ఆయనే తీసుకుంటాడు. అప్పటివరకు నా ప్రజల కోసం పనిచేస్తాను. ఈ దేశం కోసం నా తల్లిదండ్రులు, తోబుట్టువులను పోగొట్టుకున్నాను. వారు నా ఇంటిని కాల్చివేశారు. గోనో భవన్ (బంగ్లా ప్రధానమంత్రి అధికారిక నివాసం) నా ఆస్తి కాదు. అది ప్రభుత్వానిది. నేను దేశం వీడిన తర్వాత దానిలో లూటీ జరిగింది. అది విప్లవం అని వారు చెప్తున్నారు. గూండాలు, ఉగ్రవాదులు విప్లవాన్ని తీసుకురాలేరు." అని హసీనా పేర్కొన్నారు.

స్టీల్‌ప్లాంట్ కార్మికుల జీతాలపై ఆంక్షలు ఎత్తివేయాలి

విశాలాంధ్ర- గాజువాక: ఉత్పత్తి ఆధారంగా కార్మికులకు వేతనాలు చెల్లిస్తామంటూ విశాఖ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం విడుదల చేసిన సర్క్యులర్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని స్టీల్‌ప్లాంట్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. యాజమాన్య చర్యలకు వ్యతిరేకంగా స్టీల్‌ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనం ఎదుట అఖిలపక్ష కార్మిక సంఘాల అధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ మాట్లాడుతూ చట్టాల్లో లేనివిధంగా కార్మికులపై యాజమాన్యం చేస్తున్న దాడిని తీవ్రంగా విమర్శించారు. ఉత్పత్తికి అవసరమైన ముడిసరుకు ఇవ్వకుండా... కార్మికులను ప్రోత్సహించకుండా ఉత్పత్తి సాధించాలని చెప్పడం అత్యంత దుర్మార్గమని ఆయన అన్నారు.

దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో-మహబూబాబాద్ : గ్రీవెన్స్ దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అండ్ మేజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లోని ప్రధాన సమావేశం మందిరంలో అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, కె అనిల్ కుమార్‌తో కలిసి ప్రజల వద్ద నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖలకు సంబంధించిన మొత్తం 97 దరఖాస్తులు వచ్చావని వాటిని సంబంధిత అధికారులకు పరిష్కరించాలని ఆదేశించానన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ మధుసూదన రాజు, డిహెచ్ఎస్ఓ మరియన్న, డి ఏ ఓ విజయనిర్మల, హౌసింగ్ పీడీ రాజయ్య, సర్వే ల్యాండ్ సహాయ సంచాలకులు నరసింహమూర్తి, ట్రైబల్ వెల్ఫేర్ ఉపసంచాలకులు దేశి రామ్, మెప్మా అధికారి విజయ, లీడ్ బ్యాంక్ మేనేజర్ యాదగిరి, పరిశ్రమల అధికారి శ్రీమన్నారాయణ రెడ్డి, మైనింగ్ అధికారి కలెక్టరేట్ సూపరిడెంట్ వినోద్, భూభారతి కోఆర్డినేటర్ సురేష్, వివిధ మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్ జట్ల ఎంపిక

విశాలాంధ్ర బ్యూరో-మెదక్: ఉమ్మడి మెదక్ జిల్లా టేబుల్ టెన్నిస్ మహిళలు, పురుషుల, జూనియర్ బాల, బాలికల జట్ల ఎంపిక మెదక్ గుల్షన్ క్లబ్ లో నిర్వహించారు. విజేతలకు బహుమతులను క్లబ్ పాలక మండలి సభ్యులు ఏఎంసి మాజీ చైర్మన్ మేడి మధుసూదనరావు అందజేశారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో పాల్గొని జిల్లాకు మంచిపేరు తేవాలని అసోసియేషన్ కార్యదర్శి డా. కె. ప్రభు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పీడీ ఆనందం, హనుమంతు, వినోద్ కుమార్, కోచ్ నరేష్ తదితరులు పాల్గొన్నారు. ఎంపికైన విజేతలు పురుషులు: ఎ.నరేష్, ప్రభు, అభినయ, బాలురు: వర్శిత్, ఏం.భగీరథ, మహిళలు: నేహా నౌషీన్, బి. కావేరీ, బాలికలు :పి. మవ్యశ్రీ, ఎస్. నందిని, బృహతి ఉన్నారు.

కరాటే విద్యార్థులకు బహుమతులు

విశాలాంధ్ర-కొండమల్లేపల్లి: నకిరేకల్ జరిగిన కరాటే పోటీలలో గెలుపొందిన విద్యార్థులను సోమవారం కొండమల్లేపల్లి మాజీ సర్పంచ్ కుంభం శ్రీనివాస్ గౌడ్ కరాటే విద్యార్థులను, కోచ్ మాస్టర్ సురేష్ ను అభినందించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరాటే వల్ల పిల్లలలో శారీరక దృఢత్వంతో పాటు మానసిక పరిపక్వత పెరుగుతుందని క్రమశిక్షణతో పాటు భావి భారత పౌరులుగా ఎదగడానికి దోహదపడుతుందని ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడంలో కరాటే శిక్షణ కీలకమని తెలిపారు కార్యక్రమంలో విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-బూర్గంపాడు: మండల కేంద్రం బూర్గంపాడులో పిఎసిఎస్ చైర్మన్ బిక్కసాని శ్రీనివాస రావు చేతుల మీదుగా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సోమవారం కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా బిక్కసాని మాట్లాడుతూ రైతుల సౌకర్యార్థం కోసం సాధ్యమైనంత ఎక్కువగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు సంఘ సెక్రటరీ, సిబ్బందితో పాటు ముఠా మేస్త్రి తోకల సతీష్, గ్రామ ఆదర్శ రైతులు, సన్నకారు రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పీఎస్‌ను సందర్శించిన అడిషనల్ డీసీపీ

విశాలాంధ్ర-ఖమ్మం (క్రైమ్) : రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ ను అడిషనల్ డీసీపీ లా%ఎ%ఆర్డర్ ప్రసాద్ రావు సందర్శించారు. సోమవారం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న అడిషనల్ డీసీపీ స్టేషన్ నిర్వహణ, పోలీసుల పనితీరు, సెక్టార్ అధికారుల విచారణ నివేదికలు,. సీసీటీఎన్ఎస్ అప్లోడ్, జనరల్ డైరీ రికార్డులను పరిసరాలను పరిశీలించారు. పిటిషన్ విచారణలకు సంబంధించి సిబ్బందితో మాట్లాడారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు అయిన కేసులు, డయల్ 100 కాల్స్ ప్రతిస్పందన సమయం, సస్పెక్ట్ షీట్‌లు, పెండింగ్ కేసులు పరిశీలించారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ.. వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని అన్నారు. స్టేషన్ హౌస్ మేనేజ్‌మెంట్, పోలీస్ స్టేషన్ నిర్వహణ, సెక్టార్ ఆఫీసర్ల భాధ్యతలు విధిగా అమలు చేయాలని సూచించారు. పెట్రో కార్, బీట్ డ్యూటీ సిబ్బంది ఏవిధమైన విధులు నిర్వహిస్తున్నారు? పాత నేరస్థుల నివాసాలను కదలికలను ఏవిధంగా గుర్తిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వివిధ కేసుల్లోని వాహనాలను పరిశీంచారు. కార్యక్రమంలో టౌన్ ఏసీపీ రమణమూర్తి పాల్గొన్నారు.

ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలి: ఎస్పీ

విశాలాంధ్ర-వనపర్తి: ప్రతి సోమవారం వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయములో నిర్వహించే ప్రజా వాణిలో భాగంగా జిల్లాలో సోమవారం వివిధ ప్రాంతాల నుండి 10మంది నేరుగా వనపర్తి జిల్లా ఎస్పీరావుల గిరిధ ర్‌కు ఫిర్యాదులు అందించారు. ఫిర్యాదులను ఎస్పీ స్వయంగా పరిశీలించి తక్షణమే చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని సంబంధిత పోలీస్టేషన్ అధికారులకు అదేశాలు జారీ చేశారు. దీనితో ఫిర్యాదుదారులకు న్యాయం జరుగుతుందనే భరోసాను కలిగించే విధంగా జిల్లా ఎస్పీ చర్యలు తీసుకోవడంపై వచ్చిన ఫిర్యాదుదారులు హర్షం వ్యక్తం చేశారు.

మిర్యాలగూడలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

విశాలాంధ్ర-నల్లగొండ బ్యూరో: మిర్యాలగూడ నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తంకుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, నల్గొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డితో కలిసి మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలో రూ.171.5 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. శెట్టిపాలెం అవంతిపురం వరకు నాలుగు లైన్ల రహదారిని రూ.74 కోట్ల వ్యయంతో నిర్మించనున్నట్లు ప్రకటించారు. అలాగే టిఎఫ్‌యుఐడిసి నిధులతో రూ.15 కోట్ల రహదారి, రూ.16 కోట్ల సీసీ రోడ్లు, మురికి కాలువల పనులను ప్రారంభించారు. మున్సిపాలిటీ పరిధిలో రూ.41 కోట్ల బీటీ సీసీ రోడ్ల పనులకు, మిర్యాలగూడ,తడకమళ్ల రహదారిని ఆరు లైన్లుగా మార్చే రూ.15 కోట్ల పనులకు, ఫ్లైఓవర్ మరియు మున్సిపాలిటీ ఏరియా సుందరీకరణకు రూ.3 కోట్ల పనులకు శంకుస్థాపన చేశారు. కేవీఎమ్ డిగ్రీ కళాశాలలో రూ.5 కోట్లతో, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ.2.25 కోట్లతో నిర్మించిన అదనపు భవనాలను మంత్రులు ప్రారంభించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సాగునీరు అందించే ఆయకట్టు ప్రాంతాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా నీరు అందిస్తామని, ప్రారంభించిన అన్ని ఎత్తిపోతల పథకాలను పూర్తిచేస్తామని అన్నారు. అర్హులందరికీ రేషన్ కార్డులు జారీ చేస్తున్నామని, ధాన్యం సేకరణలో ప్రతి గింజను కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో 72 గంటల్లో నిధులు జమ చేస్తున్నామని చెప్పారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ మిర్యాలగూడలో రూ.250 కోట్ల హ్యాం రోడ్లను మంజూరు చేశామని, ప్రతి గ్రామం నుండి మండల కేంద్రానికి డబుల్ రోడ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. నాగార్జునసాగర్‌కు రూ.450 కోట్లు, దేవరకొండకు రూ.350 కోట్ల హ్యాం రోడ్ల టెండర్లు పిలవనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర పవార్ హెలిప్యాడ్ వద్ద మంత్రులను పుష్పగుచ్ఛాలతో ఆహ్వానించారు. అదనపు ఎస్పీ రమేష్, డీఎస్పీ రాజశేఖర్ రాజు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం: కలెక్టర్

విశాలాంధ్ర-సూర్యాపేట బ్యూరో: సూర్యాపేట సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మంది రంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రతి ఫిర్యాదుపై అధికారులు స్పందించి త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రతి శాఖ అధికారి ప్రజావాణికి తప్పకుండా హాజరుకావాలి. శాఖల వారీగా పిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.వచ్చే వారం రోజుల్లో ప్రజావాణి పిర్యాదుల స్థితిపై రివ్యూ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల కోసం స్థలం అవసరం ఉంటే వెంటనే తెలియజేయాలని, జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన భూముల వివరాలను రికార్డుల్లో నవీకరించాలని అధికారులు సూచనలు అందుకున్నారు. నషా ముక్త భారత్ అభియాన్ లో భాగంగా మంగళవారం జిల్లాలోని అన్ని విద్యాసంస్థల్లో, అలాగే గ్రామ స్థాయిలో మాదక ద్రవ్యాల వ్యతిరేకంగా ప్రతిజ్ఞా కార్యక్రమం చేపట్టాలని అధికారులకు సూచించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం భాగంగా "బాల్య వివాహాలు రహిత తెలంగాణ" కోసం నిర్వహిస్తున్న 30 రోజుల ప్రత్యేక ప్రచారం సందర్భంగా అవగాహన పోస్టర్‌ను కలెక్టర్ పవార్ ఆవిష్కరించారు. ఈ పోస్టర్లు చైల్డ్ మ్యారేజ్ నిర్మూలన, టోల్ ఫ్రీ నెంబర్‌పై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా విడుదలయ్యాయి. సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 42 దరఖాస్తులు స్వీకరించారు. అదనపు కలెక్టర్ కే. సీతారామారావు, ఆర్డీఓ వేణు మాదవ్, మహిళా సంక్షేమ అధికారి కే. నర్సింహారావు, హౌజింగ్ పీడీ సిద్దార్థ, ఇరిగేషన్ అధికారులు, జడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష, డీఎస్సీడీఓ దయానంద రాణి, డీపీఓ యాదగిరి, డీఈఓ ఆశోక్, డీఐఈఓ బానునాయక్, డిఎంహెచ్ఓ వెంకట రమణ అధికారులు హాజరయ్యారు.

వినతులకు సత్వరం పరిష్కారం చూపాలి: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో, సంగారెడ్డి: ప్రజావాణి కేవలం సమస్యలు వినే కార్యక్రమంగా కాకుండా, పరిష్కారాల వేదికగా నిలపాలని, వినతి ఇచ్చి వెళ్లిన వెంటనే పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ పి .ప్రావీణ్య అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 25 దరఖాస్తుల అందాయని తెలిపారు. ప్రజల నుండి వివిధ అంశాలకు సంబంధించిన ఫిర్యాదుల వినతిపత్రాలు అధికారులతో కలిసి స్వీకరించారు. రెవెన్యూ , పంచాయతీరాజ్ , సంక్షేమ పథకాల అర్హత, మున్సిపల్ సమస్యలు వంటి అనేక అంశాలపై వచ్చిన దరఖాస్తులను స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భముగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు నేరుగా అధికారులను కలుసుకొని తమ సమస్యలు చెప్పుకునే అవకాశం కల్పించడం వల్ల పారదర్శక పరిపాలనకు తోడ్పడుతోందని తెలిపారు. కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు అవసరమైన సూచనలు, సహాయం అందిం చడంలో అధికారులు, సిబ్బంది చురుకుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డిఆర్ఓ పద్మజారాణి, జడ్పీ సీఈఓ జానకిరెడ్డి, డిఎం అండ్ హెచ్ఓ వసంతరావు, అధికారులు, సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు .

ప్రజావాణి సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : ప్రజావాణిలో స్వీకరించిన ధరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు రాధిక గుప్తా సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్??-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ హరిప్రియ లతో కలిసి, (109) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ ప్రజలు వారి సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఎంతో నమ్మకంతో మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్నినిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని అదనపు కలెక్టరు అన్నారు. అదే విధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్నచర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయంలో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-కారేపల్లి: మండల కేంద్రమైన కారేపల్లిలోని కాలజ్ఞాన ప్రదాత శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా స్వామివారికి పలు రకాల ప్రత్యేక పూజలు నిర్వహించారు.దేవాలయ అధ్యక్ష కార్యదర్శులు తుమ్మోజు రామమూర్తి, వేములూరి కోటాచారి ఆధ్వర్యంలో హాజరైన భక్తులు శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమాంబలకు గోత్రనామాలతో అభిషేకాలు నిర్వహించారు.

అనంతరం ఆలయ ప్రాంగణంలో గల నవగ్రహాలతో పాటు ఆంజనేయస్వామి, శివలింగాలకు అలంకరణలు చేసి పూజల నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు మద్దోజు అశోకాచార్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ప్రేమ అనురాగమే క్రీస్తు బోధనల సారాంశం

విశాలాంధ్ర-కారేపల్లి: సమాజంలోని ప్రతి ఒక్కరూ ఒకరి పట్ల మరొకరు ప్రేమానురాగాలతో జీవిస్తూ సమాజాభివృద్ధికి కృషి చేయాలని క్రిస్టియన్ జేఏసీ జిల్లా అధ్యక్షులు చల్లగండ్ల రమేష్ బాబు,టిసీసీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ తన్నీరు మధుసూదన్ రావు అన్నారు.సోమవారం సింగరేణి మండల పరిధిలోని గేట్ కారేపల్లి ఏసుక్రీస్తు ప్రార్థన మందిరంలో సింగరేణి మండల పాస్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ, దేశ ప్రజలు క్షేమంగా,ఐక్యతగా ఉండాలని పేద వారికి మన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఖమ్మం జిల్లాలో ఒక అద్భుతమైన మీటింగు జరగబోవుచున్నదని అలాగే డోర్నకల్ లో ఈనెల 18 నుండి 20 వరకు గొప్ప సమావేశం జరగందన్నారు. ఈ ప్రత్యేక ప్రార్థన సమావేశానికి ఆహ్వానితులుగా డాక్టర్ రెవరెండ్ కొరియన్,జడ్సన్, గ్రేస్ కొరియన్ వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిసిసి రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ,సింగరేణి మండల వ్యవస్థాపకులు తన్నీరు మధుసూదన్ రావు మండల అధ్యక్షులు ప్రేమ్ సాగర్, విలియం కేరి, పాలరాజు,బాబురావు, మోజస్,ఉపేందర్, లాజరస్, జాషువా, జయరాజు ప్రసాద్, సుదర్శన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా: వివిధ సమస్యలపై అర్జీదారులు ప్రజావాణి కార్యక్రమంలో అందిస్తున్న దరఖాస్తులను అధికారులు సమన్వయంతో పని చేసి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య తెలిపారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు తో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జైపూర్ మండలం వేలాల గ్రామానికి చెందిన గుండోజు రాజేందర్ తాను సాదాబైనమా ద్వారా కొనుగోలు చేసిన భూమిని తన పేరిట పట్టా మార్పు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మందమర్రి మండలం పులి మడుగు గ్రామానికి చెందిన నాగవత్ కమల తాను సమ్మర్ క్యాంప్ లో పాఠశాల తరగతులు చెప్పానని, వేతనం ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మంచిర్యాల పట్టణంలోని శివాజీ బాండ్ రోడ్ కాలనీ వాసులు దరఖాస్తులో తమ వార్డులో త్రాగునీటి సరఫరా సమయాన్ని ఉదయం 3.45 గంటల నుండి ఉదయం 6 గంటలకు మార్చవలసిందిగా కోరారు. తాండూర్ మండల కేంద్రానికి చెందిన జంశెట్టి బొందయ్య తన ఇంటికి గృహ జ్యోతి పథకం వర్తింపచేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి మండలం కాసిపేటకు చెందిన దుర్గం చంద్రయ్య సింగరేణి సంస్థ కొరకు తీసుకున్న తన భూమికి సంబంధించి ఆలస్యమైన పరిహారంపై వడ్డీ చెల్లించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మందమర్రి మండలం రామకృష్ణాపూర్ కు చెందిన ఇఫ్షత్ సుల్తానా తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాసిపేట మండలం ముత్యంపల్లి గ్రామానికి చెందిన షేక్ బాబర్ తన తాతల నుండి వచ్చిన భూమిని అక్రమంగా చేసుకున్న పట్టాను రద్దు చేసి వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 27 దరఖాస్తులు అందాయని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలకు శంకుస్థాపన.. వైద్య విద్యలో మరో మైలురాయి

విశాలాంధ్ర బ్యూరో-మెదక్: శాశ్వత భవన నిర్మాణం మెదక్ వైద్య విద్యారంగంలో మరొక మైలురాయి అని ఎమ్మెల్యే డా.మైనంపల్లి రోహిత్ అన్నారు. మెదక్ పట్టణం పిల్లికొటాల శివారులో ప్రభుత్వ మెడికల్ కాలేజీ శాశ్వత భవన నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ... 20 ఎకరాల విస్తీర్ణంలో రూ.180 కోట్ల వ్యయంతో అత్యాధునిక సౌకర్యాలతో మెడికల్ కాలేజీ బిల్డింగ్ నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు. మెడికల్ కాలేజీ మంజూరై ఎంబీబీఎస్ సెకండ్ ఇయర్ అడ్మిషన్ లు కూడా జరుగగా, ఇపుడు చేపడుతున్న పక్కా భవనం నిర్మాణం పూర్తి అయితే ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం వైద్య రంగానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రాథమిక వైద్యంతో పాటు అత్యంత ప్రధానమైన వైద్య విద్యను అందించేలా మెడికల్ కళాశాలను రూపొందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రపాల్, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ నితిన్ కాబ్రా, సూపరింటెండెంట్ డాక్టర్ సునీత, డీసీహెచ్ఎస్ డాక్టర్ శివ దయాల్, ఎంసీహెచ్ హెచ్ఓడి రాజశ్రీ పాల్గొన్నారు. మెదక్ నియోజకవర్గ

ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

అభివృద్ధికి కృషి చేస్తున్నామని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. మండల పరిధి చీకోడ్, నాగ్సాన్ పల్లి గ్రామాల్లో రూ.20 లక్షలతో కొత్తగా నిర్మించిన పశు వైద్యశాలలను ప్రారంభించారు. పశువైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ నాణ్యమైన సేవలు అందించాలన్నారు. మూగజీవాలకు మెరుగైన వైద్యం అందించేందుకు వీలుగా పశువైద్యశాలలను ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటయ్య, పీఆర్ డీఈ పాండురంగారెడ్డి, ఏఈ గోపాల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రశాంత్ రెడ్డి, గోవింద్ నాయక్, శ్రీకాంతప్ప, ఆకుల శ్రీనివాస్, నరేందర్ గౌడ్, చోటు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో కొనుగోలు కేంద్రాలుండాలి: కూనంనేని

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : రైతులు పండించిన ప్రతిగింజనూ కొనుగోలు చేసేవిధంగా అధికారులు ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలిగించినా సహించేదిలేదని హెచ్చరించారు. రైతులకు సౌకర్యవంతంగా అందుబాటులో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. సోమవారం లక్ష్మీదేవిపల్లి మండలంలోని చాతకొండ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం జరిగిన రైతు సభలో ఆయన మాట్లాడుతూ దళారులను ఆశ్రయించకుండా ఈ కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలనీ కోరారు. ఏమైనా సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించడానికి కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. సంఘం అధ్యక్షులు మండే హన్మంతరావు, ఉపాధ్యక్షులు కూచపుడి జగన్, డైరెక్టర్ చంద్రగిరి శ్రీనివాసరావు, తహసీల్దార్ శిరీష, ఎంపిడివో అంకుబాబు, ఎంపివో శ్రీనివాసరావు, ఏఈ రాకేష్, సివిల్ సప్లై డీటీ మహేష్, విద్యుత్ శాఖా ఏఈ రఘురామయ్య, హౌసింగ్ ఏఈ దేవిడ్, ఆర్ఐ శివకృష్ణ, సిపిఐ నాయకులు దీటి లక్ష్మీపతి, నూనావత్ గోవిందు, మంద గ్రాబ్రియల్, కోడి లింగయ్య, వర్స లక్ష్మయ్య, మాధవరావు పాల్గొన్నారు.

జీపీ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర-మరిపెడ: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం లచ్చ తండాలో సోమవారం రూ.20 లక్షల ఐటీడీఏ నిధులతో నిర్మించనున్న నూతన జీపి భవన నిర్మాణానికి ఐటీడీఏ ఏఈ ఎర్రయ్య, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు గుగులోత్ నరేందర్ నాయక్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నరేందర్ నాయక్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ నూతన భవనం కోసం ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఒంటికొమ్ము యుగంధర్ రెడ్డి, కాంగ్రెస్ మరిపెడ మండల పార్టీ అధ్యక్షుడు పెండ్లి రఘువీర్ రెడ్డి, కాంగ్రెస్ యువ నాయకుడు నూకల అభినవ్ రెడ్డిలతో పాటు సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి హారిక, గుగులోత్ వెంకన్న,గుగులోత్ బాలు, పాపలాల్, లక్ష్మణ్, రమేష్ సాగర్, జమ్లా, భగవాన్, శంకర్, దేవదాసు, సోమ్లా, కారోబార్ నరేష్, తండా పెద్దలు, తండావాసులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ,పీఎంపీలపై దాడులు సరికాదు

విశాలాంధ్ర-తొర్రూరు: ఆర్.ఎం.పి పి.ఎం.పిలపై దాడులు చేయడం సరికాదని ఆర్ఎంపి పిఎంపి వెల్ఫేర్ అసోసియేషన్ తొర్రూరు మండల అధ్యక్షులు ధర్మారపు హన్మంతు అన్నారు. తొర్రూరు మండల కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన అసోసియేషన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ వైద్యులే గ్రామాలకు పట్టు కొమ్మలని.. గ్రామీణ వైద్యులు లేని గ్రామాలు ఆరోగ్యవంతమైన గ్రామాలు ఉండవని ఉన్నారు. ప్రథమ చికిత్సలకు కూడా కార్పొరేటు ఆసుపత్రులకు వెళ్లలేక ఫీజులు కట్టే పరిస్థితుల్లో ఉండని పేద ప్రజలు ఆర్ఎంపి ,పిఎంపీల సేవలతో ప్రజలు ఆరోగ్యంగా జీవిస్తున్నారని తెలిపారు. అలాంటి ఆర్ఎంపి పిఎంపీలను ప్రభుత్వం విస్మరించడం సరికాదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వారిపై టిజిఎంసి, ఐఎంఏ దాడులను అరికట్టాలని, గ్రామీణ వైద్యులందరూ ఏకతాటిపైకి వచ్చి నిరసన కార్యక్రమాలు ఆందోళన పోరాటాలు నిర్వహించడానికి వెనుకాడబోమని అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ పాలకుర్తి నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ సింగారపు భీమయ్య, నియోజకవర్గ ఉపాధ్యక్షులు గడ్డం రాజమౌళి, తొర్రూరు మండల కోశాధికారి గద్దల వెంకటేష్, తొర్రూరు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మనబోయిన యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

రెనాల్ట్-నిస్సాన్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ ఘన విజయం

విశాలాంధ్ర-కొనిజర్ల: విజయ ఇంజినీరింగ్ కాలేజ్ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఈసీఈ మరియు ఈఈఈ విభాగాల ఫైనల్ ఇయర్ ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం ప్రముఖ అంతర్జాతీయ ఆటోమొబైల్ సంస్థ రెనాల్ట్%-%నిస్సాన్ ప్రత్యేక ఆన్ క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించింది. ఏర్పాటు చేసిన ఈ ప్లేస్‌మెంట్ కార్యక్రమానికి ఫైనల్ ఇయర్ విద్యార్థులు భారీ సంఖ్యలో హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. రాత పరీక్ష, టెక్నికల్ ఇంటర్వ్యూ, హెచ్ఆర్ రౌండ్స్ వంటి దశల ఎంపిక ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన నలభై (40)మంది విద్యార్థులు రెనాల్ట్%-%నిస్సాన్ కంపెనీలో ఎంపిక కావడం విశేషం. ఈ సందర్భంగా కళాశాల వైస్ చైర్పర్సన్ శ్రీమతి పారుపల్లి విజయలక్ష్మిలి ఎంపికైన ఫైనల్ ఇయర్ విద్యార్థులను అభినందిస్తూ వారికీ లిఆఫర్ లెటర్ అందించారు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. చిన?న్నియ్య వైస్ ప్రిన్సిపాల్ మరియు ప్లేస్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ అయేషా తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాకు తరలిన పెన్షనర్లు

విశాలాంధ్ర-ఖమ్మం: పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల జేఏసి -ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని ఇందిరాపార్కులో జరిగిన మహా ధర్నాకు ఖమ్మం జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో పెన్షనర్లు తరలి వెళ్లారు. ఖమ్మం పెన్షనర్ల కార్యాలయం నుంచి ప్రత్యేక వాహనాల్లో హైదరాబాద్ తరలి వెళ్లారు. ఈ -సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పరిశ పుల్లయ్య, రాయల రవి కుమార్ లు మాట్లాడుతూ పెన్షనర్ల ఆందోళన తీరు చూసైనా ప్రభుత్వం స్పందించాలన్నారు. తక్షణం పెన్షనర్లకు రావాల్సిన బకాయిలను విడుదల చేయాలని పుల్లయ్య, రవికుమార్ లు డిమాండ్ చేశారు. జిల్లా నుంచి హాజరైన ప్రముఖుల్లో మేరీ ఏసుపాదం, గుర్రాలశ్రీనివాసరావు శరత్ బాబు,భాస్కరాచారి, కనపర్తివెంకటేశ్వర్లు, ఊడుగువెంకటేశ్వర్లు, తాడిఅంజలి, వీరభద్రరావు, కొట్టెఅన్నమ్మ, యం. ఉషారాణి, యార్లగడ్డశైలజ, సుధాకర్, ప్రసాద్ తదితరులు ఉన్నారు

సంపాదకీయం

హసీనాకు ఉరిశిక్ష!

బంగ్లాదేశ్ అల్లర్ల కేసులో ఆ దేశ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనాకు మరణశిక్ష విధిస్తూ ఢాకాలోని ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్ ఇచ్చిన సంచలన తీర్పు మరోసారి బంగ్లాదేశ్‌ను ఇబ్బందుల్లోకి నెట్టింది. ఆమెకు ఉరిశిక్ష అమలు అవుతుందా లేదా అన్న అంశాన్ని పక్కనబెడితే, దేశంలో 'కనిపిస్తే కాల్చివేత' ఉత్తర్వులు జారీ చేయడం ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. గత ఏడాది జులై-ఆగస్టు మాసాల్లో జరిగిన అల్లర్లలో 1400 మంది పౌరులు మరణించడానికి కారణం షేక్ హసీనా అంటూ వెల్లువెత్తిన ఫిర్యాదుల మేరకు ఈ ట్రిబ్యునల్ (ఐసీటీ) ఆమెను దోషిగా ప్రకటించింది. ఆమెతో పాటు మాజీ హోంమంత్రి మరణశిక్ష, పోలీస్ శాఖ మాజీ అధిపతికి ఐదేళ్ల జైలుశిక్ష సైతం విధించిన కోర్టు ఈ శిక్షలపై సుదీర్ఘ తీర్పునే చదివి విన్పించింది. బంగ్లాదేశ్‌లో తాజా పరిణామాలు భారత్‌కూ ఇబ్బంది కలిగించేవే. ఒక విధంగా చెప్పాలంటే, షేక్ హసీనా చారిత్రక నేపథ్యం, రాజకీయ ప్రస్థానం అసామాన్య మైనదే. ఆమె బంగ్లాదేశ్ రాజకీయాల్లో సుదీర్ఘకాలం పాటు తిరుగులేని శక్తిగా ఉన్న విషయం విస్మరించలేనిది. ఆమెను 'ఉక్కు మహిళ' అని పిలుస్తారు. ఆమె బంగ్లాదేశ్ జాతిపిత, దేశ తొలి అధ్యక్షుడు షేక్ ముజిబుర్ రెహమాన్ కుమార్తె. 1975 ఆగస్టు 15న జరిగిన సైనిక తిరుగుబాటులో ఆమె తండ్రి, తల్లి, ముగ్గురు సోదరులు సహా కుటుంబ సభ్యులు అందరూ దారుణంగా హత్యకు గురైన ఉదంతం బంగ్లా చరిత్రలోనే రక్తాక్షరాలకు నిదర్శనం. ఆ సమయంలో హసీనా, ఆమె సోదరి మాత్రమే జర్మనీలో ఉండటంతో ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటన తర్వాత ఆమె సుమారు ఆరేళ్లపాటు భారతదేశంలో ప్రవాసంలో ఉన్నారు. ఆ సమయంలో భారత ప్రధాని ఇందిరాగాంధీ ఆమె కుటుంబానికి ఆశ్రయం కల్పించారు. 1981 లో బంగ్లాదేశ్ తిరిగి వచ్చి, తన తండ్రి స్థాపించిన అవామీ లీగ్ పార్టీకి నాయకత్వం వహించి, సైనిక పాలకుడు లెఫ్టినెంట్ జనరల్ ఎర్షాద్ పాలనకు వ్యతిరేకంగా పోరాడి, దేశంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణకు కృషి చేశారు. హసీనా తొలిసారిగా 1996 నుంచి 2001 వరకు, మళ్లీ 2009 నుంచి 2024 ఆగస్టులో రాజీనామా చేసే వరకు నిరంతరాయంగా 15 సంవత్సరాలకు పైగా ప్రధానిగా కొనసాగారు. ప్రపంచంలో ఎక్కువ కాలం ప్రభుత్వ అధినేతగా పనిచేసిన మహిళల్లో ఆమె ఒకరు. ఆమె హయాంలో బంగ్లాదేశ్ స్థూల దేశీయోత్పత్తి గణనీయంగా పెరిగింది. పేదరిక నిర్మూలన, ఆర్థిక వృద్ధికి కృషి చేశారు. ఈ దశలో 2024 జులై-ఆగస్టులో ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోటాకు వ్యతిరేకంగా మొదలైన విద్యార్థి నిరసనలు తీవ్రరూపం దాల్చాయి. దేశ వ్యాప్తంగా అల్లర్లు, హింస చెలరేగడంతో, ఆమె 2024 ఆగస్టు 5 న రాజీనామా చేసి దేశం విడిచి భారత్ చేరుకున్నారు. ప్రస్తుతం ఆమె భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. ఆ తర్వాత ఆమెపై అనేక కేసులు నమోదయ్యాయి. అందులో అత్యంత ముఖ్యమైనది అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్‌లో నమోదైన మానవాళికి వ్యతిరేకంగా నేరాల కేసు. విద్యార్థుల నిరసనలను అణచివేయడానికి హసీనా ప్రభుత్వం అమానుష చర్యలకు పాల్పడటం ప్రధాన ఆరోపణ. 2024 జులై 14 న ఆమె చేసిన ప్రసంగం నిరాయుధ విద్యార్థి నిరసనకారులపై హింసాత్మక దాడులకు ప్రేరేపించాయని, నిరసనకారులపై హెలికాప్టర్లు, డ్రోన్లు, ఘాతక ఆయుధాలను ఉపయోగించాలని ఆదేశించారని, దారుణాలను నివారించడంలో విఫలమయ్యారంటూ ఆమెపై ప్రధాన అభియోగాలు మోపారు. నిజానికి హసీనా దేశం విడిచి వెళ్లిపోవడంతో, ఈ విచారణ ఆమె పరోక్షంలోనే జరిగింది. ఐసీటీ చట్టం ప్రకారం, హసీనా సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకోవాలంటే, ఆమె తీర్పు వచ్చిన 30 రోజుల్లోపు కోర్టుకు లొంగిపోవడం లేదా అరెస్ట్ కావడం తప్పనిసరి. కాకపోతే, ఈ తీర్పు 'పక్షపాతంతో కూడినది', 'రాజకీయ ప్రేరేపితమైనది', మొహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం పన్నిన 'కుట్ర'గా హసీనా కొట్టిపారేసిన అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఈ విచారణ న్యాయబద్ధంగా జరగలేదని ఆమె తరుపు న్యాయవాదులు ఐక్యరాజ్య సమితికి కూడా ఫిర్యాదు చేసిన విషయం గమనార్హం. హసీనాకు ఉరిశిక్ష విధిస్తూ విడుదలైన తీర్పుతో రెండు అంశాలు తెరపైకి వచ్చాయి. మొదటిది, బంగ్లాదేశ్ రాజకీయ, ఆర్థిక సంక్షోభం మరింత తీవ్రతరం కావడం; రెండోది, బంగ్లాదేశ్ అరవయ్యేళ్ల తర్వాత పాకిస్థాన్‌కు దగ్గరవడం. ఈ రెండూ పొరుగునున్న భారత దేశానికి ప్రమాదకరమైన సంకేతాలే. హసీనా నిష్క్రమణ తర్వాత నోబెల్ బహుమతి గ్రహీత అయిన ప్రొఫెసర్ ముహమ్మద్ యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడినప్పటికీ, దేశంలో రాజకీయ అస్థిరత, అశాంతి కొనసాగుతున్నాయి. యూనస్ ప్రభుత్వంపై కూడా వ్యతిరేకత మొదలైనట్లు వార్తలు వస్తున్నాయి. హసీనాకు చెందిన అవామీ లీగ్ పార్టీపై నిషేధం విధించడం ప్రజాస్వామ్య వ్యతిరేకమే.

సంక్షోభ పరిస్థితుల్లో దేశంలో స్థిరత్వాన్ని పునరుద్ధరించడమనే సాకుతో సైన్యం చొరవ మితిమీరిపోయింది. హసీనాగానీ, ఆమె తండ్రి రెహమాన్ గానీ...ఇద్దరూ భారత్‌కు అనుకూలురే. ఇప్పుడున్న యూనస్ పాక్‌కు అనుకూలం. పాకిస్థాన్ వేపు బంగ్లా మొగ్గుచూపుతున్న అనేక ఉదంతాలు ఈ మధ్య ప్రత్యక్షంగా కన్పించాయి. హసీనా పాలనలో, బంగ్లాదేశ్ భారతదేశంతో చాలా దగ్గరి సంబంధాలు కొనసాగించారు. ఇప్పుడు యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం పాకిస్థాన్ నుంచి సహకారాన్ని ఆహ్వానించడం ఆరు దశాబ్దాల్లో కొత్త పరిణామం. రెండు దేశాల సీనియర్ సైనిక ప్రతినిధుల పరస్పర పర్యటనలు జరగడం, పాకిస్థాన్ నౌకాదళ అధిపతి బంగ్లాదేశ్‌లో పర్యటించడం భారత్‌ను కలవరపరిచే అంశాలే. ముహమ్మద్ యూనస్, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ వంటి ఉన్నత స్థాయి నాయకులు అంతర్జాతీయ భేటీల సందర్భంగా సమావేశమై, ఆర్థిక సహకారాన్ని పెంపొందించడం గురించి చర్చించడం వివాదాస్పదమైంది. 2024 చివరి త్రైమాసికంలో ఉభయ దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం సుమారు 27% పెరిగినట్లు అంచనా. తాత్కాలిక ప్రభుత్వం చైనాతోనూ సంబంధాలను మెరుగుపరుచుకుంది. ఈ పరిణామాలు భారతదేశానికి వ్యూహాత్మక ఆందోళన కలిగించడం సహజమే. దీన్ని అలుసుగా తీసుకొని బంగ్లాదేశ్‌లో పాకిస్థాన్ అనుకూల వర్గాలు, ఇస్లామిస్ట్ శక్తులు తమ ప్రభావాన్ని పెంచుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు నిఘా నివేదికలు ఆరోపిస్తున్నాయి. తాత్కాలిక ప్రభుత్వం పాకిస్థాన్ ముందు 1971 యుద్ధంలో జరిగిన దారుణాలకు అధికారికంగా క్షమాపణ చెప్పాలని, అపరిష్కృతంగా ఉన్న 4.5 బిలియన్ డాలర్ల అప్పును తిరిగి చెల్లించాలని డిమాండ్లను మళ్లీ లేవనెత్తింది. బంగ్లాదేశ్ తన విదేశాంగ విధానంలో భారతదేశంపై ఆధారపడటాన్ని తగ్గించుకొని, పాకిస్థాన్‌తో సహా ఇతర దేశాలతో దౌత్య, రక్షణ సంబంధాలను మెరుగుపరుచుకునే దిశగా అడుగులు వేయడం ప్రాంతీయ వ్యూహాత్మక సర్దుబాటుగా అంతర్జాతీయ పరిశీలకులు భావిస్తున్నారు. అది భారత భద్రతకు ముప్పు కావచ్చు. పాకిస్థాన్-అనుకూల, మతపరమైన అతివాద శక్తులు బంగ్లాదేశ్‌లో బలం పుంజుకునే ప్రమాదం ఉంది. వివాదాస్పద మత బోధకుడు జకీర్ నాయక్ పర్యటనకు యూనస్ ప్రభుత్వం అనుమతి ఇవ్వడం ఈ ఆందోళనను మరింత పెంచింది. భారతదేశ ప్రధాన భూభాగాన్ని ఈశాన్య రాష్ట్రాలతో కలిపే సిలిగురి కారిడార్ (చికెన్ నెక్) వ్యూహాత్మకంగా అత్యంత సున్నితమైన ప్రాంతం. యూనస్ 'ఈశాన్య రాష్ట్రాలు భూపరివేష్టితమై ఉన్నాయి' అంటూ చైనాను ఆ ప్రాంతంలో విస్తరించమని బహిరంగంగా వ్యాఖ్యానించడం భారత సార్వభౌమత్వానికి ప్రత్యక్ష సవాలుగా మారింది. సిలిగురి కారిడార్‌లో భారత్ భద్రతను పెంచినప్పటికీ, బంగ్లా పరిణామాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన తరుణం ఆసన్నమైందని కచ్చితంగా చెప్పవచ్చు. లేకుంటే, దీర్ఘకాలిక సవాళ్లు తప్పవు.

హర్రర్! టెర్రర్!

చింతపట్ల సుదర్శన్

భాష ఏదైతేనేం భావమొక్కటేనన్నట్టు, ఏ భాష పేపరయితేనేం నవలడానికని, కంటికి కనిపించినవీ, నోటికి అందొచ్చినవీ అయిన పేపరులను నవిలి 'ఫుడ్‌బాక్స్' అయిన కడుపులో డిపాజిటు చేసి భారంగా నడుచుకుంటూ తన 'కేర్ ఆఫ్ అడ్రసు'ను సమీపించింది డాంకీ. నిర్మానుష్యంగా ఉండాల్సిన ఆ కూలిన కొంప ముందు కార్లు, అరుగు మీద మనుషులు కనిపించడంతో ఉలిక్కిపడ్డది డాంకీ. దేశంలో కోర్టులు చురుగ్గా పనిచేయడం మొదలుపెట్టేయా, పెండింగ్ కేసులు పేరుకుపోయినయని తీర్పులు వేగంగా చెయ్యడం ఆరంభించేయా, కోర్టుల తీర్పులు ఏళ్లకొద్దీ అమలు కాకుండా వెంటవెంటనే అమలయ్యే రోజులు వచ్చేసినవా అని దిగులుపడ్డది డాంకీ. ఇక ఈ ఇంటికి సంబంధించిన కేసు కొలిక్కి వస్తే తనకూ, డాగీకి ఉండటానికి చోటు లేనట్టే అని బెంగపడుతూ,

రంగస్థలం

మనుషులకి కనపడకుండా ఓ మొండిగోడ పక్కన నిలబడి వాళ్ల మాటలు వినసాగింది.

ఓ అరగంట తర్వాత కార్లు బయలుదేరేయి మనుషుల్ని మోసుకుంటూ. ఇప్పటికి కానీ అరుగు ఎక్కే అవకాశం రాలేదు అనుకుంటూ అరుగు ఎక్కింది డాంకీ. గోడ చాటున పొంచి ఉండి, తాను విన్న మాటలు గుర్తు చేసుకోసాగింది. ఎప్పుడు వచ్చి అరుగు ఎక్కిందో మరి డాగీ, చెవిలో 'భవ్వు' మనడంతో ఈ లోకంలోకి వచ్చిపడ్డది డాంకీ. అబ్బ! ఏంటా అరుపు దడుచుకునేట్లు అంది చిరాగ్గా. అరవక ఏం చెయ్యాలో తెలీలేదన్నా. సారీ! ఏ లోకంలో ఉన్నావసలు అంది డాగీ. లోకం సంగతి వదిలెయ్యి. ఈ ప్రశ్నకు బదులేదో చెప్పు అంటూ అడిగింది డాంకీ. 'ఈ లోకంలో దెయ్యాలున్నాయా?' దయ్యాలా? ఇదేం ప్రశ్న. సరే ఉంటే ఉన్నాయేమో! అయినా మనుషుల్తోనే వేగలేక, మొరగలేక చస్తుంటే మధ్యన ఈ దెయ్యాల మ్యాటరేంటసలు అన్నది డాగీ. ఏం లేదోయ్. నేను వచ్చేటప్పటికి అరుగుమీద మనుషులూ, అరుగు కింద కార్లూ కనిపించేయి. చాటుగా ఉండి వింటే తెలిసింది. వాళ్లేదో సినిమా వాళ్లట. దెయ్యాల సినిమా తీస్తున్నారట. మన ఈ కూలిన కొంపలో దెయ్యాలని ఆడించీ, పాడించీ సినిమా తీద్దామనుకుంటున్నారట. అది విన్నప్పట్నించి మన చాపకింద నీళ్లు వస్తయేమోనని భయం వేస్తున్నది. ఎన్నడూ లేంది దెయ్యాల గురించి ఆలోచన వచ్చి నిజంగానే ఈ కొంపలో దెయ్యాలు లేవు కదా అన్న చర్చ కూడా లోలోపల స్టార్టయింది. అందుకే నిన్నడిగా కుక్కలకు దయ్యాలు కనపడ్తయట కదా! ఎప్పుడైనా చూశావా? అంది డాంకీ. ఎవడన్నాడామాట. చీకట్లో, గాలిలో ఏ కదలికయినా కనిపిస్తే, ఏ అలికిడైనా వినిపిస్తే 'భౌభౌ' లంకించుకుంటా కానీ ఎప్పుడూ చూసింది లేదు. ఈ మనుషుల్ని మించిన దెయ్యాలనేవి ఉండవు అంది డాగీ. అప్పుడొచ్చాడబ్బాయి. ఏమిటి దెయ్యాలంటున్నారు. ఓ చోట ఎన్నికలూ, ఓ చోట బైపోల్ జరిగితే ఆ విషయం వదిలేసి అన్నాడబ్బాయి నవ్వుతూ. ఎన్నికల గురించి కొత్తగా ఏం మాట్లాడతాం బ్రో. అవే వేషాలు, అవే టక్కుటమార, గజకర్ణ గోకర్ణ విద్యలు, మసిపూసిన మారేడు కాయలు ఎప్పుడూ పాలిటిక్సేనా, ఈవేళ దయ్యాల గురించి మాట్లాడుకుందాం అంది డాంకీ. అవును 'బ్రో' ఎన్నికలైపోయేయి. కార్యకర్తలకూ, మా వాళ్లకే తిండి బాగానే దొరికింది ఓట్లు వేసేవాళ్లకి రొక్కమూ, చీరాసారే, సారా అన్నీ దొరికేయి ఎప్పట్లాగే చచ్చినోళ్ల ఓట్లేయడం, వెయ్యడానికి వచ్చిన వాళ్ల ఓట్లు గల్లంతైపోవడం వంటివి జరిగిపోయినయి. ఇంకెందుకు? మళ్లీ ఎన్నికలు వచ్చేదాకా నాయకుల జోలపాటలు వింటూ పడుకోవడమే కదా ఓటర్లపని అంది డాగీ. అవును తంబీ, ఎన్నికల్లో గెలిచినోళ్లలో తొంభైశాతం మంది కోటీశ్వరులు, ఓ పాతిక మంది హత్యానేరంలోనూ, డజను మంది లైంగిక వేధింపుల కేసుల్లోనూ ఉన్నారన్న విషయం వదిలేద్దాం. ముందు ముందు ఈ విషయంలో మరింత పురోభివృద్ధి ఉంటుందనుకుందాం కానీ ఇప్పుడు బర్నింగ్ టాపిక్ దెయ్యాలే మనకు అంది డాంకీ.

అవును బ్రో! ఎవరో ఈ కొంపలో దయ్యాల సినిమా షూట్ చేద్దామనుకుంటున్నారంట. మన డాంకీ వాళ్ల మాటలతో అర్థం చేసుకుంది. మనుషుల కథలు కరువయ్యాయా వీళ్లకి అంది డాగీ. అవును డాగీ, డాంకీ ఇప్పుడు టీవీ ఓటీటీల్లో బాగా ఆడుతున్నవి హర్రర్ సినిమాలే. ప్రజల్ని భయపెట్టి డబ్బు దోచుకోవడానికి బాగా పనికొస్తున్నాయి అన్నాడు అబ్బాయి. అయితే నువ్వేమంటావు బ్రో దయ్యాలనేవి ఉన్నాయంటావా? అన్నది డాంకీ. సినిమాల్లోనైతే ఖచ్చితంగా ఉంటాయి. ఇది వరకు కనిపించీ కనపడకుండా పాటలు పాడేవి. ఇప్పుడు లైట్లు వేస్తూ, ఆర్పుతూ, కిటికీలు బాదుతూ, మంచాలు ఎత్తుతూ 'బీజీఎమ్' తో చెలరేగిపోతున్నవి అన్నాడు అబ్బాయి. ఈ మనుషులు ఏం చేసినా డబ్బు సంపాదించడం కోసమే కదా, కూడబెట్టడం, దాచుకోడం కోసమే కదా అంది డాంకీ.

దెయ్యాలు ఉనాయని భయపడే మనుషులను వణికించడానికే హర్రర్ సినిమాలు. అమెరికాలో అయితే 'హాలోవిన్ డే' అనగా దెయ్యాల దినం జరుపుకుంటారు. మనుషులే దెయ్యాల వేషాలు వేసుకుని జడిపిస్తారు జనాన్ని అన్నాడు అబ్బాయి.

నాకర్థం అయ్యింది. నిజానికి దెయ్యాలనేవే లేవన్న మాట. వాటి పేరు చెప్పుకుని జనం జేబులు కొట్టెయ్యడానికే, ఈ కొంపలో షూటింగన్నమాట, అప్పుడు మనం ఏ చెట్టుకిందికో పోవాలన్న మాట అంది డాంకీ.

నువ్వేం వర్రీ అవకు డాంకీ. ఎవడన్నా షూటింగ్‌కు వస్తే మన బస్తీ డాగ్స్‌నన్నింటినీ తీసుకు వస్తా. మా అరుపులకు వాళ్లూ, వాళ్ల దెయ్యాలూ పారిపోవాల్సిందే! అంది డాగీ.

ఏ చెట్టు కొమ్మన ఏ దెయ్యం వేళ్లాడుతూ పళ్లికిలిస్తుందో, చీకటి పడుతున్నది నే బయలుదేరుతా అంటూ అరుగు దిగాడు అబ్బాయి.

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ముమ్మరపోరు

డి.రాజా
సీపీఐ ప్రధాన కార్యదర్శి

నేటి సామ్రాజ్యవాదానికి సంప్రదాయక అర్థంలో ఇంకెంతమాత్రమూ వలస ప్రాంతాలు అక్కర్లేదు. అది ఫైనాన్స్, డేటా, టెక్నాలజీ నెట్‌వర్క్‌ల ద్వారా పరిపాలిస్తుంది. అవి పెట్టుబడి కూడబెట్టటమనే తర్కానికి దేశాలను నిబద్ధం చేసే అగోచర సంకెళ్లు. ప్రచ్ఛన్నయుద్ధ అస్థికల నుంచి ఆవిర్భవించిన ప్రపంచం ప్రపంచీకరణ, నయా ఉదారవాదం బ్యానర్ కింద అనంతమైన సౌభాగ్యాన్ని తప్పుగా వాగ్దానం చేసింది. అందుకు బదులుగా మనకు లెనిన్ గుర్తించిన ప్రపంచం వెనువెంటనే గుర్తుకు వస్తుంది : అది "గుత్తపెట్టుబడిదారులు, ద్రవ్యపెట్టుబడి ఆధిపత్యం వహించే ప్రపంచం; లాభార్జనే ఏకైక సూత్రంగా కలిగిన కొద్ది ప్రభుత్వాల మధ్య విభజితమైన ప్రభుత్వం". ఎదురులేకుండా మూడు దశాబ్దాలపాటు ఆధిపత్యం చెలాయించిన అమెరికా సంయుక్త రాష్ట్రాలు ఇప్పుడు ఆ ఆధిపత్యం క్షీణింపును వెనక్కు మళ్లించలేని స్థితిని ఎదుర్కొంటున్నది. అయితే అంతకు ముందున్న ప్రతి ఒక్క సామ్రాజ్యంలాగే అది తన అధికారాన్ని హుందాగా వదులుకోవటానికి తిరస్కరిస్తున్నది. డాలర్, నాటో, ఐఎంఎఫ్ ద్వారా విధేయతను విధించిన ఏకధృవ ప్రపంచం దానిలోని వైరుధ్యాలతో కూలిపోతున్నది. దాని స్థానంలో బహుళ ధృవ కూర్పు ఆవిర్భవిస్తున్నది. బ్రిక్స్ బ్లాక్ అతి స్పష్టంగా దానికి ప్రాతినిధ్యం వహిస్తున్నది. అమెరికా పెత్తనంతో అలిసిపోయిన ప్రపంచం నుంచి చారిత్రక అవసరంగా ఉద్భవించింది బ్రిక్స్. అమెరికా సామ్రాజ్యవాదం బరితెగింపు ప్రతి చోట అది విధించే ఆంక్షల్లో, వాణిజ్య యుద్ధాల్లో, సైనిక దిగ్బంధనాల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తున్నది. డోనాల్డ్ ట్రంప్ సుంకాలను ఆయుధాలుగా మార్చటం "స్వేచ్ఛా వాణిజ్యం" ఒక ఎత్తుగడ తప్ప ఎన్నడూ ఒక సూత్రం కాదని వెల్లడిస్తున్నది. అమెరికా ఒకప్పుడు గన్‌బోట్లను ప్రయోగించినట్లుగా ఇప్పుడు ఆర్థిక బలాత్కారాన్ని ఉపయోగిస్తున్నది. వాషింగ్టన్ ఇప్పటికీ బెదిరించగలదు, కాని ఎంతమాత్రం ఆదేశించలేదు. బ్రిక్స్ గ్రూపులో వృద్ధి చెందుతున్న సఖ్యత (పశ్చిమాసియా, ఆఫ్రికన్ రాజ్యాలను చేర్చుకుంటూ ఇప్పుడు దానిని విస్తరించారు) ఏకధృవ ప్రపంచకాలం ముగిసిందని సంకేతిస్తున్నది. ప్రపంచం రాజ్యాల బహుళ సమతౌల్యం దిశగా ప్రయాణిస్తున్నది. ఈ పరివర్తన గందరగోళంగా ఉన్నప్పటికీ అందులో విప్లవాత్మక శక్తి సామర్థ్యాలు ఇమిడి ఉన్నాయి.

"తన ఉత్పత్తి సాధనాలను నిరంతరం విప్లవీకరించకుండా బూర్జువావర్గం మనజాలదు" అని కారల్ మార్క్స్ ఒకప్పుడు అన్నారు. ఇది సాంకేతిక విజ్ఞానరంగంలో కన్నా మరెక్కడా సత్యం కాజాలదు. కృత్రిమ మేధ(ఏఐ), ఆటోమేషన్, బయోటెక్నాలజీ, డిజిటల్ నెట్‌వర్క్ పుష్కలత శకాన్ని వాగ్దానం చేస్తున్నాయి. అయినా అవి అసమానతను మరింత పెంచుతున్నాయి, సామాజికంగా ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ కింద టెక్నాలజీ మానవ అవసరాలను నెరవేర్చదు, లాభార్జనకు ఉపకరిస్తుంది. సాంకేతిక విజ్ఞాన శక్తి కొద్దిపాటి అమెరికా కంపెనీల్లో కేంద్రీకృతం కావటం (ఉదా: గూగుల్, యాపిల్, అమెజాన్, మెటా, మైక్రోసాఫ్ట్) లెనిన్ కాలం నాటి ద్రవ్య గుత్త సంస్థలను ప్రతిబింబిస్తున్నది. ఈ కంపెనీలు డిజిటల్ యుగంలో కొత్త ఈస్ట్ ఇండియా కంపెనీలు అవుతున్నాయి. అవి సుగంధ ద్రవ్యాలు లేదా పత్తి రాబట్టుకోవు, 21వ శతాబ్దం ముడిపదార్థమైన డేటాను ప్రపంచ వ్యాప్తంగా ఉన్న బిలియన్ల మంది వినియోగదారుల నుంచి రాబట్టుకుంటాయి. ప్రపంచ మానవాళి సమష్టిగా ఈ డిజిటల్ శ్రమ ద్వారా ఉత్పత్తి చేసిన సంపద సిలికాన్ వ్యాలీలో కేంద్రీకరించిన కొద్దిపాటి సంపన్నుల వద్దకు ప్రవహిస్తుంది.

పురోభివృద్ధిని అపహాస్యం చేస్తున్న ఫలితం:

భారతదేశం ప్రపంచంలోనే అత్యంత నిపుణులైన ప్రోగ్రామర్లు కొందరిని ఉత్పత్తి చేస్తున్నది. కాని దాని గ్రామాలు తాగునీటి కొరత ఎదుర్కొంటున్నాయి, నగరాలు కాలుష్యం కింద కూలుతున్నాయి. "డిజిటల్ ఇండియా" నినాదం ఒక లోతైన సత్యాన్ని దాచిపెడుతున్నది. టెక్నాలజీ విముక్తి శక్తిగా పనిచేసే బదులు, ప్రస్తుతమున్న అసమానతలను మరింత పెంచటానికి ఉపయోగిస్తున్నారు. సాధికారీకరణను వాగ్దానం చేస్తున్న ప్లాట్‌ఫాంలు సంశయాత్మకతను పాదుకొల్పాయి; ఆటోమేషన్ ఉద్యోగాలకు ముప్పు తెస్తున్నది, చదువు వాటిని భర్తీ చేయలేనంత వేగంగా తొలగిస్తున్నది. కార్పొరేట్ గుత్త పెట్టుబడి సంస్థలు ఆధిపత్యం వహిస్తున్న పాలకవర్గం ప్రపంచ ఫైనాన్స్‌తో చేతులు కలిపింది. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడిదారులు టెక్నాలజీ విజయాలతో ఉత్సవాలు చేస్తున్నారు. అయితే దానివల్ల లాభపడిందెవరన్న ప్రశ్నను తొక్కిపెడుతున్నారు. మార్క్స్ ఇలా అన్నారు. "ఉత్పత్తి శక్తులు కొద్దిమంది ఆస్తిగా ఉన్నంతకాలం ఆ శక్తుల అభివృద్ధి మానవాళి అభివృద్ధి కాబోదు". వెనుకబాటుతనానికి చికిత్సగా 1991 లో భారతదేశంలో ప్రవేశించిన నయా ఉదారవాదం సౌభాగ్యం ఉత్పత్తి చేయకపోగా విభజన తెచ్చింది. హిందూత్వతో దాని వివాహం కార్పొరేట్ లాభాపేక్షతో మత చాందసాన్ని కలగలిపిన ఒక సంకర వ్యవస్థను సృష్టించింది. మోదీ ప్రభుత్వ ఆత్మనిర్భర్ భారత్ వాగాడంబరం విదేశీ పెట్టుబడిపై విపరీతంగా ఆధారపడటాన్ని దాచిపెడుతున్నది, లఘు పరిశ్రమలను అంతరింపజేస్తున్నది. లేబర్‌కోడ్‌లు, ప్రభుత్వ ఆస్తుల ప్రైవేటీకరణ, వ్యవసాయాన్ని కార్పొరేట్‌లు స్వాధీనం చేసుకోవటం ఒకే తర్కం నుంచి వస్తున్నాయి. అదేమంటే, భారతదేశాన్ని దాని ప్రజలకు కాకుండా పెట్టుబడికి సురక్షితం చేయటం, ఎంతో గొప్పగా చెప్పుకున్న "మేక్ ఇన్ ఇండియా" ప్రచారం కూడా చౌక శ్రమను, బలహీనమైన పర్యావరణ చట్టాలను అనువుగా వాడుకోవడానికి బహుళజాతి కార్పొరేషన్‌లకు ఆహ్వానంగా మారింది. అందువల్ల భారతదేశంలో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటాన్ని... ప్రపంచ పెట్టుబడికి స్థానిక ఏజెంటుగా పనిచేస్తున్న దేశీయ బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా పోరాటం నుంచి వేరుచేయలేము. బ్రిక్స్‌లో, ఇతర బహుళధృవ వేదికల్లో భారత్ పాల్గొనటం వ్యూహాత్మక స్వయంప్రతిపత్తికి (స్ట్రాటజిక్ అటానమీ) నూతన అవకాశాలు ఆవిష్కరిస్తున్నది. అయితే సోషలిజం లేని స్వయంప్రతిపత్తి పరాధీనతను ఒక యజమాని నుంచి మరొక యజమానికి మార్చడం మాత్రమే చేస్తుంది. కార్మిక వర్గం అంటే ఏమిటో రైతాంగం, స్వాతంత్ర్యం నిర్వచించాలి. అది కేవలం ప్రపంచ శిఖరాగ్రసభల్లో సీటు కాకూడదు, జాతీయ వనరులు, టెక్నాలజీ, శ్రమపై ఆజమాయిషీగా ఉండాలి. ఉత్పత్తి భావనను - అనగా ప్రైవేటు లాభం కోసంగాక స్థానిక అవసరం ప్రకారం జరిగే ఉత్పత్తి అనే భావనను వామపక్షం తిరిగి సొంతం చేసుకోవాలి.

ప్రపంచ వ్యాప్తంగా, బహుళ ధృవ ప్రపంచం వృద్ధి చెందటం ఆటోమేటిక్‌గా దోపిడీని అంతం చేయదు. ప్రపంచ ప్రగతిశీల శక్తులు సోషలిస్టు ప్రత్యామ్నాయం చుట్టూ ఐక్యం కాగలిగితే అది దాన్ని అనుభవంలోకి తెచ్చేందుకు అవసరమైన పరిస్థితులు సృష్టిస్తుంది. లెనిన్ హెచ్చరిక ప్రవక్త బోధలా ఉంది: "పీడకులకు సహాయపడేటటువంటి పీడిత దేశాల బూర్జువా వర్గంలేనిదే సామ్రాజ్యవాదం నిర్జీవమవుతుంది." ఈనాడు పోరాట రేఖలు తూర్పు- మధ్య కాదు; పెట్టుబడి మధ్య, టెక్నాలజీపై గుత్తాధిపత్యం కలిగిన వారికీ- ఎవరి శ్రమ అయితే దాని మనుగడను నిలబెడుతుందో వారికీ మధ్యన. ఈ చారిత్రక అధిక స్రావాన్ని చైతన్యయుతమైన పోరాటంగా పరివర్తన గావించటం కమ్యూనిస్టు ఉద్యమ కర్తవ్యం. సామ్రాజ్యవాదం నూతన రూపాలను డిజిటల్, ఫైనాన్షియల్, పర్యావరణం - మనం బట్టబయలు చేయాలి, సరిహద్దులకు అతీతంగా కార్మికుల మధ్య సంఘీభావం నిర్మించాలి. కీలకమైన టెక్నాలజీలపై ప్రభుత్వ స్వామ్యం (ఓనర్‌షిప్) కోసం, డేటాపై ప్రజాస్వామిక నియంత్రణ కోసం, ఆవిష్కరణల సామాజీకరణ కోసం మనం పోరాటం చేయాలి. ఆటోమేషన్, కృత్రిమ మేధ వాగ్దానం పెట్టుబడి యొక్క లాభం కన్నా మానవ అవసరాలకు సాంకేతికత ఉపయోగపడే సోషలిజం కింద మాత్రమే నెరవేరుతుంది. "ప్రతి ఒక్కరి స్వేచ్ఛాయుత అభివృద్ధి అందరి స్వేచ్ఛాయుత అభివృద్ధికి షరతు" అన్న మార్క్స్ ప్రకటన నినాదంగా కాకుండా కార్యక్రమం కావాలి. అమెరికా ఆధిపత్య సంధ్య వెలుగు మానవాళికి కొత్త ఉషోదయాన్ని ఆవిష్కరిస్తున్నది. అయితే ఉషోదయమే పగటి వెలుగు కాదు. బహుళ ధృవ ప్రపంచం పోటీ పడుతున్న పెట్టుబడిదారీ వ్యవస్థలకు రణరంగమైనా అవుతుంది లేదా నూతన అంతర్జాతీయ వ్యవస్థకు జన్మస్థానమైనా అవుతుంది. రెండవ దాన్ని సాధించటానికి కార్మిక వర్గం నాయకత్వం వహించాలి. మార్క్స్, ఏంగెల్స్ 1848 లో నిర్ధారించినట్లు, మనం జయించటానికి ఒక ప్రపంచమే ఉంది. నేడు ఆ ప్రపంచంలో సాంకేతికతను తీర్చిదిద్దే హక్కు, దాని ఫలాలను సమానంగా పంచుకునే హక్కు, సామ్రాజ్యవాదం తన పాత, కొత్త రూపాలన్నిటిలో మానవాళిపై విధించటం కొనసాగిస్తున్న దోపిడీని అంతం చేసే హక్కు చేరి ఉన్నాయి.

ఆ వైరుధ్యం అద్భుతం

టెక్నాలజీ అభివృద్ధి చెందే కొలది మెజారిటీ శ్రమజీవుల ఉపాధి సందిగ్ధమవుతున్నది. పనిగంటలు తగ్గించటం లేదా జీవన ప్రమాణాల పెంపుదలకు బదులు డిజిటల్ పెట్టుబడిదారీ వ్యవస్థ నిఘా విస్తరిస్తున్నది, తొలగింపును ఆటోమేట్ చేస్తున్నది, సామాజిక భద్రతలను హరిస్తున్నది. గిగ్ వర్కర్లు ఆహారం డెలివరీ చేస్తారు, సాఫ్ట్‌వేర్ కోడింగ్ చేస్తారు, ఆన్‌లైన్ సమాచారాన్ని అమరిక పరుస్తారు, అయినా వారు మనకు కనిపించరు, వారికి ఉద్యోగ భద్రత లేదు. వారిని ఎప్పుడైనా ఉద్యోగం నుంచి తొలగిస్తారు. మార్క్స్ చెప్పినట్లు, ఈ "శ్రామిక రిజర్వు ఆర్మీ" యాప్ ఆర్థిక వ్యవస్థలో కొత్త జీవితం కనుగొంటుంది. తక్కువ వేతనాలకు పనిచేసే కార్మికులు అపారంగా బటన్ నొక్కగానే దోపిడీకి శాశ్వతంగా లభ్యమవుతారు. బూర్జువా ఆర్థిక వేత్తలు "డిజిటల్ ఎకానమీ" అని పిలుస్తున్న దాని అసలు ముఖం ఇదీ. అది ప్రజల కోసం విప్లవం కాదు, వారికి వ్యతిరేకమైనది. గ్లోబల్ సౌత్‌లో (వెనుకబడిన దేశాలని అర్థం) ముఖ్యంగా దక్షిణాసియాలో ఈ సాంకేతిక విజ్ఞాన వ్యవస్థ పరాధీనతను పునరుత్పత్తి చేస్తోంది. "డిజిటల్ పరివర్తన" అని ఈ ప్రాంతానికి చేసే వాగ్దానానికి అర్థం టెకొలాజికల్ మౌలిక సదుపాయాల ద్వారా సామ్రాజ్యవాద నియంత్రణ విస్తరణ. పశ్చిమదేశాలు, బహుళజాతి గుత్త పెట్టుబడిదారులు ఇప్పుడు ఎక్కువగా ప్రమాణాలను, సొంత ప్లాట్‌ఫారంలను ఆదేశిస్తున్నారు. డేటా ప్రయాణాన్ని నియంత్రిస్తున్నారు. దిగుమతి చేసుకున్న హార్డ్‌వేర్‌పై, వారికి యాజమాన్య హక్కులున్న సాఫ్ట్‌వేర్‌పై, విదేశీ పెట్టుబడిపై ఆధారపడటం లేబర్ స్థానికం అయినప్పటికీ, మిగులు విలువ గ్లోబల్ అవుతుంది. ఈ అర్థంలో, డిజిటలైజేషన్ శ్రమ యొక్క వలసవాద విభజనను రద్దు చేయలేదు, మరింతగా పెంపు చేసింది.

ఈ వైరుధ్యానికి భారత్ పాఠ్యగ్రంథ నమూనా అందిస్తున్నది. తమది ఐటి పవర్‌హౌస్ అని, స్టార్టప్‌ల భూమి అని, సాఫ్ట్‌వేర్ జెయింట్స్ అని దేశం గొప్పలు చెప్పుకుంటున్నది. ఈ మెరుపు కింద వాస్తవికత దాగి ఉంది. లెనిన్ ఉన్న ఫళాన గుర్తించినట్టు అది నిజమైన ఆవిష్కరణ కన్నా చౌక, బలహీనమైన శ్రమపై ఆధారపడిన పెట్టుబడిదారీ నిర్మాణ స్వరూపం. "నవభారత్"కు ప్రతీకగా వేడుక చేసుకుంటున్న స్టార్టప్ పర్యావరణ పశ్చిమ కార్పొరేషన్‌లకు పొరుగు సేవలందించే తక్కువ వేతనాలకు లభ్యమయ్యే ఇంజినీర్లు, డేటా వర్కర్లపై దాదాపు పూర్తిగా ఆధారపడినట్టిది. భారత టెక్నాలజీ సంస్థలు జాతీయ పరివర్తనకు ఇంజిన్‌లుగా కాకుండా ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థకు తెరవెనుక వుండి పనిచేస్తూ ఉపకరిస్తున్నాయి. వాటి లాభాల్లో ఎక్కువ భాగం భారతదేశ సొంత సమస్యలైన ప్రజారోగ్యం, గ్రామీణ మౌలిక వసతులు లేదా పర్యావరణ సంబంధ సంక్షోభం వగైరాలను పరిష్కరించే స్వదేశీ టెక్నాలజీని అభివృద్ధి చేయటం ద్వారాగాక, శ్రామికులను అందించటం ద్వారా ఆర్జిస్తున్నాయి.

కర్నాటక ఎత్తుగడలు...సీమకు శరాఘాతాలు!

వి. శంకరయ్య

కర్నాటక రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో వున్నా సాగునీటి ప్రాజెక్టుల అంశంలో ఎంతో క్రియాశీలకంగా వ్యవహరిస్తుంటాయి. ఆల్మట్టి జలాశయం ఎత్తు 519 మీటర్ల నుంచి 524.256 మీటర్లకు పెంచేందుకు సుప్రీంకోర్టు స్టే వున్నా కర్నాటకలో ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం చకచకా కసరత్తు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు వ్యతిరేకత తెలియపర్చినట్లు లేదు. గమనార్హమైన అంశమేమంటే ఇందుకు కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ వత్తాసు పలకడమే. సుప్రీంకోర్టు స్టేతో నిమిత్తం లేకుండా బేసిన్‌లోని భాగస్వామ్య రాష్ట్రాల్లో ఏకీభావం సాధించి బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ 2- 2013లో ఇచ్చిన తీర్పు నోటిపై చేసేందుకు ఒకటికి రెండు సార్లు సమావేశాలు ఏర్పాటు చేశారు. ఇదే జరిగితే కర్నాటక ఆల్మట్టి ఎత్తు భేషుగ్గా పెంచుకొని అదనంగా 130 టీఎంసీలు నిల్వ చేసుకొంటుంది. ఇదే జరిగితే వర్షాభావ సంవత్సరాల్లో దిగువ రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కటకటలాడాల్సి వుంటుంది. గోదావరి వరద జలాలకు పెద్ద గోల చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంలో చాలా తేలికగా తీసుకొన్నది. తాజాగా ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల మధ్య రాకపోకలు సులభతరం చేసేందుకని చెబుతూ ఏకంగా తుంగభద్ర నదిపై బ్యారేజీ నిర్మాణానికి సిద్ధపడుతూ అనుమతి కోసం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు లేఖ రాసింది. నీటి వాటా గురించి ఆ లేఖలో ప్రస్తావన లేదంటున్నారు. తొలి నుంచి కూడా కర్నాటక వ్యవహార సరళి ఎలా వుందంటే నీ కంటిలో నేను వేలు పెడతాను. నా నోటిలో నీ వేలు పెట్టు అన్న చందంగా వుంది. కర్నాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా మాన్వి తాలూకా నుంచి కర్నూలు జిల్లా కౌతాళం మండలం కంబలనూరు గ్రామం వద్ద కలిసేలా తుంగభద్ర నదిపై బ్యారేజీ కం వంతెన నిర్మాణానికి కర్నాటక సిద్ధపడుతోంది. మరి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

కర్నాటకలో బీజేపీ ప్రభుత్వం వున్నా... కాంగ్రెస్ ప్రభుత్వం వున్నా తుంగభద్ర జలాశయంలో పూడిక చేరి 32 టీఎంసీలు నీటి నిల్వ సామర్థ్యం తగ్గిందనే సాకు చూపి ఎగువ భాగంలో అంతకు రెట్టింపుగా రిజర్వాయర్లు నిర్మిస్తోంది. కేవలం తుంగభద్ర జలాశయంపై ఆధారపడిన రాయలసీమకు శరాఘాతంగా పరిణమిస్తోంది. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో ఏ పార్టీ అధికారంలో వున్నా రాయలసీమ రైతుల ప్రయోజనాలను కాపాడటం లేదు. గోడ దెబ్బ చెంప దెబ్బ తగులుతోంది. తుంగభద్ర జలాశయంలో పూడిక సాకు చూపి తుంగభద్ర ఎగువ, దిగువ కాల్వల వాటాలో భారీగా కోత పెడుతున్నారు. అంత వరకైతే ఫర్వాలేదు. తుంగభద్ర బోర్డు కోత విధించి విడుదల చేస్తున్న నీటిలో కర్నాటక భూభాగంలో జల చౌర్యం భారీగా సాగుతోంది. ఇందుకు రక్షణ లేదు.

కర్నాటకలో బీజేపీ ప్రభుత్వం వున్న రోజుల్లో ఎగువ భద్ర ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించింది. 29 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించే ఈ రిజర్వాయర్‌కు కర్నాటక ప్రభుత్వం 4868.31 కోట్లు వ్యయం చేసి వుంటే మిగిలిన దాదాపు 12 వేల కోట్లు కేంద్ర ప్రభుత్వం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి భరిస్తోంది. ఈ రిజర్వాయర్ నిర్మాణం ద్వారా రాయలసీమకు తీవ్ర అపకారం జరుగుతుందని సీమలో అప్పట్లో పెద్ద ఎత్తున ధర్నాలు నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఈ ఆందోళన కార్యక్రమాలకు నాయకత్వం వహించిన నేత ఇప్పుడు అధికార పార్టీలో వున్నా ప్రస్తుతం మౌనంగా వున్నారు. ఆ సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ ప్రభుత్వం వున్నా రాయలసీమకు అపకారం జరిగే ఈ పథకాన్ని నిలువరించ లేకపోయింది. తుదకు గొంతెండిపోతున్న రాయలసీమకు వెనుకబడిన ప్రాంతాల కింద ఏ ఒక్క ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా సాధించలేకపోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా రాయలసీమకు కొరగాని బనకచర్ల అనుసంధాన పథకం గురించి హడావుడి చేశారుగాని నిధుల లేమితో అర్థాంతరంగా అంగలార్చుతున్న ప్రాజెక్టులకు కేంద్రం నుంచి వెనుకబడిన ప్రాంతాల కింద నిధులు సాధించలేదు.

కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాతనే తుంగభద్ర జలాశయం పూడిక సాకు చూపి నావళి వద్ద 31 టీఎంసీలతో మరొక రిజర్వాయర్ ప్రతిపాదన చేసింది. ఈ సందర్భంగా మన అధికారులు ఇందుకు పోటీగా తుంగభద్ర ఎగువ సమానాంతర కాలువ ఆమోదించమని కోరినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. తరువాత ఆ పోబిడి లేదు. తమాషా ఏమంటే తుంగభద్ర జలాశయంలో 32 టీఎంసీలు పూడికతో తగ్గిపోతే దాన్ని సాకుగా చూపి కర్నాటక 29 టీఎంసీలతో ఎగువ భద్ర 31 టీఎంసీలతో నావళి వద్ద మరొక జలాశయం నిర్మాణానికి పూనుకుంటే రాయలసీమ వాసులు చేసుకున్న దురదృష్టం కొద్దీ కనీసం తుంగభద్ర ఎగువ సమానాంతర కాలువను ఏ ప్రభుత్వాలు సాధించ లేకపోవడమే. వైసీపీ పాలనలో నమ్మి నానబోస్తే పుచ్చి బుర్ర లైనట్లు అయిదేళ్ల కాలం సాగునీటి రంగం ప్రభుత్వ ప్రాధాన్యతల్లో లేకపోయింది. ఎన్డీయే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా సగటు రాయలసీమ వాసుల మనోభావాలను పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఇప్పటికే రెండు సంవత్సరాలు గడిచి పోతోంది. తాజాగా కర్నాటక ప్రభుత్వం తుంగభద్రపై

నిర్మాణానికి ప్రతిపాదన చేసిన బ్యారేజీ విషయంలో నీటి వాటా తేలేంత వరకు అనుమతి ఇవ్వకూడదు. అదే సమయంలో కర్నాటకతో సంప్రదింపులు జరిపి తుంగభద్ర ఎగువ సమానాంతర కాలువకు అనుమతి తీసుకోవలసి వుంది. విషాదమేమంటే రాష్ట్రం మొత్తం మీద వర్షాలు పడి జలాశయాలు నిండినా ఎగువ పెన్నా ప్రాంతంలో ఈ పరిస్థితి లేదని వార్తలు వచ్చాయి.

విశ్రాంత పాత్రికేయుడు

తమిళనాట ఆగని బాంబు బెదిరింపులు

చెన్నై: తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నివాసంతో పాటు సినీ నటులు అజిత్ కుమార్, అరవింద్ స్వామి, ఖుష్బు నివాసాలకు ఆదివారం రాత్రి ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ బెదిరింపు ఈ-మెయిల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) కార్యాలయానికి కూడా రావడంతో అధికారులు వెంటనే అప్రమత్తమై ఈ నాలుగు ప్రాంతాలలో భద్రతా తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా నటుడు అజిత్ కుమార్ చెన్నైలోని ఇంజాంబాక్కంలో ఉన్న నివాసానికి గతవారం కూడా గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఇలాంటి బాంబు బెదిరింపు వచ్చింది. తాజాగా మళ్లీ బెదిరింపు రావడంతో పోలీసులు ఈ అంశాన్ని మరింత తీవ్రంగా పరిగణలోకి తీసుకున్నారు. బెదిరింపు మెయిల్ అందిన వెంటనే పోలీసు అధికారులు బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో కలిసి ఆయా ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అయితే ఆ తనిఖీలలో ఎలాంటి పేలుడు పదార్థాలు లభించలేదు. దీంతో ఈ బెదిరింపులన్నీ బూటకమని అధికారులు ధృవీకరించారు. బెదిరింపు మెయిల్ పంపిన వారి వివరాలను మాత్రం అధికారులు వెల్లడించలేదు. గతంలో డీజీపీ కార్యాలయానికి నటుడు అరుణ్ విజయ్ నివాసంలో (ఎక్కట్టుత్తాంగల్) బాంబు పెట్టినట్లు బెదిరింపు ఈ-మెయిల్ వచ్చింది. ఆ సమాచారం అందిన వెంటనే పోలీసులు, బాంబు డిస్పోజల్ నిపుణులు సోదా చేయగా ఎలాంటి పేలుడు పదార్థాలు దొరకలేదు. దీంతో ఈ విధమైన ఘటనల బారిన పడుతున్న ప్రముఖుల జాబితా పెరుగుతోంది. వరుసగా వస్తున్న ఈ బాంబు బెదిరింపుల వెనుక ఉన్న ఆకతాయిలను లేదా కుట్రదారులను పట్టుకోవడానికి పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

ఎస్ఐఆర్ విధుల బహిష్కరణ

కేరళ అంతటా నిరసనలు

తిరువనంతపురం: పని ఒత్తిడి కారణంగా ఒక అధికారి ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) విధులను బహిష్కరించడంతో సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై ప్రభావం పడింది. కన్నూర్‌లోని పయ్యన్నూర్‌లో బీఎల్‌వోగా పని చేస్తున్న 44 ఏళ్ల అనీష్ జార్జ్ ఆదివారం తన ఇంట్లో ఉరివేసుకుని కనిపించాడు. ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన పని సంబంధిత ఒత్తిడి కారణంగా ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు, స్థానికులు ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల కార్యాచరణ సమితి, ఉపాధ్యాయ సేవా సంస్థల జాయింట్ కమిటీ సహా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, వివిధ కార్మిక సంఘాలు జిల్లా కలెక్టరేట్‌ల వద్ద నిరసనలు నిర్వహించాయి. అధికారులు బీఎల్‌వోలపై అధిక ఒత్తిడి తీసుకురావడం మానుకోవాలని, ఎస్ఐఆర్‌ను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. మరిన్ని ఆత్మహత్యలను నివారించడానికి ఎస్ఐఆర్ కసరత్తును నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ కేరళ ఎన్జీవో అసోసియేషన్ కూడా రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టింది. ఇదిలాఉండగా, సోమవారం పోస్ట్‌మార్టం తర్వాత జార్జ్ మృతదేహాన్ని అతని బంధువులకు అప్పగించారు. జార్జ్ కుటుంబం ఎస్ఐఆర్‌కి సంబంధించి తీవ్రమైన పని ఒత్తిడిలో ఉన్నారని పునరుద్ఘాటించారు. 'అతనికి ఆహారం, నిద్రకు సరిగ్గా సమయం లేదు. ఎస్ఐఆర్ కసరత్తులో భాగంగా కేటాయించిన పనిని పూర్తి చేయడానికి అతను తీవ్ర ఒత్తిడిలో ఉన్నాడు' అని జార్జ్ బావమరిది సైజు విలేకరులతో అన్నారు. జార్జ్‌ను ఉన్నతాధికారులు తరచుగా నవీకరణల కోసం సంప్రదిస్తున్నారని సైజు తెలిపారు. 'తీవ్రమైన పనిభారాన్ని చూసి... జార్జ్ తండ్రి ఉద్యోగం పోయినా చింతించవద్దని చెప్పారు' అని ఆయన వివరించారు. రాష్ట్ర రాజధానిలో ఒక బీఎల్‌వో మాట్లాడుతూ 3,000 లక్ష్యానికిగాను అతను రోజుకు సగటున 1,500 కంటే ఎక్కువ గణన ఫారాలను పంపిణీ చేస్తున్నాడని చెప్పారు. కాగా బీఎల్‌వోల భద్రతను నిర్ధారించి, సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని కాంగ్రెస్ నాయకుడు సతీశన్ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) ని డిమాండ్ చేశారు. 'బీఎల్‌వోలలో ఎక్కువ మంది మహిళలు. ఒక బూత్‌లో దాదాపు 700 నుంచి 1,200 మంది ఓటర్లు ఉన్నారు. తక్కువ వ్యవధిలో లక్ష్యాలను చేరుకోవడానికి బీఎల్‌వోలు ప్రతి ఇంటికి అనేకసార్లు వెళ్లాల్సి ఉంటుంది' అని ఆయన చెప్పారు. నిరసన తెలుపుతున్న బిఎల్ఓలకు కాంగ్రెస్ పార్టీ పూర్తిగా మద్దతు ఇస్తుందని ఆయన అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ సుప్రీం కోర్టును ఆశ్రయిస్తుందని కేపీసీసీ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్ తెలిపారు. '2002 ఓటర్ల జాబితాను పరిగణనలోకి తీసుకోవడం ద్వారా నాకు కూడా ఓటు హక్కులు లేవు. అనేక మంది రాజకీయ నాయకులు ఓటర్ల జాబితాలో ఉండరు. భారత ప్రభుత్వం, ఎన్నికల సంఘం పౌరుల ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నాయి' అని ఆయన విమర్శించారు.

రాష్ట్రపతి పాలన, మోదీ పర్యటనతో
మణిపూర్ పరిస్థితి మెరుగు

సైనిక దళాల ప్రధానాధికారి ద్వివేది

న్యూఢిల్లీ: రాష్ట్రపతి పాలన విధించిన తర్వాత మణిపూర్‌లో శాంతిభద్రతల పరిస్థితి మెరుగుపడిందని సైనిక దళాల ప్రధానాధికారి జనరల్ ఉపేంద్ర ద్వివేది అన్నారు. సోమవారం ఢిల్లీలో జరిగిన చాణక్య రక్షణ సంభాషణలో ఆయన మాట్లాడుతూ 'మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన వచ్చినప్పటి నుంచి పరిస్థితులు మారిపోయాయి. ప్రభుత్వంపై ప్రజల నమ్మకం, వర్గాల మధ్య పరస్పర విశ్వాసం పెరిగింది. అప్పటి నుంచి గణనీయమైన మెరుగుదల ఉంది' అని అన్నారు. ఇటీవలి ప్రజా కార్యక్రమాలను స్థిరత్వానికి సంకేతాలుగా ప్రత్యేకంగా ప్రస్తావించారు. 'డ్యూరాండ్ కప్ నిర్వహించారు. నేను కూడా అక్కడే ఉన్నాను. జనసమూహం భారీగా ఉంది. సెప్టెంబరులో ప్రధాని మోదీ సందర్శించారు. అది కూడా క్షేత్రస్థాయిలో పరిస్థితులను మార్చడానికి సహాయపడింది. హింసాత్మక సంఘటనలు తగ్గాయి. పరిస్థితి మెరుగుపడటం కొనసాగితే రాష్ట్రపతి కూడా త్వరలో సందర్శిస్తారు' అని ద్వివేది పేర్కొన్నారు. పెరుగుతున్న భద్రతా సవాళ్ల విషయంలో సైన్యం విధానాన్ని ద్వివేది వివరిస్తూ పాకిస్తాన్‌కు స్పష్టమైన హెచ్చరిక చేశారు. 'ఆపరేషన్ సిందూర్ 88 గంటల్లో ముగిసిన ట్రైలర్ మాత్రమే. భవిష్యత్‌లో ఎలాంటి పరిస్థితులకు అయినా మేము సిద్ధంగా ఉన్నాము. పాకిస్తాన్ మాకు అవకాశం ఇస్తే పొరుగు దేశంతో బాధ్యతాయుతంగా ఎలా ప్రవర్తించాలో మేము దానికి నేర్పుతాము' అని అన్నారు. 'నేటి కాలంలో యుద్ధాలు బహుళ క్షేత్రాలు. ఇది ఎంతకాలం కొనసాగుతుందో చెప్పలేము. ఎక్కువ కాలం ఉండేలా మాకు సరఫరాలు ఉన్నాయని నిర్ధారించుకోవాలి' అని తెలిపారు. ప్రభుత్వ మద్దతు ఉన్న ఉగ్రవాదానికి భారతదేశం గట్టిగా స్పందిస్తూనే ఉంటుందని సైనిక దళాల ప్రధానాధికారి అన్నారు. 'ఒక దేశ ప్రభుత్వం ప్రాయోజిత ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తే, అది భారతదేశానికి ఆందోళన కలిగించే విషయంగా మారుతుంది. భారతదేశం పురోగతి గురించి మాట్లాడుతుంది. ఎవరైనా మన మార్గంలో అడ్డంకులు సృష్టిస్తే, వారిపై మనం కొంత చర్య తీసుకోవలసి ఉంటుంది' అని చెప్పారు. 'మనం చర్చలు, ఉగ్రవాదం కలిసి సాగలేవని చెప్పాము. మనం అడుగుతున్నదల్లా శాంతియుత ప్రక్రియను అనుసరించమని, దానికి సహకరిస్తాం. అప్పటి వరకు ఉగ్రవాదులను, వారిని ప్రోత్సహించే వారిని సమానంగా చూస్తాం. ఉగ్రవాదులను ప్రోత్సహించే వారికి మేము ప్రతిస్పందిస్తాం' అని అన్నారు. 'నేడు భారతదేశం ఎటువంటి బ్లాక్‌మెయిలింగ్‌కు భయపడని స్థితిలో ఉందని, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో మన కొత్త సాధారణ విధానం పాకిస్తాన్‌కు సవాలుగా ఉంటుంది' అని పాకిస్తాన్ అణు ముప్పును ప్రస్తావిస్తూ ద్వివేది అన్నారు. భారతదేశ రాజకీయ నాయకులు దేశ నిరోధక సామర్థ్యాలను బలోపేతం చేసే సంకల్పం కలిగి ఉన్నారని తెలిపారు. 'ఆగస్టు 5, 2019 తర్వాత జమ్మూకశ్మీర్ పరిస్థితిలో భారీ మార్పు వచ్చింది. దీని తర్వాత రాజకీయ స్పష్టత వచ్చింది. ఉగ్రవాదంలో భారీ తగ్గుదల కనిపించింది' అని ఆయన అన్నారు.

వణికిస్తున్న చలి

న్యూఢిల్లీ: దేశంలో చలితీవ్రత బాగా పెరిగింది. అనేక రాష్ట్రాలను చలిగాలులు వణికిస్తున్నాయి. మొన్నటిదాకా వర్షాలు... ఇప్పుడు చలి భయపెడుతోంది. కొద్దిరోజులుగా చలి తీవ్రత గజగజవణికిస్తోంది. బయటకు రావాలంటేనే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఉదయాన్నే ఉద్యోగాలకు వెళ్లేవారి పరిస్థితి దారుణంగా తయారైంది. కాళ్లు, చేతులు వణికిపోతున్నాయి. ఎముకలు కొరికే చలితో హడలెత్తిపోతున్నారు. ఇలాంటి తరుణంలో చలి పులిపై తాజాగా కేంద్ర వాతావరణ శాఖ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. దేశంలో ఆయా రాష్ట్రాల్లో చలి గాలులు తీవ్రంగా ఉంటాయని ఐఎండీ పేర్కొంది. మధ్య, పశ్చిమ భారతదేశంలో తీవ్రమైన పరిస్థితులు ఉంటాయని తెలిపింది. మధ్యప్రదేశ్‌లో చాలా తీవ్రంగా ఉంటుందని, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. దక్షిణాదిలో వర్షాలతో పాటు చలి గాలులు కూడా ఉంటాయని పేర్కొంది. రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాల్లో పరిణామాలు తీవ్రంగా ఉంటాయని, విపరీతమైన చలిగాలులు ఉంటాయని స్పష్టం చేసింది. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్‌లో ఉష్ణోగ్రతలు చాలా దారుణంగా పడిపోతాయని పేర్కొంది. సోమవారం పశ్చిమ మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్‌లో అత్యల్ప కనిష్ట ఉష్ణోగ్రత 6 డిగ్రీలు నమోదైంది. దేశంలోనే అత్యంత చలి ప్రాంతం ఇదేనని తెలిపింది. ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, గుజరాత్‌లోనూ తీవ్ర పరిస్థితులు ఉంటాయని చెప్పింది. దక్షిణాది రాష్ట్రాల్లో వర్షాలు కొనసాగుతున్నాయని వెల్లడించింది. తమిళనాడు, కేరళ, కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాం, రాయలసీమ, అండమాన్- నికోబార్ దీవులలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది మంగళవారం నుంచి 22 వరకు తమిళనాడులో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. నవంబర్ 20 వరకు తమిళనాడు, కేరళ, మాహే, కోస్తా ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. తెలంగాణలోనూ చలి గాలులు ఎక్కువగా ఉంటాయని తెలిపింది. తమిళనాడు, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాల వెంబడి 55 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, నవంబర్ 18న అండమాన్ సముద్రం మీదుగా గాలులు గంటకు 60 కి.మీ వేగంతో వీచే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది.

అఖిలేశ్‌కు 'ఇండియా' బాధ్యతలు

తెరపైకి కొత్త డిమాండ్



లక్నో: బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీ-కాంగ్రెస్ కూటమి వైఫల్యంతో ఇండియా ఐక్యసంఘటనలో కొత్త డిమాండ్ తెరపైకి వచ్చింది. అఖిలేశ్ యాదవ్‌కు ఇండియా ఐక్యసంఘటన బాధ్యతలు అప్పగించాలంటూ వాదన వినిపిస్తోంది. పార్లమెంట్‌లో 37 మంది ఎంపీలతో ఎస్పీ లోక్‌సభలో రెండో అతిపెద్ద శక్తిగా ఉంది. దీంతో అఖిలేశ్ యాదవ్‌కు బాధ్యతలు అప్పగిస్తే కూటమి గాడిన పడుతుందని గుసగుసలు వినిపిస్తున్నాయి. అఖిలేశ్ యాదవ్‌కు బాధ్యతలు అప్పగిస్తే ప్రతిపక్ష కూటమి గాడిన పడుతుందని సమాజ్‌వాదీ పార్టీకి చెందిన ఒక ఎమ్మెల్యే అన్నారు. ఇంకోవైపు మమతా బెనర్జీకి బాధ్యతలు అప్పగించాలంటూ తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ డిమాండ్ చేశారు. లక్నో సెంట్రల్ ఎమ్మెల్యే రవిదాస్ మాట్లాడుతూ ఎన్నికలు నిర్వహించడానికి బ్యాలెట్ పద్ధతి ఉపయోగించినట్లయితే ఇండియా ఐక్యసంఘటన బీహార్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ఉండేదని అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలదని పేర్కొన్నారు. మహారాష్ట్ర, హర్యానా తదితర రాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెస్ పేలవమైన ప్రదర్శన కనబరచడంతో కూటమిలో నాయకత్వం మార్పుపై డిమాండ్ పెరుగుతోంది. మహారాష్ట్ర, హర్యానాలో కాంగ్రెస్ విఫలమైందని, కూటమి బాధ్యతలు మమతా బెనర్జీకి అప్పగిస్తే గాడిన పడుతుందని కల్యాణ్ బెనర్జీ చెప్పారు. ఇటీవల జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, ఆర్జేడీ కూటమి ఘోర పరాజయం పాలైంది. ఆర్జేడీ 25, కాంగ్రెస్ 6 స్థానాల్లో మాత్రమే గెలిచాయి.

ఎల్‌పీజీపై అమెరికాతో భారత్ ఒప్పందం

న్యూఢిల్లీ: అమెరికాతో వాణిజ్య యుద్ధం నడుస్తున్న తరుణంలో భారత్ కీలక ఒప్పందం చేసుకుంది. ఎల్‌పీజీ దిగుమతిపై అమెరికాతో చారిత్రాత్మక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు కేంద్ర పెట్రోలియం, సహజవాయు శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురి వెల్లడించారు. దేశ ప్రజలకు అందుబాటు ధరలో ఎల్‌పీజీ అందించే క్రమంలో కీలక ముందడుగు పడిందని కేంద్రమంత్రి హర్దీప్‌సింగ్ పేర్కొన్నారు. అమెరికా గల్ఫ్ కోస్ట్ నుంచి ఎల్‌పీజీ రానుందని తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌లో ఆయన సోమవారం వెల్లడించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం, హిందూస్థాన్ పెట్రోలియం కంపెనీలు అమెరికా సంస్థలతో కొన్ని నెలలుగా చర్చలు జరిపినట్లు వివరించారు. ప్రపంచంలోనే ఎల్‌పీజీ ఉపయోగించడంలో భారతదేశం రెండో అతి పెద్ద దేశం. ఇలాంటి తరుణంలో ఎల్‌పీజీ దిగుమతిపై అమెరికాతో కీలక ఒప్పందం చేసుకుంది. ఇప్పటికే ఉజ్వల యోజన పథకం కింద కేంద్రం సబ్సిడీ ఇస్తోంది. తాజా ఒప్పందంతో గృహవినియోగదారులందరికీ తక్కువ ధరకే ఎల్‌పీజీ దొరికే అవకాశం ఉంది. గతేడాది ఎల్‌పీజీ ధరలు ప్రపంచవ్యాప్తంగా 60 శాతం పెరిగినా... భారత్‌లో మాత్రం ఉజ్వల లబ్ధిదారులకు కేవలం రూ.500-550కే లభించింది. తాజాగా అమెరికాతో ఒప్పందం కారణంగా గృహ వినియోగదారులందరికీ ఉపశమనం లభించే అవకాశం కనిపిస్తుంది.

'నందిని' నకిలీ నెయ్యి రాకెట్ గుట్టురట్టు

జంతువుల కొవ్వు వాడకంపై దర్యాప్తు

బెంగళూరు: నకిలీ నందిని నెయ్యి రాకెట్ గుట్టురట్టయ్యింది. రూ.56.95 లక్షల విలువైన 8,136 లీటర్ల కల్తీ నెయ్యి, నకిలీ నెయ్యి తయారీ యంత్రాలు, నూనెలను స్వాధీనం చేసుకున్నారు. నలుగురుని పోలీసులు అరెస్ట్ చేశారు. జంతువుల కొవ్వు వాడకంపై దర్యాప్తు చేస్తున్నారు. దక్షిణ భారత్‌లో 'నందిని'కి మార్కెట్‌లో భారీ డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలో నిందితులు తమిళనాడులో కల్తీ నెయ్యి తయారు చేస్తున్నారు. కర్నాటకలో విక్రయిస్తున్నారు. కాగా, కర్నాటక కో-ఆపరేటివ్ మిల్క్ ప్రొడ్యూసర్స్ ఫెడరేషన్ (కేఎంఎఫ్) యాజమాన్యంలోని 'నందిని' నెయ్యి పంపిణీదారుడికి చెందిన ఏజెన్సీ ఈ బ్రాండ్ పేరుతో నకిలీ నెయ్యి తయారు చేసి అమ్ముతున్నట్లు సమాచారం అందింది.

దీంతో ఈ నెల 14న సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ స్పెషల్ ఇన్వెస్టిగేషన్ స్క్వాడ్, కేఎంఎఫ్ విజిలెన్స్ వింగ్‌కు చెందిన సంయుక్త బృందం ప్రత్యేక ఆపరేషన్ చేపట్టింది. చామరాజ్‌పేటలోని నంజంబ అగ్రహారలో కృష్ణ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన గోడౌన్లు, షాపులు, వాహనాలను అధికారులు తనిఖీ చేశారు. తమిళనాడుతో తయారై అక్కడి నుంచి రవాణా చేసిన 'నకిలీ' నందిని సాచెట్లు, ప్లాస్టిక్ బాటిళ్లలో ప్యాక్ చేసిన కల్తీ నెయ్యితో కూడిన వాహనాన్ని సోదా చేశారు. ఈ ప్రత్యేక దాడిలో రూ.1.26 కోట్ల విలువైన ఆస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రూ.56.95 లక్షల విలువైన 8,136 లీటర్ల కల్తీ నెయ్యి, తయారీకి వినియోగించే యంత్రాలు, నాసిరకం కొబ్బరి, పామాయిల్ నూనెలు, ఐదు మొబైల్ ఫోన్లు, రూ.1.19 లక్షల నగదు, రూ.60 లక్షల విలువైన నాలుగు బొలెరో గూడ్స్ వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. కాగా, కేఎంఎఫ్ పంపిణీదారుడు మహేంద్ర, అతడి కుమారుడు దీపక్, మునిరాజు, అభిరాసును నిందితులుగా పోలీసులు గుర్తించారు. వారిని అరెస్ట్ చేశారు. వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కల్తీ నెయ్యిలో జంతువుల కొవ్వు వాడకంపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. నకిలీ నెయ్యి శాంపిల్స్‌ను పరీక్ష కోసం ల్యాబ్‌కు పంపినట్లు చెప్పారు. ఆ రిపోర్ట్ ఆధారంగా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

దిల్లీలో మెరుగుపడని గాలి నాణ్యత

న్యూఢిల్లీ: దేశ రాజధాని దిల్లీలో గాలి నాణ్యతలు రోజురోజుకూ పడిపోతున్నాయి. సోమవారం ఉదయం దిల్లీలో గాలి నాణ్యత 356గా నమోదైంది. వీటి స్థాయిల్ని 'వెరీ పూర్' కేటగిరీలో వర్గీకరించినట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) పేర్కొంది. ఇక ఉష్ణోగ్రతలు 8.7గా నమోదయ్యాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. ఐదు పర్యవేక్షణ కేంద్రాల్లో ఏక్యూఐ స్థాయిలు ప్రమాదకరంగా నమోదయ్యాయి. 29 స్టేషన్లలో వెరీపూర్ కేటగిరిలో నమోదయ్యాయి. నాలుగు స్టేషన్లలో పూర్ కేటగిరీలో నమోదైనట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి తెలిపింది. నరేలా (405), జహంగిర్‌పూరి (404), వజీర్‌పూర్ (402), రోహిణి (401) కేంద్రాల్లో ప్రమాదకర స్థాయిల్లోనే ఏక్యూఐ స్థాయిలు నమోదైనట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి వెల్లడించింది.

'సైబర్' ఉచ్చులో మహిళ

రూ.32 కోట్లు కాజేసిన నేరగాళ్లు

బెంగళూరు: దేశంలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. సొమ్ము కాజేసేందుకు నేరగాళ్లు కొత్త దారులను వెతుక్కుంటున్నారు. సైబర్ మోసాలపై ఎంత అవగాహన కల్పించినా, ప్రతిరోజూ ఏదో ఒకచోట జనం సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి పెద్ద మొత్తంలో సొమ్ము పోగొట్టుకుంటున్నారు. తాజాగా ఓ మహిళ సైబర్ ఉచ్చులో చిక్కుకుని రూ.కోట్లలో పోగొట్టుకున్న ఘటన బెంగళూరులో వెలుగు చూసింది. అధికారుల వివరాల ప్రకారం... బెంగళూరుకు చెందిన మహిళ(57)ను సీబీఐ అధికారులమంటూ కొందరు డిజిటల్ అరెస్ట్ చేశారు. ముందుగా డీహెచ్ఎల్‌లో ఎగ్జిక్యూటివ్ అని చెప్పి ఓ వ్యక్తి ఆ మహిళకు ఫోన్ చేశాడు. ఆమె పేరు మీద మూడు క్రెడిట్ కార్డులు, నాలుగు పాస్‌పోర్టులు, నిషేధిత ఎండీఎంఏ ఉన్న ఓ పార్శిల్ ముంబైలోని అంధేరీ డీహెచ్ఎల్ కేంద్రానికి వచ్చిందని చెప్పాడు. ఆ ప్యాకేజీతో తనకు సంబంధం లేదని, తాను బెంగళూరులో నివసిస్తున్నట్లు ఆమె చెప్పింది. అయితే, ఫోన్ చేసిన వ్యక్తి మీ ఫోన్ నెంబర్ పార్శిల్‌తో లింక్ అయిఉందని... అది సైబర్ క్రైమ్ కావొచ్చని బెదిరించాడు. సీబీఐ అధికారుల నుంచి ఫోన్‌కాల్ వస్తుందని తెలిపాడు. కొద్దిసేపటికి సీబీఐ అధికారినంటూ ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. పార్శిల్‌లో ఉన్న ఆధారాల ద్వారా ఆమెను డిజిటల్ అరెస్టు చేసినట్లు బెదిరించాడు. అరెస్టు నుంచి తప్పించుకోవాలంటే అన్ని ఆస్తులను ఆర్‌బీఐకి చెందిన ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ అధికారికంగా ధృవీకరించాల్సి ఉందని నమ్మించాడు. దాంతో భయపడిన మహిళ తన వద్ద ఉన్న ఆస్తులు, డబ్బు వారికి అప్పగించింది. ఫిక్స్‌డ్ డిపాజిట్స్, ఇతర సేవింగ్స్‌ను మోసగాళ్లు పంపిన 187 బ్యాంకు ఖాతాలకు విడతలవారీగా బదిలీ చేసింది. ఇలా దాదాపు ఆరు నెలల్లో ఆమె నుంచి రూ.32 కోట్లు దోచుకున్నారు.

క్లియరెన్స్ పూర్తయ్యాక ఫిబ్రవరిలో ఆ డబ్బును తిరిగిస్తామని చెప్పారు. ఈ మేరకు బాధితురాలికి నకిలీ క్లియరెన్స్ లెటర్‌ను కూడా జారీ చేశారు. కొన్ని రోజులకు ఆమె తన డబ్బును తిరిగి ఇవ్వాలంటూ వారిపై ఒత్తిడి చేసింది. అటువైపు నుంచి ఎలాంటి స్పందనా లేదు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. డిజిటల్ అరెస్ట్‌లో రూ.31.83 కోట్లు కోల్పోయానంటూ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రెండు కీలక ఫోన్లు మిస్సింగ్

న్యూఢిల్లీ: ఢిల్లీ పేలుడుపై దర్యాప్తు కొనసాగుతోంది. దర్యాప్తులో తాజాగా అధికారులు కీలక సమాచారం సేకరించారు. పేలుడుకు ముందు ఉగ్రవాది ఉమర్ ఎక్కడెక్కడ తిరిగాడో ఆ సీసీటీవీ ఫుటేజ్‌లను అధికారులు సేకరించారు. సీసీటీవీ ఫుటేజ్‌లో ఉమర్ రెండు సెల్‌ఫోన్లు ఉపయోగించి నట్లుగా గుర్తించారు. అయితే పేలుడు సమయంలో ఈ రెండు ఫోన్ల ఆనవాళ్లు ఎక్కడా కనిపించలేదు. దీంతో దర్యాప్తు అధికారులు ఫోన్లపై ప్రధానంగా దృష్టి పెట్టారు. పేలుడుకు ముందు ఉమర్ ఎవరికైనా ఇచ్చాడా? లేదంటే ఎక్కడైనా భద్రపరిచాడా? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఫోన్లలోనే కీలక సమాచారం ఉండొచ్చని భావిస్తున్నారు. పేలుడుకు ఒక రోజు ముందు నవంబర్ 9న ఉగ్రవాది ఉమర్... ఫరీదాబాద్, నుహ్, బల్లబ్‌గఢ్, సమీప ప్రాంతాల్లో సంచరించినట్లుగా దర్యాప్తు అధికారులు సీసీటీవీ ఫుటేజ్ ద్వారా తెలుసుకున్నారు. ఉమర్ ప్రయాణించిన మార్గంలో మసీదులు, లాడ్జీలు, కోచింగ్ సెంటర్లు, స్నాక్స్ సెంటర్లు, మెడికల్ స్టోర్లలో ఉన్న సీసీకెమెరాలను అధికారులు జల్లెడ పట్టారు. వీటిలో నమోదైన దానిని బట్టి... ఎవరో ఉమర్‌కు మార్గనిర్దేశం చేస్తున్నట్లుగా కనిపెట్టారు. హర్యానాలోని ఒక మెడికల్ షాపు సీసీటీవీ ఫుటేజ్‌లో రెండు సెల్‌ఫోన్లు ఉపయోగించినట్లుగా కనిపించింది. పేలుడుకు ముందు వరకు ఈ రెండు ఫోన్లే ఉపయోగించాడు. అక్టోబర్ 30 నుంచి నవంబర్ 10 వరకు ఉమర్ ఈ రెండు సెల్‌ఫోన్లు ఉయోగించినట్లుగా సిగ్నల్ పాయింట్ ఆధారంగా తేలింది. పేలుడు సమయంలో మాత్రం ఈ రెండు సెల్‌ఫోన్ల సిగ్నల్ ట్రాక్ అవ్వలేదు. అంటే బ్లాస్ట్‌కు ముందే రెండు సెల్‌ఫోన్లు మిస్ అయ్యాయి. ఎవరికో ఇచ్చేసి ఉండొచ్చని భావిస్తున్నారు. దీంతో రెండు సెల్‌ఫోన్ల కోసం అధికారులు తీవ్రంగా జల్లెడ పడుతున్నారు. సెల్‌ఫోన్లు దొరికితే ఉమర్‌ను ఎవరు నడిపిస్తున్నారో తేలిపోతుందని ఒక అధికారి పేర్కొన్నారు. ఉమర్ తరుచుగా ఎన్‌క్రిప్టెడ్ యాప్‌ను ఉపయోగించినట్లు కనిపెట్టారు. ఈ పరికరం అత్యంత రహస్యంగా ఉం టుంది. ప్రస్తుతం జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ), ఢిల్లీ పోలీస్ ప్రత్యేక విభాగం, జమ్మూకశ్మీర్ పోలీసుల బృందాలు ఉమర్ కదలికలను సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేస్తున్నాయి.

పంట వ్యర్థాల దహనానికి బదులు రీ సైక్లింగ్

కాలుష్యం కట్టడికి పంజాబ్ రైతుల వినూత్న యత్నం

న్యూఢిల్లీ: దేశ రాజధాని న్యూఢిల్లీలో క్షీణిస్తున్న గాలి నాణ్యతను మెరుగుపరిచే ప్రయత్నంలో భాగంగా పంజాబ్ రైతులు పంట వ్యర్థాలను దహనం చేయడానికి బదులు వాటిని రీసైకిల్ చేయడానికి వినూత్న పద్ధతులు అవలంబిస్తున్నారు. చాలాకాలంగా కొనసాగుతున్న పంట వ్యర్థాల దహనం దేశ రాజధానిలో తీవ్రమైన కాలుష్య స్థాయికి దారితీసింది. వాహనాల నుంచి వచ్చే ఉద్గారాలు, పారిశ్రామిక కార్యకలాపాల వల్ల ఇది మరింత తీవ్రమైంది. శీతాకాలంలో తక్కువ గాలి వేగం, తగ్గుతున్న ఉష్ణోగ్రతలు కాలుష్య కారకాలను భూమికి దగ్గరగా బంధించినప్పుడు ఈ కాలానుగుణ గాలి నాణ్యత సంక్షోభం మరింత తీవ్రమవుతుంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు పంజాబ్‌లోని దాదాపు 12 వేల గ్రామాలలో 800 కంటే ఎక్కువ గ్రామాలలోని రైతులు పంట కోతకు వచ్చే చెత్తను సేకరించడానికి యాంత్రిక బేలర్లను ఉపయోగిస్తున్నారు. వాటిని కర్మాగారాలకు పంపుతున్నారు. అక్కడ వాటిని బయో గ్యాస్, బయో ఎరువులు, కార్డ్‌బోర్డ్ వంటి పర్యావరణ అనుకూల ఉత్పత్తులుగా మారుస్తారు. అయితే ఉత్తర రాష్ట్రాలలో చెత్త దహనం ఇప్పటికీ కొనసాగుతోంది. ఈ మార్పు పాక్షికం మాత్రమే అని విశ్లేషకులు అంటున్నారు. 'ఇది గడ్డి దహనం కొంత తగ్గడానికి దారితీసినప్పటికీ, సమస్యను సమగ్ర మార్గంలో పరిష్కరించడానికి అవసరమైన ప్రతిస్పందన తీవ్రతతో పోలిస్తే అటువంటి చొరవలకు ప్రోత్సాహకాలు, అవగాహన ఇప్పటికీ పరిమితం' అని న్యూఢిల్లీలోని ఎన్విరోక్యాటలిస్ట్స్ వ్యవస్థాపకుడు, ప్రధాన విశ్లేషకుడు సునీల్ దహియా అన్నారు. అయితే వనరులు, పరికరాలను సరఫరా చేస్తున్నామని సీఐఐ తెలిపింది. సంగ్రూర్‌లోని బల్వార్ కలాన్ గ్రామంలో 25 ఏళ్ల రైతు దల్బీర్ సింగ్ మాట్లాడుతూ 'గడ్డి దహనం కారణంగా మేము పొగకు గురవుతున్నాము. ఇది మాకు ఉత్తేజకరమైన చర్య కాదు. అందుకే మేము దానిని నిల్వ చేసి విక్రయించడానికి బాయిలర్లకు పంపుతున్నాం' అని అన్నారు. సాధారణంగా వరి కోత, గోధుమ విత్తే మధ్య పొలాలను చదును చేయడానికి రైతులకు గడ్డి దహనం వేగవంతమైన మార్గం. ఇది నవంబరు మధ్య నుంచి ప్రారంభమవుతుం ది. గత వారం న్యూఢిల్లీ గాలి నాణ్యత సూచిక 400 చుట్టూ ఉండి... 'తీవ్రమైన' విభాగంలో ఉంది. ఇది నిర్మాణం, పారిశ్రామిక కార్యకలాపాలపై ఆంక్షలను పెంచడానికి అధికారులను ప్రేరేపించింది. సంగ్రూర్‌లోని ఫగువాలా గ్రామానికి చెందిన 53 ఏళ్ల రైతు గుర్నైబ్ సింగ్ మాట్లాడుతూ పంట వ్యర్థాల నుంచి కార్డ్‌బోర్డ్ తయారు చేయడానికి ఒక కర్మాగారాన్ని స్థాపించానని చెప్పారు. గాలిని శుభ్రంగా ఉంచడంలో సహాయపడటమే కాకుండా తన ప్లాంట్‌లో డజన్ల కొద్దీ మందికి ఉపాధి కూడా అందిస్తున్నట్లు చెప్పారు.

ఎస్పీ నేతలకు ఏడేళ్ల జైలు

లక్నో: ఎస్పీ నేత ఆజంఖాన్, ఆయన తనయుడు అబ్దుల్లా ఆజంఖాన్‌ను డబుల్ పాన్ కార్డు కేసులో రాంపూర్ కోర్టు దోషులుగా తేల్చింది. ఇద్దరికి ఏడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.50వేల చొప్పున జరిమానా విధించింది. కోర్టు తీర్పు అనంతరం పోలీసులు వీరిని అదుపులోకి తీసుకున్నారు. ఆజంఖాన్‌పై నమోదైన 104 కేసుల్లో ఇప్పటివరకు 12 కేసుల్లో తీర్పులు వెలువడ్డాయి. ఏడు కేసుల్లో ఆయన దోషిగా, ఐదు కేసుల్లో నిర్దోషిగా తేలారు. వాది బీజేపీ ఎమ్మెల్యే ఆకాశ్ సక్సేనా సివిల్ లైన్స్ కొత్వాలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అబ్దుల్లా ఆజం పాన్ కార్డులో పుట్టిన తేదీ 1993, జనవరి ఒకటి అని.. ఎడ్యుకేషన్ సర్టిఫికెట్లలో ఇదే పుట్టిన తేదీ ఉందని... అయితే, 2017 అసెంబ్లీ ఎన్నికల నామినేషన్‌లో సమర్పించిన పాన్ భిన్నంగా ఉందని ఆరోపించారు. అబ్దుల్లా ఆజం తన తండ్రి ఆజం ఖాన్‌తో కలిసి కుట్ర పన్ని ఎన్నికల అధికారుల నామినేషన్ పత్రాల్లో వయసు అర్హతను దాచిపెట్టేందుకు 1990 సెప్టెంబరు 30న పుట్టిన తేదీతో నకిలీ పాన్ కార్డ్‌ను తయారు చేసుకున్నట్లుగా ఆరోపించారు. వయసును దాచేందుకు ఈ పాన్‌కార్డును ఉపయోగించి.. అబ్దుల్లా ఆజం నకిలీ పత్రాలతో వేసిన నామినేషన్‌ను ఆమోదించారని... ఆ తర్వాత ఎన్నికల్లో గెలిచాడని ఆరోపించారు. బీజేపీ ఎమ్మెల్యే ఫిర్యాదు మేరకు సివిల్ లైన్స్ పోలీస్ స్టేషన్‌లో ఆజంఖాన్‌తో పాటు అబ్దుల్లా ఆజంపై భారతీ శిక్షాస్మృతిలోని 420, 467, 468, 471, 120 బీ కింద కేసులు నమోదు చేశారు. ఈ కేసును విచారించిన రాంపూర్ కోర్టు తాజాగా ఇద్దరిని దోషులుగా ప్రకటిస్తూ తీర్పును వెలువరించింది.

విశాలాంధ్ర హైదరాబాద్

యూత్ కాంగ్రెస్ బలోపేతానికి జయంత్ గౌడ్ కృషి

విశాలాంధ్ర-కాప్రా : ఉప్పల్ నియోజకవర్గం లోని జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి యువత అకర్షితులైతున్నారని ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి, ఉప్పల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అరుణ్ పటేల్, మల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు కప్పర సాయి కిరణ్ గౌడ్ లు అన్నారు. సోమవారం వారి ఆధ్వర్యంలో మల్లాపూర్ గ్రీన్ హిల్స్ కాలనీ కి చెందిన సాయి రామ కృష్ణ, ఇంతియాజ్ పాషా,ధనుష్,శశి, కిరణ్, అరిఫ్, సిదర్త, ఏశ్వంత్, మహేష్, పవన్, రతన్, కార్తీక్,నాగరాజ్, మహాత్మా, యువకులు యూత్ కాంగ్రెస్ లో చేరారు. ఈ సందర్భంగా ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి కండువా కాపీ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమం లో మల్లాపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మెరుపుల జయంత్ గౌడ్, జనరల్ సెక్రటరీ వినేష్ యాదవ్, ఆర్గనైజషన్ సెక్రటరీ పర్వీజ్, మరియు యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు

విశాలాంధ్ర-కాప్రా : కార్తీకమాసం చివరి రోజును పురస్కరించుకుని కాప్రా మున్సిపల్ ఎస్ఎఫ్ఐ, కార్మికుల ఆధ్వర్యంలో హెచ్ఎంటి కాలనీ లో పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం పలువురు పెద్దలు బసవేశ్వరుడు బోధించిన సమానత్వ, అహింసా ధర్మ సందేశాలను సమాజం ముందుకు తీసుకెళ్లడం తమ ధ్యేయమని పేర్కొన్నారు. దీపారాధన, శివార్చన వంటి పూజలు ఆధ్యాత్మిక శాంతిని ప్రసాదిస్తాయని చెప్పారు.

వనభోజనాల్లో పాల్గొన్న ప్రతాప్ రెడ్డి

విశాలాంధ్ర-కొత్తూరు: కార్తిక మాసం చివరి సోమవారం సందర్భంగా షాద్ నగర్ నియోజకవర్గ రెడ్డి సేవాసమితి మహిళా సంఘం వారి ఆధ్వర్యంలో సోమవారం కొత్తూరు మండలం, పెంజర్ల గ్రామ శివారులోగల అనంత పద్మనాభ స్వామి దేవాలయం ఆవరణలో నిర్వహించిన కార్తీక మాసం వన భోజనం కార్యక్రమంలో షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ మామిడి శ్యామ్ సుందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగ వారు దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు, గ్రంథాలయం కమిటీ చైర్మన్ మదన్ మోహన్ రెడ్డి, కేశంపేట మాజీ జడ్పిటిసి విశాల శ్రావణ్ రెడ్డి, చెంది మహేందర్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు అరుంధతి, మానస, సరిత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

అగ్రసేన్ టాలెంట్ కమిటీ బాలల దినోత్సవం



విశాలాంధ్ర, బషీర్ బాగ్ : అగ్రసేన్ టాలెంట్ కమిటీ ఆధ్వర్యంలో బాలల దినోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. అగర్వాల్ సమాజ్, తెలంగాణ పరిధిలోని అగ్రసేన్ టాలెంట్ కమిటీ ద్వారా బాలల దినోత్సవం సందర్భంగా నవంబర్ 16న బాలల పోటీ కార్యక్రమం నిర్వహించారు. అగర్వాల్ సమాజ్, తెలంగాణ అధ్యక్షులు అనిరుధ్ గుప్తా నాయకత్వంలో సంయుక్త మంత్రి డాక్టర్ సీమా జైన్ పర్యవేక్షణలో ఈ ఆకర్షణీయమైన కార్యక్రమం మొదటిసారిగా నిర్వహించారు. ఇందులో పెద్ద సంఖ్యలో పిల్లలు ఉత్సాహం చూపించారు. చాలా తన్మయత్వంతో తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. కార్యక్రమానికి అగర్వాల్ సమాజ్, తెలంగాణ అధ్యక్షులు అనిరుధ్ గుప్తా, ఉపాధ్యక్షులు రూపేష్ అగర్వాల్, గౌరవ మంత్రి వికాస్ కేశన్, అగర్వాల్ సమాజ్ తెలంగాణ మాజీ అధ్యక్షులు మనీష్ అగర్వాల్ తదితరులు హాజరై తమ ఉనికితో పిల్లలలో ఉత్సాహాన్ని నింపారు. కార్యక్రమ రూపకల్పనను వైస్ చైర్మన్ గీతా అగర్వాల్ తయారు చేశారు. అగ్రసేన్ టాలెంట్ కమిటీ చైర్మన్ నీనా అగర్వాల్, వైస్ చైర్మన్ రజనీ అగర్వాల్, ప్రీతి అగర్వాల్ అందరూ ఈ కార్యక్రమం విజయం సిద్ధి కోసం తమ వంతు సహకారాన్ని అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అధ్యక్షులు సురేష్ గుప్తా, విశిష్ట అతిథులుగా బజరంగ్ అగర్వాల్, కెపి అగర్వాల్ హాజరయ్యారు.

ప్రేక్షకులను అలరించిన నాట్యతోరణం

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: ఒకటి కాదు.. రెండు కాదు.. ఐదు రకాల నృత్య రీతులతో పాటు జుగల్‌బందీని కూడా కలగలిపి ప్రదర్శించిన నాట్యాలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. గత ఐదు సంవత్సరాలుగా అమృత కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ నృత్యపండుగ.. హైటెక్ సిటీలోని శిల్పకళావేదికలో ఆదివారం నగరవాసులను అలరించింది. సాయంత్రం 4 గంటల నుంచి దాదాపు రెండున్నర గంటల పాటు భరతనాట్యం, కూచిపూడి, కథక్, మోహినీఅట్టం, ఒడిస్సీ, జుగల్‌బందీ రీతులను పలువురు నర్తకులు, నర్తకీమణులు ప్రదర్శించారు. 40 మందికి పైగా నాట్యకారులంతా అత్యంత హృద్యమైన రీతుల్లో నాట్యభంగిమలు చూపించడంతో శిల్పకళావేదిక మొత్తం కరతాళధ్వనులతో నిండిపోయింది. ఈ సందర్భంగా అమృత కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రాజేష్ పగడాల మాట్లాడుతూ, "అశేష ప్రేక్షకాదరణ వల్లే మేం నాట్యతోరణం కార్యక్రమాన్ని ఇన్నేళ్లుగా హైదరాబాద్‌లో
నిర్వహించగలుగుతున్నాం. ఇది మాకు మరో మైలురాయి. ఇన్నాళ్ల పాటు చేసిన ప్రయత్నాలు, ఎన్నో రాత్రులు చేసిన కృషి, రిహార్సల్స్, ప్రణాళిక.. ఇవన్నీ కలిపి గుదిగుచ్చిన మాలగానే ఈ నాట్యతోరణం రూపొందింది. అమృత కల్చరల్ ట్రస్ట్ ట్రస్టీ భార్గవి పగడాల మాట్లాడుతూ, "ఈ ఐదేళ్లలో మేం 700 మందికి పైగా యువ నృత్యకారులు, ఏడు రకాల నృత్యరీతులకు అవకాశం కల్పించాం. ప్రతియేటా 50కి పైగా నృత్య పాఠశాలలు, 25 మందికి పైగా విశిష్ట గురువులు మా వేదికను, మా లక్ష్యాన్ని నమ్ముతున్నారు. ఈ కొత్త అధ్యాయంలోకి అడుగుపెడుతున్న అమృత కల్చరల్ ట్రస్టు.. తన లక్ష్యంపై దృష్టి కేంద్రీకరించి, ఎంతో ఉత్సాహంగా ముందడుగు వేస్తోంది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా
సీఎంఓ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి. చంద్రశేఖర్, అదనపు డీజీపీ అనిల్ కుమార్, ఆచార్య కళాకృష్ణ, సంగీత నాటక అకాడమీ అవార్డు విజేత దీపికారెడ్డి, మైహోం గ్రూప్ వైస్ చైర్మన్ జూపల్లి జగపతిరావు, సాయి సిల్క్స్ కళామందిర్ వ్యవస్థాపకుడు, ఎండీ చలవాది ప్రసాద్, ఫీనిక్స్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ చుక్కపల్లి సురేష్, కేఫ్ నీలోఫర్ చైర్మన్ అనుముల బాబూరావు, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ ఉషారామన్, పీఆర్ డిజైన్ హౌస్ సీఎండీ పార్వతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేద్దాం

ఉమా మహేష్

విశాలాంధ్ర-కాప్రా: ప్రజల కోసం జీవితాన్ని త్యాగం చేసేది కమ్యూనిస్టులేనని, సీపీఐ శత వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు. సీపీఐ ఉప్పల్ మండల సమితి సమావేశం ఈసీఐఎల్ లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్ లో రామ్ నారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజా జీవితంలో ఉండే కమ్యూనిస్టులకు ఎలాంటి మచ్చ ఉండని నిస్వార్థ పరులని అన్నారు. త్యాగాలకు, పోరాటాలకు నిలయం కమ్యూనిస్టు పార్టీ అని, అందుకే వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్నా నేటికీ ప్రజల గుండెల్లో నిలిచి ఉందన్నారు. ఎన్నికలు ధన ప్రవాహంగా మారిపోయినా, మతోన్మాద శక్తులు ప్రజలను విభజిస్తున్నా వాటికి ఎదురొడ్డి సీపీఐ నిలబడిందన్నారు. నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగం నుండి సెక్యులర్, సోషలిజం పదాలను తొలగిస్తూ ఈసీ, సీబీఐ లాంటి సంస్థలను తమ గుప్పెట్లో పెట్టుకుని ప్రశ్నించే వారిని అణిచివేసే చర్యలు చేపడుతున్నదని అన్నారు. అలాంటి వారికి ఎర్రజెండా అంటే భయమని, దేశంలో కమ్యూనిజాన్ని లేకుండా చేయాలనుకుంటున్నారని అన్నారు. దేశంలో కమ్యూనిష్టులందరూ ఏకం కావాలని, ఎర్రజెండాలన్నీ ఒకే జెండాగా మారాలని అందరూ కోరుకుంటున్నారని అన్నారు. కమ్యూనిస్టులు బడుగు, బలహీన వర్గాల కోసమే పోరాడుతారని, పేద ప్రజల పట్ల కమ్యూనిస్టులకు ఎంతో అంకితభావం ఉంటుందని అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం, హక్కుల సాధనలో కమ్యూనిస్టులు ముందుంటారని అన్నారు. మనువాద భావజాలాన్ని ప్రజలపై రుద్దుతున్న బీజేపీని తరిమికొట్టేం దుకు అందరం కలిసి కట్టుగా పనిచేయాలని కోరారు. డిసెంబర్25న ఖమ్మం లో జరిగే సీపీఐ శతాబ్ద ఉత్సవాలను జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జీ.దామోదర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.ధర్మేంద్ర, సీపీఐ ఉప్పల్ మండల కార్యదర్శి టి.సత్య ప్రసాద్, సహాయ కార్యదర్శి బషీర్, మండల సమితి సభ్యులు, ప్రజా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

అందెశ్రీ సంతాప సభను ఘనంగా నిర్వహిద్దాం

విశాలాంధ్ర - హైదరాబాద్ :: తెలంగాణ రాష్ట్ర గీత రచయిత, ప్రముఖ కవి అందెశ్రీ సంతాప సభను "రాష్ట్ర గౌరవానికి తగ్గట్టు, తెలంగాణ ఆత్మను ప్రతిబింబించేలా నిర్వహించాలని ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం మంత్రి నివాసంలో కవులు, కళాకారులు, దళిత సంఘాలు, ప్రజా సంస్థలు, ఉద్యోగ సంఘాలతో కలిసి ఆయన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి దళితుల పక్షాన నిలిచిన నాయకుడని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ నిర్ణయం నుంచి కళాకారులకు అధిక గౌరవం దక్కేలా తీసుకున్న చర్యల వరకూ సీఎం రేవంత్ రెడ్డి దళిత, బహుజన వర్గాల పక్షాన నిలిచిన నాయకుడని మంత్రి గుర్తుచేశారు. సీఎంకు కృతజ్ఞతగా, దళిత ఐక్యత సందేశంగా అందెశ్రీ సంతాప సభను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో దళితులు ఒక్కటై విజయాన్ని సాధించినట్లు ఈ సభలో కూడా సమాజం ఒకే తాటిపైకి రావాలని మంత్రి పిలుపునిచ్చారు. కవులు, కళాకారులకు ఇంత గౌరవం ఇచ్చిన సీఎం ఇప్పటివరకు లేరని కానీ అందెశ్రీ అంత్యక్రియల్లో సీఎం స్వయంగా పాల్గొనడం, కళాకారుల పట్ల ప్రభుత్వం చూపుతున్న గౌరవానికి ప్రత్యక్ష ఉదాహరణ అని మంత్రి పేర్కొన్నారు. ఈ అంతక్రియల్లో పాల్గొనడం నాకు అదృష్టం, భాగ్యం"గా భావిస్తున్న అని, ముఖ్యమంత్రి సమక్షంలో ఈ మహత్తర కార్యక్రమంలో పాల్గొనడం తనకు ఎంతో అదృష్టం అని మంత్రి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర గీతమే కాదు, తెలంగాణ స్ఫూర్తి, తెలంగాణ గౌరవం అందెశ్రీ రచనల్లో ఉందన్నారు. అందెశ్రీ రచనలు భవిష్యత్ తరాలకు మార్గదర్శకాలు అని మంత్రి పేర్కొన్నారు. సంతాప సభను సాంస్కృతిక%-%సామాజిక ఘట్టంగా%ొ% ప్రజలు, కవులు, కళాకారులు, విద్యార్థులు, సంఘాలు అందరూ పాల్గొనే వేదికగా తీర్చిదిద్దాలని సూచించారు.
ఈ సమావేశంలో ప్రొఫెసర్ కాశీం (ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్), ప్రొఫెసర్ విద్యాసాగర్ (వ్యవసాయ విశ్వవిద్యాలయం), టీఎంఆర్‌పీఎస్ నేతలు మేడి పాపయ్య, ఇటుక రాజు, రమేష్, సతీష్ మాదిగ, జెన్కో మేడి రమేష్, సంగీతం రాజలింగం, అరెపల్లి రాజేందర్, మోహన్, చింతా బాబు, మంచాల యాదగిరి, గంట సుదర్శన్, అందె రుక్కమ్మ, ముంజగాల విజయ్ కుమార్, మల్లెపోగు శ్రీనివాస్, జీడి నరసింహ, ఐఎన్ టీయుసి శివ, భీమ్, రవికిరణ్, శివ, లాజర్, సుగుణమ్మ, యోసేపు, యాదగిరి, శంకర్, ఓయూ రీసెర్చ్ స్కాలర్ పాల్వాయి నాగేష్ తదితరులు సూచనలు తెలియజేశారు. ఈ సన్నాహక సమావేశంలో పాల్గొన్న ముఖ్య నాయకుల సూచనల మేరకు సభ కార్యాచరణ ప్రణాళికను మంత్రి ఆమోదించారు.

జీవన ప్రమాణాల పెంపునకే చేప పిల్లల విడుదల: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-దుండిగల్: మత్స్యకారుల ఉపాధి, జీవన ప్రమాణాల పెంపుకోసమే ఉచిత చేప పిల్లల విడుదల కార్యక్రమమని బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పేర్కొన్నారు. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బౌరంపేట్ లోని పెద్ద చెరువు వద్ద జిల్లా మత్స్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "ఉచిత చేప పిల్లల విడుదల" కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా సుమారు 1.27 లక్షల చేప పిల్లలను చెరువులోకి వదిలారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెరువులపై ఆధారపడి జీవనం కొనసాగించే గంగపుత్రులు, ముదిరాజ్‌ల ఆర్థిక ఉన్నతికై రూపొందించినదే చేప పిల్లల పంపిణీ కార్యక్రమమన్నారు. కుల వృత్తులు పునరుజ్జీవనం ద్వారానే జీవన మనుగడ సాధ్యమని, నమ్మిన నాయకులు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. అనంతరం నిర్మాణ దశలో ఉన్న కమ్యూనిటీ హాల్ పనులను ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పరిశీలించి కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని,కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నా పూర్తి సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో-ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు,డీఎఫ్ఓ సుకీర్తి,మేడ్చల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి,మాజీ కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ,నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి,మురళీ యాదవ్, విష్ణువర్ధన్ రెడ్డి,వైస్ చైర్మన్ కాపర్తి మోహన్ కృష్ణ,డైరెక్టర్లు రాము, సంతోషి, సత్యవతి, మత్స్యపారిశ్రామిక సహకార సంఘం బౌరంపేట్ అధ్యక్షులు మన్నె బాల్ రాజ్ ముదిరాజ్,ముదిరాజ్ సంఘం అధ్యక్షులు భాగయ్య, ప్రధాన కార్యదర్శి మన్నె శేఖర్, ఉపాధ్యక్షులు దుగురి సత్యనారాయణ పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలి: మహేందర్ రెడ్డి

విశాలాంధ్ర-మొయినాబాద్ : కాలానుగుణంగా ఎప్పటికప్పుడు కొత్త ఆలోచనలతో వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవటం కోసం తపించాలని ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. చేవెళ్ల డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి జనరల్ హాస్పిటల్ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం (2025-2026) విద్యార్థులకు వైట్ కోట్ సెరిమని క్యాడవరిక్ ఓత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .... వైద్య వృత్తి నేటి కాలంలో ఎంతో గొప్పగా అనిపించినా విద్యార్థులు సేవాభావంతో మెలగాలన్నారు.మారుతున్న కాలానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు కొత్త ఆలోచనలతో వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవటం కోసం తపించాలని సూచించారు. ఎన్నో జన్మనెత్తితే తప్ప మానవ జన్మ రాదని ఇలాంటి పరిస్థితుల్లో మానవాళికి మంచి చేయాలనే దృక్పథం,ఆలోచన ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జోయారాణీ, మెడికల్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ గౌరీ,వైస్ ప్రిన్సిపల్ రాజేశ్వరరావు,జీఎం నగేష్,ఎజీఎం రవివర్మ, సీఓఓ అజీమ్ తదితరులున్నారు.

వయోవృద్ధుల సంరక్షణ చట్టంపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం - 2007 ప్రయోజనాలు, అమలు గురించి ప్రజలకు అవగాహన అవసరమని బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ అన్నారు. సోమవారం శ్రీ సత్య సాయి సమాజ సేవా ట్రస్ట్ సౌజన్యంతొ రైటర్ బస్తీ లో జిల్లా న్యాయ సేవాదికార సంస్థ కొత్తగూడెం ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమం లో ఆయన ముఖ్య అతిధిగ పాల్గొని మాట్లాడారు.

సర్కిల్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

విశాలాంధ్ర, మల్కాజిగిరి : మల్కాజిగిరి శాసన సభ్యులు మర్రి రాజశేఖరరెడ్డి తన క్యాంప్ కార్యాల యంలో జిహెచ్ ఎంసి మల్కాజిగిరి సర్కిల్ అధికారులతో సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. సఫిల్‌గూడ చెరువు నుండి సూర్య నగర్ కాలనీ వరకు ఉన్న బాక్స్ డ్రైన్ శిథిలావస్థ చేరుకుందని, గత 25 ఏళ్ళ క్రితం నిర్మించిన డ్రైన్ కావడంతో ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున, తక్షణమే సర్వే చేసి కొత్త బాక్స్ డ్రైన్ ప్రతిపాదనలకు సిద్ధం చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. అదే విధంగా బండ చెరువు నుంచి వచ్చే ఓవర్ ఫ్లో వల్ల షిరిడి నగర్, ఎన్ఎండిసి కాలనీతో పాటు పలు కాలనీలు ముంపు సమస్య ఎదుర్కొంటున్నాయని, ఈ సమస్య పరిష్కారం కొరకు కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ.ఈ.లక్ష్మణ్, డి.ఈ.ఈ లౌక్య, ఎస్ఎన్‌డిపి అధికారులు ఈ.ఈ.మాధవి, డి.ఈ.సందీప్ పాల్గొన్నారు.

సౌదీ అరేబియాలో బస్సు ప్రమాదం బాధాకరం: నామ

విశాలాంధ్ర-ఖమ్మం: సౌదీ అరేబియాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన అనేక మంది యాత్రికులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. మక్కా యాత్ర ముగించుకొని మదీనా వెళ్తున్న సమయం లో వారు ప్రయాణిస్తున్నా బస్సు డిజిల్ ట్యాంకర్ ను ఢీకొని భారతీయ యాత్రికులు సజీవ దహనమైన ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఆయన, ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబ సభ్యుల కు తన ప్రగాఢ సంతాపం తెలిపారు. అలాగే, గాయపడ్డ వారికి మెరుగైన చికిత్స అందించే విధంగా సౌదీ అధికారులతో మరియు భారత్ రాయబార కార్యాలయంతో సమన్వయం చేసి బాధిత కుటుంబాలకు సహాయం అందించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు ఆయా కుటుంబాలకు ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

విశాలాంధ్ర, హైదరాబాద్ : జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చి ప్రజావాణిలో ప్రజలు అందజేసిన దరఖాస్తులను అధికారులు సత్వరమే స్పందించి పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కదిరవన్ పలని సూచించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజా టవాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి.ముకుంద రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి ఈ.వెంకటాచారితో కలిసి కదిరవన్ పలని పాల్గొని, ప్రజల నుండి నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కదిరవన్ పలని మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన దరఖాస్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించేందుకు శాఖల వారీగా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని, దరఖాస్తులపై ఎండార్స్మెంట్ చేసి అధికారులకు సమర్పించారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, అవరమైతే క్షేత్రస్థాయిలో పర్యటించి, త్వరితగతిన పరిష్కరించి, పెండింగ్ లేకుండా చూడాలని ఆయన పేర్కొన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రజావాణి ముఖ్య ఉద్దేశమని, ఫిర్యాదులను వెంటనే పరిష్కరించి ప్రజావాణి పట్ల ప్రజలకు నమ్మకం కల్పించాలన్నారు. ప్రజావాణిలో హౌసింగ్ శాఖ 97 (2బిహెచ్‌కె-14, ఇందిరమ్మ ఇండ్లు 83), పెన్షన్స్ 6, రెవెన్యూ 38, ఇతర శాఖలు 20 మొత్తం 161 దరఖాస్తులు అందాయని ఆయన తెలిపారు. అలాగే గతంలోని ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల్లో ఏమైనా పెండింగ్లో ఉన్నట్లయితే వెంటనే పరిష్కరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రంలో హైదరాబాద్, సికింద్రాబాద్ ఆర్డిఓలు రామకృష్ణ, సాయిరాం, లా ఆఫీసర్ శ్రీధర్, సిపిఓ డాక్టర్.సురేందర్, డిఎంహెచ్ఓ డాక్టర్. వెంకటి, ఈడి ఎస్సీ కార్పొరేషన్ రమేష్, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖ అధికారులు కోటాజి, ఆశన్న, ప్రవీణ్, జి.ఎం ఇండ్రస్ట్రీస్ పవన్ కుమార్, కలెక్టరేట్ ఇంచార్జ్ ఎ.ఓ విజయ లక్ష్మీ, జిల్లా సర్వే అధికారి శ్రీరామ్, వివిధ శాఖల అధికారులు, అర్జీదారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది ఎస్ఎస్ రావుకు ఘన సన్మానం

విశాలాంధ్ర-బషీర్ బాగ్: గత 26 సంవత్సరాలుగా నిర్విరామంగా హైకోర్టులో న్యాయవాదిగా సేవలందిస్తూ నిరుపేదలకు న్యాయం శాస్త్రంపై చట్టాలపై అవగాహన శిబిరాలను నిర్వహిస్తున్న ప్రముఖ హైకోర్టు న్యాయవాదిని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నుండి ఒక్కరికి నియమించే హైకోర్టు అడ్మినిస్ట్రేటర్ జనరల్, అఫీషియల్ ట్రస్ట్ ఆఫ్ తెలంగాణ సోమ శ్రీనివాసరావు ఎస్ఎస్ రావును నియమించినందుకు తెలంగాణ మేధావులు పురం రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజనారాయణ ముదిరాజ్ నేతృత్వంలో శాలువా, జ్ఞాపిక పూలమాలతో హైకోర్టులోని తన చాంబర్లో ఘనంగా సన్మానించారు. నిజాం కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి, ఉస్మానియా యూనివర్సిటీలో న్యాయశాఖ ఎల్ఎల్బీ పట్టా 1997లో పొందారు. కాంగ్రెస్ పార్టీలో 1982 నుండి 20 25 వరకు అన్ని అసెంబ్లీ ఎన్నికల్లో పాల్గొని పార్టీ పటిష్టత కొరకు కృషిచేసి అందరి మన్నలను పొందారు. నిరుపేద గ్రామీణ మరియు హైదరాబాద్ నగర ప్రాంతంలోని ప్రజలకు ఉచిత న్యాయ సలహాలు ఇస్తూ జాగృతి శిబిరాల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేస్తున్నారు. తన సేవలను గుర్తించి ఇంత పెద్ద పోస్ట్ నియమించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు సహకరించిన మంత్రులు, శ్రీధర్ బాబు, సీతక్క, మాజీ మంత్రి కె జానరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్ఎస్ రావు గతంలో ఎన్ ఎస్ యు ఐ, యువజన కాంగ్రెస్ శాఖలలో 25 సంవత్సరాలుగా అనేక న్యాయపరమైన సమస్యలను, పార్టీ కార్యకర్తలకు తన శిబిరాల ద్వారా వివరించారు. ఎస్ఎస్ రావుకు న్యాయవాదిగా సేవలందిస్తున్నందుకు ఎన్నో యువజన సంస్థలు, మహిళా సంఘాలు ఎన్నో పురస్కార ఇచ్చి సన్మానించారు. ఈ సందర్భంగా డిఎల్ పాండు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయ సలహా సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి, శ్రీ నరేందర్ మాజీ ప్రధాన కార్యదర్శి తెలంగాణ హైకోర్టు, శ్రీకృష్ణశర్మ సీనియర్ న్యాయవాది శాతవాహన స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు వెంకటరెడ్డి, న్యాయవాది డివి శ్రీధర్, యువ హైకోర్టు న్యాయవాది కుమారి కె అఖిల, టి.ఐ.ఎఫ్ కోఆర్డినేటర్ జి వేణుగోపాల్ తదితరులు ఎస్ ఎస్ రావుకు ఈ సందర్భంగా శాలువలు పుష్పగుచ్చం జ్ఞాపికలతో ఘనంగా సన్మానించి అభినందించారు.

ఎమ్మెల్యే నవీన్ యాదవ్ జన్మదినం.. ఆలయాల్లో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : నియోజకవర్గంలో జరిగిన ఉప ఎన్నికల్లో విజయం సాధించిన వల్లల నవీన్ యాదవ్ జన్మదినం సందర్భంగా, నియోజకవర్గంలోని, ప్రతిబస్తీలో, దేవాలయాలు, సామాజిక కార్యక్రమాలు, రక్తదాన కార్యక్రమాలు, కేక్ కటింగ్ నిర్వహించి ప్రజలు నవీన్ యాదవ్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే నవీన్ యాదవ్, నియోజకవర్గంలోని వివిధ దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ శ్రీ శ్రీ ప్రసన్నంజనేయం స్వామి మరియు శ్రీ శ్రీ శ్రీ భ్రమరంభ సమేత మల్లి ఖార్జున స్వామి ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించిన జూబ్లీహిల్స్ శాసనసభ్యులు వల్లాల నవీన్ యాదవ్ గారు. నేడు జూబ్లీహిల్స్ శాసనసభ్యులు వల్లాల నవీన్ యాదవ్ గారి పుట్టినరోజు సందర్భంగా యూసుఫ్ గూడ డివిజన్ కృష్ణ నగర్ లో ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి శ్రీ శ్రీ శ్రీ ప్రసన్నంజనేయ స్వామి, భ్రమరాంబ సమేత మల్లి ఖార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుట్టినరోజు వేడుకలో పాల్గొని కేక్ కట్ చేశారు. స్థానిక నాయకులు ఎమ్మెల్యే నవీన్ యాదవ్ కి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఈ ఎల్ రామయ్య గాలయ్య, ఆది లక్ష్మి, జలజ, సంపత్, జయసింహా, మన్మోహన్, హేమంత్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

పేదోడి సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాధ్యం

విశాలాంధ్ర - మొయినాబాద్ : పేదోడి ఇంటింటి కల నెరవేర్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పామెన భీమ్ భరత్ అన్నారు. శంకర్ పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామానికి చెందిన మొగులయ్య , లక్ష్మి దంపతుల ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశంలో పాల్గొని నూతన వస్త్రాలను కానుకగా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... నాడైనా నేడైనా ఏనాడైనా పేదోడి సొంతింటి కల నెరవేర్చే ది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు మోసం చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు కట్టించి పేదోడికి గూడు కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీష్ , జాతీయ నాయకులు అనంతరెడ్డి, శంకర్పల్లి మార్కెట్ కమిటీ రవీందర్ రెడ్డి , శంకర్, కృష్ణారెడ్డి, శ్రీనాథ్, సమీ, శివ ప్రశాంత్ రెడ్డి, సేవాదళ్ మండల నాయకులు ఈశ్వర్, శంకర్, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అఖిల భారత సహకార మహోత్సవాలు

విశాలాంధ్ర - తుర్కయంజల్ : తుర్కయంజల రైతు సేవా సహకార సంఘం లిమిటెడ్‌లో, 72వ అఖిల భారత సహకార మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ఏసిఎస్ తుర్కయంజాల్ సొసైటీలో జెండా ఆవిష్కరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా టీజీ క్యాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య జెండా ఆవిష్కరణ చేశారు.కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు కొత్త రామ్ రెడ్డి, వంగేటి లక్ష్మారెడ్డి, సామ సంజీవరెడ్డి, జక్కా కృష్ణారెడ్డి, సామ సత్యనారాయణ రెడ్డి, శీలం లక్ష్మమ్మ, చాపల యాదగిరి, సొసైటీ సెక్రటరీ రాందాస్ గౌడ్, సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర, మల్కాజిగిరి : మల్కాజిగిరి డివిజన్‌కు చెందిన పలువురు అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు వైద్య ఖర్చుల నిమిత్తం చుక్క మల్లేష్ రూ.60,000 మేహునిసా బేగం రూ.15,000 నందు కుమార్ రూ.27,000 చెక్కులు మంజూరు కాగా ఈ సోమవారం శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్‌తో కలిసి క్యాంప్ కార్యాలయంలో బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ముఖ్యమంత్రి సంక్షేమ సహాయనిధి పేదలు అనారోగ్యానికి గురైన సమయంలో వారికి ఆపన్న హస్తంలా ఉపయోగపడుతుందన్నారు. నిరుపేదల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ వారి సంక్షేమానికి పాటుపడుతున్న ఎమ్మెల్యేకు బాధితులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బద్దం పరశురాం రెడ్డి, అనిల్ కిషోర్, కరంచంద్, జనార్దన్, తులసి సురేష్, సంతోష్, బాలకృష్ణ, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

అట్లాంటాలో 'తెలంగాణ కనెక్ట్స్ 2025'

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి: తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (టీఈసీసీఐ) ఆధ్వర్యంలో అమెరికాలోని జార్జియా రాష్ట్రం అట్లాంటాలో డిసెంబర్ 6వ తేదీన ప్రతిష్ఠాత్మక 'తెలంగాణ కనెక్ట్స్ 2025 యూఎస్ఏ, అట్లాంటా బిజినెస్ సమ్మిట్' జరగనుంది. ఈ సమ్మిట్ కు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కు కజకిస్తాన్ గౌరవ కాన్సుల్ డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్ను గౌరవ అతిథిగా ఆహ్వానించారు. తెలంగాణ ఎన్ఆర్ఐలు, ఇతర భారతీయ మూలాలు ఉన్న పెట్టుబడిదారులు, గ్లోబల్ ఇన్వెస్టర్లను ఒకేచోటకు తేవడమే ఈ సమ్మిట్ ఉద్దేశం. ఈ కార్యక్రమానికి భారత కాన్సుల్ జనరల్ (జార్జియా) రమేశ్ బాబు లక్ష్మణన్ ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారు. తెలంగాణ కనెక్ట్స్ 2025 ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో జరగనుంది. ఇది తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కథను ప్రపంచ పెట్టుబడిదారులతో, ఎన్ఆర్ఐలతో అనుసంధానించే వ్యూహాత్మక వేదికగా నిలుస్తోంది. అంతర్జాతీయ పెట్టుబడులతో పాటు పరిశ్రమ, ఆవిష్కరణ, సస్టైనబుల్ డెవలప్‌మెంట్ రంగాలలో తెలంగాణను ప్రపంచవ్యాప్తంగా ప్రాధాన్య గమ్యస్థానంగా నిలబెట్టడమే లక్ష్యం. డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్ ఎన్ఆర్ఐ సమాజంలోని ప్రముఖులు, గ్లోబల్ పెట్టుబడిదారులను ఉద్దేశించి మాట్లాడనున్నారు. తెలంగాణ ప్రభుత్వం అవలంబిస్తున్న పెట్టుబడిదారుల అనుకూల విధానాలు, మౌలిక వసతులు, కీలక రంగాల్లో ఉన్న విశాలమైన భాగస్వామ్య అవకాశాలను ప్రత్యేకంగా వివరించనున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్ మాట్లాడుతూ తెలంగాణ ఈరోజు ఆధునిక మౌలిక వసతులు, స్నేహపూర్వక విధానాలతో దూరదృష్టి గల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రపంచ స్థాయి పెట్టుబడి గమ్యస్థానంగా అవతరించిందన్నారు. 'తెలంగాణ కనెక్ట్స్ 2025 యూఎస్ఏ' ప్రపంచ పెట్టుబడిదారులతో తెలంగాణను కలుపుతూనే, రాష్ట్రంలోని విస్తారమైన అవకాశాలను ప్రదర్శించే వ్యూహాత్మక వేదికగా నిలుస్తోందని తెలిపారు. తెలంగాణకు పెట్టుబడులను మరింత అనుకూలంగా మలిచేందుకు ఈ కార్యక్రమం ఉత్సాహాన్ని అందిస్తుందని పేర్కొన్నారు.

అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి

విశాలాంధ్ర, హైదరాబాద్ : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు, విన్నపాలను సత్వరమే పరిష్కరించాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులను ఆదేశించారు.సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి నగరంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు కమీషనర్ కు తమ విన్నపాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రజల నుండి అందిన ఫిర్యాదులను కమీషనర్ క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ ఆర్.వి కర్ణన్ మాట్లాడుతూ... ప్రజల విన్నపాల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని అధికారులను ఆదేశించారు. అర్జీదారులు ఒకే సమస్య పై పదేపదే రాకుండా హెచ్ఓడి లు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 67 విన్నపాలు ,ఫిర్యాదులు అందాయి. జిహెచ్ఎంసి పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 105 అర్జీలు వచ్చాయి. అందులో కూకట్ పల్లి జోన్ లో 46, శేరిలింగంపల్లి జోన్ లో 20, సికింద్రాబాద్ జోన్ లో 18 చొప్పున, చార్మినార్ జోన్ లో 5, ఎల్బీనగర్ జోన్ లో 15, ఖైరతాబాద్ జోన్ లో ఒకటి ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు రఘు ప్రసాద్, సత్యనారాయణ, వేణు గోపాల్, సి సి పి శ్రీనివాస్, భూ సేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రాములు విజిలెన్స్ ఏఎస్పీ నర్సింహా రెడ్డి అడిషనల్ సి సి పి లు తదితరులు పాల్గొన్నారు.

వృత్తి ధర్మమే సమాజంలో గుర్తింపు

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: డివిజన్‌లోగల కొండాపూర్ ఎంపీపీఎస్ పాఠశాలలో హెచ్ఎం శేగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి గారి ఉద్యోగ విరమణ అభినందన సభలో శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ గారు మాట్లాడుతూ%శా% ప్రధానోపాధ్యాయులు శేగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి గారు అందించిన సేవలు చిరస్మరణీయంగా గుర్తుండి పోతాయన్నారు. 35 సంవత్సరాలు సుదీర్ఘ కాలంలో వెలకట్టలేని సేవలందించి, ఎలాంటి మచ్చ లేకుండా ఒక క్రమశిక్షణతో ఎంతోమంది విద్యార్థులను ఉన్నత స్థాయికి ఎదిగేలా విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత దక్కించుకుని ఎలాంటి చెడ్డపేరు లేకుండా కృషి చేసినటువంటి వారికి, వారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. వృత్తి ధర్మమే సమాజంలో గుర్తింపునిస్తుందని వారి శేష జీవితం మంచి ఆరోగ్యంతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఆటపాటలతో అందరిని అలరించారు. ఈ కార్యక్రమంలో పిఆర్ టియు టీఎస్ రంగారెడ్డి అధ్యక్షులు శ్యామల మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణ రెడ్డి, మండల పిఆర్ టియు అధ్యక్షులు హనుమంతు, గౌరవ అధ్యక్షులు రాఘవేందర్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సుభాష్ చంద్ర రెడ్డి, కొండాపూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శి రవీందర్ రెడ్డి, పిఆర్ టియు నాయకులు శివరాజ్, అనంత్ రెడ్డి, నాగయ్య, పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ స్వగృహ ఓపెన్ ప్లాట్ల బహిరంగ వేలం

విశాలాంధ్ర - హైదరాబాద్ :: రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ అధ్వర్యంలోని ఓపెన్ ప్లాట్ల విక్రయాలకు మరోసారి మంచి స్పందన వచ్చింది. నగర శివారు ఒ ఆర్ ఆర్ కు సమీపంలో ని తొర్రూర్, కుర్మల్ గూడ, బహదూర్ పల్లి, ప్రాంతాలో ని 163 ప్లాట్ల కు బహిరంగ వేలం నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ బహిరంగ వేలంలో తొలి రోజున తొర్రూర్ లోని 59 ప్లాట్లకు వేలం నిర్వహించారు. ఈ విక్రయాల్లో అత్యధికంగా చదరపు గజానికి రూ. 39 వేల ధర పలికింది. మొత్తం మీద ఈ ప్రాంతంలో చదరపు గజానికి సగటున రూ. 28,700 ధర పలికింది. ఇక్కడి భూములకు కనీస ధర రూ. 25 వేలు గా నిర్ధారించి వేలం నిర్వహించారు. సోమవారం నాటి విక్రయాల ద్వారా మొత్తం రూ. 46 కోట్ల మేర ఆదాయం వచ్చిందని స్వగృహ కార్పొరేషన్ ఎం.డి.వి.పి.గౌతమ్ తెలిపారు. ఈ వేలం పాటలో 110మంది బిడ్డర్లు పాల్గొన్నారన్నారు. తొర్రూర్ ప్రాంతం లోని మిగిలిన 65 ప్లాట్లకు, కుర్మల్ గూడ లోని 25 ప్లాట్లు, బహదూర్ పల్లి లోని 13 ప్లాట్లకు మంగళవారం నాడు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు.

భూ సేకరణలో రైతులకు అత్యధిక పరిహారం

విశాలాంధ్ర బ్యూరో-ఖమ్మం: సీతారామ ఎత్తిపోతల పథకం భూ సేకరణకు నిబంధనల మేరకు అత్యధిక పరిహారం అందిస్తామని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. కలెక్టరేట్ లో సింగరేణి మండలం బాజు మల్లాయిగూడెం, రేలకాయపల్లి గ్రామాలలో సీతారామ ఎత్తిపోతల పథకం నిమిత్తం భూ సేకరణ పరిహారం రేటు నిర్ధారణ కు సంబంధిత రైతులతో అదనపు కలెక్టర్ చర్చించారు. సింగరేణి మండలం బాజు మల్లాయిగూడెం, రేలకాయపల్లి గ్రామాలలో సీతా రామ ఎత్తిపోతల పథకం 13వ ప్యాకేజీ నిర్మాణంలో భాగంగా భూ సేకరణ చేయాల్సి ఉండగా, భూ సర్వే నిర్వహించి అవార్డులు ప్రకటించామని, ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించి, పరిష్కరించామని అన్నారు. బాజుమల్లాయిగూడెం గ్రామంలో ఎకరానికి 2 లక్షల 70 వేల రూపాయలు ఉందని, భూ సేకరణ చట్టం ప్రకారం రెండింతలు అనగా 5 లక్షల 40 వేల రూపాయలు చెల్లించాల్సి ఉండగా ప్రభుత్వం పెంచి 10 లక్షల 80 వేల రూపాయలు చెల్లించాలని నిర్ణయించిందని అన్నారు. ఆర్బిట్రేషన్ లో 12 శాతం వడ్డీ క్రింద 64 వేల రూపాయలు కలిపి మొత్తం 11 లక్షల 44 వేలు ఎకరాకు చెల్లించనున్నట్లు తెలిపారు.
రేలకాయపల్లి గ్రామంలో ఎకరానికి 2 లక్షల 92 వేల రూపాయలు ఉందని, భూ సేకరణ చట్టం ప్రకారం రెండింతలు అనగా 5 లక్షల 85 వేల రూపాయలు చెల్లించాల్సి ఉండగా ప్రభుత్వం పెంచి 11 లక్షల 70 వేల రూపాయలు చెల్లించాలని నిర్ణయించిందని అన్నారు. ఆర్బిట్రేషన్ లో 12 శాతం వడ్డి క్రింద 70 వేల 390 వేల రూపాయలు కలిపి మొత్తం 12 లక్షల 40 వేల 390 రూపాయలు ఎకరాకు చెల్లించనున్నట్ల తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రతి సంవత్సరం 11 శాతం చొప్పున పెంచి ఎకరం విలువ 3 లక్షల 59 వేల అవుతుందని, వీటికీ 4 రెట్లు పెంచి 14 లక్షల 37 వేలు, అదనపు విలువ పెంచితే 14 లక్షల 50 వేల వరకు మాత్రం పరిహారం ఇచ్చేందుకు ఆస్కారం ఉంటుందని అన్నారు.
ప్రభుత్వ నిబంధనల ప్రకారం చివరికి బాజుమల్లాయిగూడెం గ్రామ రైతులకు ఎకరానికి 15 లక్షలు, రేలకాయపల్లి గ్రామ రైతులకు ఎకరానికి 16 లక్షల రూపాయలు భూమికి పరిహారం అందుతుందని అన్నారు. భూమిలో ఉన్న వ్యవసాయ పంపు సెట్ల, చెట్లు, ఇతర నిర్మాణాలకు విడిగా పరిహారం అందిస్తామని అన్నారు. ఈ సమావేశంలో భూములు కోల్పోతున్న రైతులు ఎకరానికి 35 నుంచి 40 లక్షల చొప్పున పరిహారం ఇప్పించాలని, కోరారు . ఈ సమావేశంలో ఎస్డీసి ఎం. రాజేశ్వరి, ఏడి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ శ్రీనివాసులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడి చిన్నారులకూ విజయ పాలు

పౌష్టికాహార లోపం లేని తెలంగాణ నిర్మించడమే లక్ష్యం: మంత్రి సితక్క

విశాలాంధ్ర - హైదరాబాద్ :: ములుగు జిల్లా కేంద్రంలోని కృష్ణా కాలనీ అంగన్వాడీ కేంద్రంలో తెలంగాణ రాష్ట్రం లోనే తొలిసారిగా చేపట్టిన పైలట్ ప్రాజెక్టులో భాగంగా ప్రీస్కూల్ చిన్నారులకు 100 మి.లీ పాలను ప్రతీరోజు అందించే కార్యక్రమం నిర్వహించాడు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణా రాష్ట్ర మహిళాభివృద్ధి %ఊ% శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు డా. దానసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ రాష్ట్రంలోని పోషకాహార లోపాన్ని అధిగమించి మన తెలంగాణ రాష్ట్రాన్ని పోషకాహార లోప రహిత తెలంగాణగా మార్చడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నదని, అందులో భాగంగానే ఎక్కువగా వెనుకబాటు తనంతో ఉన్న మన ములుగు జిల్లాను ఈ కార్యక్రమానికి పైలట్ ప్రాజెక్టుగా ఎంచుకోవడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమం విజయవంతానికి అంగన్వాడీ టీచర్లు క్రియాశీల పాత్ర వహించాలని తెలిపారు. ముఖ్యంగా తల్లితండ్రులను కలిసి అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను వివరించాలని సూచించారు. అలాగే కార్పోరేట్ పాఠశాలలకు దీటుగా మన అంగన్వాడీ కేంద్రాలు పనిచేసేలా అంగన్వాడీలు అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. అనంతరం వయోవృద్ధుల వారోత్సవాల్లో భాగంగా పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడుతూ తల్లితండ్రులను ఎవరైతే పిల్లలు నిర్లక్ష్యం చేస్తారో వారి నుండి ఆస్తులను జప్తుచేసి తల్లితండ్రుల మీద మార్పిడి చేయడం జరుగుతుందని అన్నారు. అనంతరం బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా బాలల హక్కుల పరిరక్షణ మరియు బాలి వివాహాలపై ఏర్పాటుచేసిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఆనం మాట్లాడుతూ బాల్యవివాహాలు పిల్ల అభివృద్ధికి విఘాతం అని, కానా బాల్య వివాహాలను అడ్డు ములుగును బాల్యవివ్ రా జిల్లా గా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ విషయంలో సీడీపీకి లు, సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, ఇతర ఎంత కృషిచేయాలని సూచించారు.

అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ములుగు జిల్లాలో రాష్ట్రంలోనే ఈ కార్యక్రమాన్ని మోడల్ గా తీసుకువచ్చిన మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్య విజయవంతానికి అంత కృషిచేయాలని సూచించారు. అనంతరం జిల్లా సంక్షేమ అధికారి తుల రవి స్వాగతోపన్యాసంలో జిల్లాలో జరుగుతున్న కార్యక్రమాల తీరు తెన్నులను వివరించారు. అనంతరం ములుగు సీడీపీఓ కూచన శిరీష గారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాల పంపిణీని ప్రారంభించి ప్రీస్కూల్ చిన్నారులకు ఉచిత 100 మీ.లీ లీటర్ల పాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ పిఓ. చిత్రామిశ్రా, అదనపు కలెక్టర్ మహేందర్ జీ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవి చంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, ములుగు ఆత్మ చైర్మన్, వివిధ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓలు, డిసిపిఓ ఓంకార్, డీఎంసి రమాదేవి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, డిసిపియు, సిహెచ్ ఎల్, సఖి, తదితర విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

ఓట్ చోరీకి వ్యతిరేకంగా మహా నిరసన

విశాలాంధ్ర - హైదరాబాద్ :: తెలంగాణ యూత్ కాంగ్రెస్ సైనికులుగా ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి శక్తివంతంగా పని చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దేశ వ్యాప్తంగా ఓట్ చోరీ నిరసనలు ఉధృతం చేయాలని, దీని బాధ్యతగా తీసుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ విధానాలు ఇంటింటికి తీసుకోపోవాల్సిన బాధ్యత మీదే అన్నారు. సోమవారం గాంధీభవన్ లో తెలంగాణ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఓట్ చోరీకి వ్యతిరేకంగా గాంధీ భవన్ లో తెలంగాణ యువజన కాంగ్రెస్ మహా నిరసన కార్యక్రమానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తదితరులు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు ముందుగా సౌదీ అరేబియా బస్సు ప్రమాదంలో మృతి చెందిన వారికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఓట్ చోరీకి వ్యతిరేకంగా యూత్ కాంగ్రెస్ సభ్యుల నినాదాలు చేశారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఓట్ చోరీ ఏ విధంగా జరుగుతుందో రాహుల్ గాంధీ నిరూపించారని, ఎన్నికల కమిషన్ దానిని ఎందుకు చూపెట్టలేకపోయిందని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి అనేక రకాలుగా ఓట్లు తొలగించి చోరీకి పాల్పడుతోందని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా ఓట్ చోరీ పై ఆనాడు స్వాతంత్ర్య ఉద్యమంలో దీర్ఘకాలిక పోరాటాలు చేసి ప్రాణ త్యాగాలు చేసిన వారసత్వం ఉన్న పార్టీగా ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి కాంగ్రెస్ పార్టీ నిరసనలు తెలుపుతుందన్నారు. ఉప ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలు అనేక రకాలుగా ఆరోపణలు చేసిన మన పై నమ్మకంతో గెలిపించారని చెప్పారు. ప్రజల విశ్వాసాన్ని నమ్మకంతో గెలిచామని, సౌదీ అరేబియా బస్సు ప్రమాదం లో 42 మంది మృతి చెందారని, అందులో 16 మంది హైదరాబాద్ వారు ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపట్టిందని, ఎన్నారై అడ్వైజరీ కమిటీ వినోద్ ఆ చర్యల్లో ఉందని వివరించారు. వారి మృతిపట్ల ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది అన్ని రకాల చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఉదయ భాను చిబ్ ,రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, ఇతర ముఖ్య నేతలు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ సభ్యులు పాల్గొన్నారు.

లెవెల్ క్రాసింగ్‌ల వద్ద భద్రత నిర్వహణపై సమీక్ష

విశాలాంధ్ర, హైదరాబాద్ : దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అధికారులు, సిబ్బందికి రోడ్డు ట్రాఫిక్ భద్రత, రైలు కార్యకలాపాలలో భద్రతకై అన్ని లెవెల్ క్రాసింగ్ గేట్ల వద్ద భద్రతా ప్రోటోకాల్‌లను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. సోమవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో భద్రత, ట్రాఫిక్ సౌకర్యాల పనులపై వివరణాత్మక సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమీక్షాసమావేశంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్, వివిధ శాఖలకు చెందిన ప్రధానాధిపతులతోపాటు మొత్తం 6 డివిజన్ల సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, నాందేడ్ డివిజనల్ రైల్వేమేనేజర్లు (డి.ఆర్.ఎంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. జనరల్ మేనేజర్ రైలు కార్యకలాపాల నిర్వహణలో భద్రతను నొక్కి చెబుతూ, రోడ్డు ట్రాఫిక్ సురక్షితంగా ప్రయాణించడానికి, రైలు కార్యకలాపాలలో ఇంటర్‌లాకింగ్ లేని అన్ని గేట్ల వద్ద భద్రతా మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించడం చాలా ముఖ్యమైనదని పేర్కొన్నారు. జోన్‌లో నాన్‌ఇంటర్‌లాకింగ్ గేట్ల స్థానం గురించి అధికారులు జనరల్ మేనేజర్‌కు వివరించారు. నాన్‌ఇంటర్‌లాకింగ్ గేట్లను ఇంటర్‌లాకింగ్ లెవల్ క్రాసింగ్ గేట్లుగా మార్చడంపై కార్యాచరణ ప్రణాళికను జనరల్ మేనేజర్ సమీక్షించారు. రోడ్డు, రైలు వినియోగదారుల భద్రతను బలోపేతం చేయడానికి ఆర్.యూ.బి లు, ఆర్. ఓ.బిల వద్ద కొనసాగుతున్న పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. జనరల్ మేనేజర్ శీతాకాలంపై సమీక్షించారు. అందుకు సంబందించి తగినన్నీ పొగమంచు పరికరాలు, విద్యుత్, సిగ్నల్ పరికరాలు, ట్రాక్ ఇరుప్రక్కల అడ్డుగా ఉన్న చెట్ల నరికివేతపై అధికారులతో సమీక్షించారు. రైళ్ల ఆక్రమిత లైన్లకు వ్యతిరేకంగా సెట్ చేయబడిన పాయింట్‌ను గుర్తించడానికి స్టేషన్లలో భద్రతా అలారాలను ఏర్పాటు చేయడంపై కూడా ఆయన చర్చించారు. తరువాత, సంజయ్ కుమార్ శ్రీవాస్తవ జోన్‌లో జరుగుతున్న ట్రాఫిక్ సౌకర్యాల పనులు, యార్డ్ రీమోల్డింగ్ పనుల పురోగతిని సమీక్షించారు. గతి శక్తి కార్గో టెర్మినల్ నిర్మాణ పనుల పురోగతిపై సమీక్షిస్తూ వాటిని షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాల్సిన లక్ష్యాలను నిర్ణయించాలని కూడా ఆయన సమీక్షించారు.

ఏకలవ్య గురుకుల పాఠశాల ఎదుట డీఎస్ఎఫ్ఐ ధర్నా

విశాలాంధ్ర-గూడూరు: మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలో గత నాలుగు రోజుల నుండి ఏకలవ్య పాఠశాలలో ఉప్పు కారంతో భోజనం తిని కడుపులో మంటతో పిల్లలు అవస్థలు పడుతున్న విద్యార్థుల గోడు తెలుసుకుందామని ఏకలవ్య గురుకుల పాఠశాలకి వెళ్తే అనుమతించకోవడంతో గేట్ ఎదుట డిఎస్ఎఫ్ఐ అధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డి ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బానోత్ దేవేందర్ మాట్లాడుతూ పాఠశాలకు కూరగాయల పంపిణీ టెండర్ అయిపోయి 15 రోజులు గడిచిన అప్పటినుండి నేటి వరకు కూరగాయలు తెప్పించకుండా అందుబాటులో ఉన్న ఉల్లిపాయ కారంతో భోజనం పెట్టి చేతులు దులుపుకుంటున్నారని, ఈ పాఠశాల అడవి ప్రాంతంలో ఉండటంవల్ల పిల్లలు బయటకు రాలేక, ఎవరికి చెప్పుకోలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. మొన్న జరిగిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు నిలదీసినప్పటికీ పాఠశాల యాజమాన్యం మౌనంతో ఉండడంతో డిఎస్ఎఫ్ఐ నేతలు ఆగ్రహించారు. చివరికి నిన్న పేరెంట్స్ కమిటీ సభ్యులు వస్తున్నారని గుడ్డుతో కూడిన భోజనం పెట్టడంతో ఆ భోజనంలోనే పురుగులు రావడంతో పేరెంట్స్ వాళ్లు కూడా ఆ భోజనాన్ని బయటపడేసి, ఉపాధ్యాయులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారని తెలిపారు. ఇది ఇలా ఉండగా ఏకలవ్య స్కూలు ఇంగ్లీష్ మీడియం అయినప్పటికీ ఉత్తర భారతదేశం నుండి వచ్చిన ఉపాధ్యాయులు పూర్తిగా హిందీలోనే బోధిస్తున్నారని, ఈ భాష ఈ ప్రాంత విద్యార్థులకు అర్థం కాకపోవడం తో విద్యార్థులు చదువులు అప్పటికంటే ఇప్పుడే చాలా వెనుకబడి ఉన్నారని, విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు, డిఎస్ఎఫ్ఐ నేతలు తెలిపారు.ఉదయం 8 గంటలకు వచ్చిన ఉపాధ్యాయులు మధ్యాహ్న ఒంటిగంట వరకే ఉండి ప్రభుత్వం వాళ్లకు కల్పించిన క్వార్టర్స్ లోకి వెళ్లిపోయి మళ్లీ పిల్లల ముఖం చూడటం లేదు ధ్వజమెత్తారు..అసలు పాఠశాలలో విద్యార్థులు ఏం చేస్తున్నారని కూడా పట్టించుకోవడంలేదని పేరెంట్స్ కమిటీ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఏకలవ్య స్కూలుకు చైర్మన్గా ఉన్న జిల్లా కలెక్టర్ స్పందించి ఆర్ సి ఓ పై,పాఠశాల యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని డిఎస్ఎఫ్ఐ నేతలు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో డి ఎస్ ఎఫ్ ఐ మండల నేతలు శేఖర్,నవీన్, సురేష్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణదారులపై చర్యలు తీసుకోండి

-ఆదివాసి సంక్షేమ పరిషత్



విశాలాంధ్ర - ఇల్లందు : గుండాల మండల కేంద్రంలో అక్రమ నిర్మాణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ నాయకులు డిమాండ్ చేసారు. సోమవారం గుండాల తాహసిల్దార్ కు వినతి పత్రం అందజేసారు. అనంతరం మండల అధ్యక్షులు పూనెం రమణబాబు మాట్లాడుతూ 1/70, పిసా చట్టం, పంచాయితీ రాజ్ చట్టంకు విరుద్ధంగా గుండాల మండల కేంద్రంలో విపరీతంగా వలసలు వచ్చి ఇక్కడి గ్రామాల్లో తక్కువ ధరకు భూములు కొనుగోలు చేస్తున్నట్లు ఆరోపించారు. ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా క్రయవిక్రయాలు జరుపుతున్నట్లు విమర్శించారు. ఈ వలస దారులు కొనుగోలు చేసిన భూములను విపరితమైన ధరలు పెంచుతూ వ్యాపారం చేస్తున్నారన్నారు. అక్రమంగా బహుళ అంతస్తుల కడుతున్నా స్థానిక అధికారులు చొద్యం చేస్తున్నారానీ విమర్శించారు. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018 సెక్షన్ 52 క్లాస్ (ఇ)114,120 అనుమతులు మంజూరు చెయ్యకుండానే నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. ఈ ఆక్రమణ దారులపై గ్రామ పంచాయతీ భూ లే ఔట్ నిబంధనలు 2002 కింద కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి నాయకులు జబ్బా సుదర్శన్, తాటి బాలకృష్ణ, కుంజ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వనభోజన మహోత్సవంలో తలసాని

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి : హైదరాబాద్ కెపిహెచ్బి కాలనీ నాలుగో పేజ్, ఏడో ఫేస్ దగ్గర, మలేషియా టౌన్షిప్ ఎదురుగా గోవర్ధనగిరి కృష్ణ దేవాలయంలో అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో నిర్వహించిన యాదవుల కార్తీకమాసం 19వ వనభోజన మహోత్సవ కార్యక్రమంలో మాజీ మంత్రివర్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్, శేర్లింగంపల్లి బిజెపి కంటెస్టెంట్ కార్పొరేటర్ బోయిని మహేష్ యాదవ్, కంటెస్టెంట్ కార్పొరేషన్ మారబోయిన రవికుమార్ యాదవ్, బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు భేరి రామచందర్ యాదవ్, మెట్టు కుమార్ యాదవ్ మరియు యాదవ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బేరి రామచందర్ యాదవ్ మాట్లాడుతూ యాదవ అభిమాన సంజాతులారా అభిమాన యాదవ మిత్రులారా పరమ పావనమైన కార్తీక మాస సమారాధన కార్యక్రమానికి విచ్చేసిన యాదవ సోదర సోదరీమణులకు అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. 19 సంవత్సరాలుగా ఆడంబరంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని గురించి ఎంత చెప్పినా తక్కువే అని అన్నారు. ఈ వేడుక యాదవుల ఐక్యతకు సూచిక అని అన్నారు. యాదవులు రాజ్యాధికారం దిశగా వెళ్లాలంటే యాదవుల ఐక్యతకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ వారిలో చైతన్యం తీసుకొచ్చి రాజ్యాధికారం చేజిక్కించుకోవాలని అన్నారు. యాదవులంతా ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఇంతటి కార్యక్రమాన్ని నిర్వహించిన కెపిహెచ్బి యాదవ సంఘం సభ్యులను పేరుపేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్, సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు నాగరాజు యాదవ్, వెంకటయ్య యాదవ్, గంగాల నరసింహ యాదవ్ శంకరయ్య స్వామి, మారబోయిన సదానంద్ యాదవ్, డాక్టర్ కుమారస్వామి యాదవ్, పాములేటి యాదవ్, యాదవ్ బంధుమిత్రులు పాల్గొన్నారు.
పెట్టుబడి లేకుండానే వ్యాపారం

హైదరాబాద్ కంపెనీ డబ్ల్యుకామర్స్ సంచలనం

విశాలాంధ్ర, హైదరాబాద్ : సరుకులు నిల్వ చేయాల్సిన అవసరం లేదు. అంతే కాదు పైసా పెట్టుబడి లేకుండానే వ్యాపారం చేయవచ్చని చెబుతోంది డిజిటల్ కామర్స్ ప్లాట్‌ఫామ్ డబ్ల్యుకామర్స్. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాలను ఆసరాగా చేసుకుని చిరు వ్యాపారులు, వ్యక్తులు ఎవరైనా వ్యాపారం ప్రారంభించవచ్చు. విక్రేతల పేరుతో కంపెనీ ఒక ఆన్‌లైన్ స్టోర్‌ను క్రియేట్ చేస్తుంది. సోషల్ మీడియాలో ఈ ఆన్‌లైన్ స్టోర్‌కు సంబంధించిన లింక్/క్యూఆర్ కోడ్‌ను పోస్ట్ చేయడం, లేదా బంధువులు, స్నేహితులకు షేర్ చేసినా చాలు. కంపెనీ ఆఫర్ చేసే ఉత్పత్తులను ఎవరు కొనుగోలు చేసినా.. విక్రేతకు 20-40 శాతం లాభం వస్తుంది. డెలివరీ బాధ్యతలను కంపెనీ తీసుకుంటుంది. విక్రేతలు చేయాల్సిందల్లా తమ ఆన్‌లైన్ స్టోర్‌ను ప్రమోట్ చేసుకోవడమే. ఇప్పటికే దేశ వ్యాప్తంగా 22,000లకుపైగా యాక్టివ్ ఆన్‌లైన్ స్టోర్స్ ఉన్నాయని డబ్ల్యుకామర్స్ కో-ఫౌండర్, సీఓఓ శ్రీధర్ శ్రీరామనేని వెల్లడించారు. 'హెల్త్, వెల్‌నెస్, బ్యూటీ, పర్సనల్ కేర్, హోమ్ ఎసెన్షియల్స్ విభాగాల్లో ఎంపిక చేసిన 40కిపైగా బ్రాండ్స్ నుంచి 600లకుపైగా ఉత్పత్తులు అందుబాటులోకి తెచ్చాం. ప్రతీ బ్రాండ్‌కూ ఆయా విభాగాల్లో మార్కెట్లో మంచి పేరుంది. ఈ కంపెనీలు విస్తృత పరిశోధన అనంతరం ఉత్పత్తులను మార్కెట్లోకి తెచ్చాయి. కిరాణా వర్తకులు కూడా డబ్ల్యుకామర్స్ ప్లాట్‌ఫాంలో లభించే ఉత్పత్తులను విక్రయించడం ద్వారా అదనపు ఆదాయం ఆర్జించవచ్చు. సోషల్ మీడియా ఇప్పుడు సోషల్ కామర్స్ అయిన ప్రస్తుత తరుణంలో ఉద్యోగులు, విద్యార్థులు, గృహిణులకు పెట్టుబడి లేని వ్యాపారానికి ఇది చక్కని వేదిక. ఓఎన్‌డీసీ ప్లాట్‌ఫామ్‌లోనూ ఉత్పత్తులను విక్రయించేందుకు వీలుందని వివరించారు.

ఇల్లందులో ఏసీబీ దాడులు

విశాలాంధ్ర - ఇల్లందు : ఇల్లందులొ ఒక రేషన్ డీలర్ నుంచి రూ. 30 వేలు లంచం తీసుకుంటూ డిప్యూటీ తహసిల్దార్ ముగ్గురు ఏసీబీ అధికారులకు చిక్కారు. సోమవారం సివిల్ సప్లై డిటి మొహమ్మద్ యాకూబ్ పాషా, ఈపాస్ టెక్నికల్ అసిస్టెంట్ ఏ విజయ్, ఇల్లెందు రేషన్ డీలర్ అసోసియేషన్ అధ్యక్షుడు శబరిష్ ఏసీబీకి చిక్కారు. ఎసిబి డిఎస్పి వై.రమేష్ తెలిపిన వివరాలు ప్రకారం ఓ రేషన్ షాపులో స్టాక్ తక్కువగా ఉన్నందున రూ.30 వేలు లంచం డిమాండ్ చేసారు. ఈ క్రమంలో రేషన్ డీలర్ తమ వద్ద అంత డబ్బు లేదని చెప్పినప్పటికీ వినకుండా చెల్లించాల్సిందేనని ఆ ముగ్గురు వత్తిడి చేసారు. ఈ నేపథ్యంలో రేషన్ డీలర్ ఏసీబీని సంప్రదించాడు. దింతో ఉదయం రేషన్ డీలర్ అసోసియేషన్ అధ్యక్షుడు శబరీష్ కు చెందిన జగదాంబ సెంటర్లోని సెల్ షాప్ లో రేషన్ డీలర్ డబ్బులు ఇస్తున్న క్రమంలో ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకోవడం జరిగింది. మొదట పట్టుబడ్డ శబరీష్ ను ఎమ్మార్వో ఆఫీస్ కు తీసుకువచ్చారు. పూర్తిస్థాయి విచారణ చేపట్టగా సివిల్ సప్లై డిటి టెక్నీషియన్ విజయ్ ఒత్తిడి మేరకే డీలర్ నుంచి డబ్బు తీసుకున్నట్లు అతను ఒప్పుకున్నాడు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఏసీబీ డిఎస్పి వై రమేష్ తెలిపారు.
ప్రస్తుతం ఏసీబీకి పట్టుబడ్డ ఇల్లెందు సివిల్ సప్లై డిటి 2011లో కొణిజర్లలో ఓ వైద్యుడి నుంచి రూ. 3 వేలు తీసుకుంటు రెడ్ హ్యాండెడ్ గా దొరికాడని డిఎస్పీ రమేష్ తెలిపారు. ఆ కేసు ఇంకా కొనసాగుతుందని ఈ క్రమంలో మళ్లీ పట్టుబడ్డాడని తెలిపారు. ఇతనిపై చాలా ఫిర్యాదులు అందాయని గత కొంతకాలంగా నిఘ పెట్టామని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులు లంచం డిమాండ్ చేస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కొమురవెల్లి మల్లన్న కల్యాణం, జాతరను ఘనంగా నిర్వహించాలి

అధికారులకు మంత్రి కొండా సురేఖ దిశానిర్దేశం

విశాలాంధ్ర - హైదరాబాద్ :: తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట జిల్లా చేర్యాలలోని శ్రీ కొమురవెల్లి మల్లన్న కల్యాణం, జాతరలను తెలంగాణ ఆధ్యాత్మిక సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా వైభవోపేతంగా నిర్వహించాలని దేవాదాయ ధర్మాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. వేలాదిగా జాతరకు తరలివచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకుని ఏ చిన్న పొరపాటు తలెత్తకుండా పటిష్టమైన కార్యాచరణతో ఏర్పాట్లు చేయాలని మంత్రి సురేఖ అధికారులకు సూచించారు. సోమవారం డా.బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్ లోని దేవాదాయ ధర్మాదాయ మంత్రిత్వశాఖ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో మంత్రి సురేఖ సిద్దిపేట జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశం కంటే ముందు మల్లన్న జాతర, కళ్యాణం పోస్టరును మంత్రి సురేఖ రిలీజ్ చేశారు. రివ్యూ సమావేశంలో దేవాదాయ శాఖ మంత్రి సురేఖ మాట్లాడుతూ.., గత సంవత్సరం కంటే మరింత వైభవోపేతంగా మల్లికార్జున స్వామివారి కల్యాణం, జాతరను నిర్వహించనున్నట్లు తెలిపారు. గత సంవత్సరం జాతర, కల్యాణం నిర్వహించిన సమయంలో తలెత్తిన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఈ సారి అవి రాకుండా చూడాలని సూచించారు. డిసెంబర్ 14 ఉదయం 10.45 గంటలకు శ్రీ మల్లికార్జున స్వామి వారి కల్యాణాన్ని, జనవరి 18 నుండి 10 వారాలపాటు మార్చి 16 వరకు జాతరను నిర్వహించేందుకు నిర్ణయించినట్లు మంత్రి సురేఖ ప్రకటించారు. ఈ దిశగా భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేయాలని పోలీస్, విద్యుత్, వైద్యారోగ్యం, ఆర్టీసి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, ఆర్ అండ్ బి తదితర శాఖల అధికారులను మంత్రి సురేఖ ఆదేశించారు. భక్తులు ఎలాంటి ఇబ్బంది కలగకుండా కల్యాణాన్ని వీక్షించి, స్వామి అమ్మవార్లను దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యేందుకు వీలుగా అన్ని శాఖలు సమన్వయంతో వ్యవహరించేలా చర్యలు చేపట్టాలని మంత్రి సురేఖ కలెక్టర్ ను నిర్దేశించారు. గత సంవత్సరం జరిగిన జాతర, కళ్యాణం అనుభవాలను దృష్టిలో పెట్టుకుని కల్యాణ వేదికను విశాలంగా తీర్చిదిద్దాలని ఎండోమెంటు అధికారులను మంత్రి సురేఖ ఆదేశించారు. కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, అమ్మవార్లు బలిజ మేడలమ్మ, గొల్ల కేతమ్మలకు కిరీటాల తయారీ పనుల పై మంత్రి సురేఖ వివరాలు పూర్తిగా తెలుసుకున్నారు. రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు కల్యాణోత్సవానికి, జాతరకు పెద్ద సంఖ్యలో తరలివచ్చే పరిస్థితులున్నందున ఈ దిశగా చర్యలు చేపట్టాలని సిద్దపేట డిపో మేనేజర్ కు మంత్రి సురేఖ సూచించారు. భక్తుల క్యూలైన్లు, బారికేడ్లు, ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు, సిసి కెమరాల నిఘా, వివిఐపిలకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు, భక్తులకు దారులను తెలిపేలా సైన్ బోర్డులు, తాగునీటి సదుపాయం, మెడికల్ క్యాంపు, లాక్టేషన్ గదులు తదితర ఏర్పాట్లు చేయాలని మంత్రి సంబంధిత అధికారులకు సూచించారు. జాతర సమయానికి వేసవి కాలం రానుండటంతో భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు, నడిచే మార్గాల్లో మ్యాట్లు, వృద్ధులు, వికలాంగులు, గర్భిణులకు బ్యాటరీ వాహనాలు తదితర ఏర్పాట్లు చేయాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను సంపూర్ణంగా నిషేధించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మల్లికార్జున స్వామివారి కల్యాణం, జాతర ను విస్తృతంగా జనంలోకి వెళ్ళేలా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. భక్తులకు సాయపడేలా అవసరమైన చోట వాలంటీర్లు, ఆశా కార్యకర్తల సేవలను వినియోగించుకునేలా కార్యాచరణను రూపొందించాలని సూచించారు. స్వామివారి ప్రసాదం తయారీలో అత్యున్నత నాణ్యతా ప్రమాణాలను పాటించాలని మంత్రి అధికారులకు సూచించారు. జాతర జరుగుతున్నన్ని రోజులు సాయంత్రాల్లో కళాబృందాలచే ఒగ్గుకథ వంటి జానపద కళారూపాలను ప్రదర్శించేలా సాంస్కృతిక శాఖకు ఆదేశాలివ్వాలని కలెక్టర్ కు మంత్రి సూచించారు. కల్యాణోత్సవానికి వారం రోజుల ముందే సర్వసన్నద్ధంగా వుండేలా కార్యాచరణను వెంటనే అమలుపరచాలని మంత్రి సురేఖ అధికారులకు సూచించారు.కల్యాణంతో పాటు, జాతర జరిగినన్ని రోజుల దేవాలయాన్ని దేదీప్యమానంగా ముస్తాబు చేయడంతో పాటు భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. ఈ సారి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం కనిపిస్తున్న తరుణంలో వైద్య శాఖ తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా గుండె సంబంధిత సమస్యలున్న భక్తులు సైతం వచ్చే అవకాశం ఉందని... అందుచేత ఏదైనా వారి ఇబ్బందులు జరిగితే, సీపీఆర్ చేసేందుకు డాక్టర్లను, పారామెడికల్ సిబ్బంది పక్కగా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఆలయంలో... ఆలయ ఆవరణలో పరిశుభ్రత తప్పనిసరి అని... అందుకోసం అవసరమైతే పారిశుధ్య సిబ్బందిని ప్రత్యేకంగా అపాయింట్ చేసుకోవాలని కలెక్టర్ కు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి(జనగామ), ఎండోమెంటు ప్రిన్స్ పల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్?, సిద్ధిపేట కలెక్టర్ హైమావతి, సిద్ధిపేట పోలీస్ కమిషనరేట్ ఉన్నతాధికారులు, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, సిద్దిపేట అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ), ఆర్డీవో, కొమురవెల్లి ఆలయ ఈవో టంకశాల వెంకటేశ్, ఆర్టిసి డిపో మేనేజర్, డిఎంహెచ్ఓ, డిపిఓ, డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి,గ్రామీణ నీటి సరఫరా, ఫైర్, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ తదితర శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతమే

- పరిమితులను ఉల్లంఘిస్తే ఎన్నికలు నిలిపివేస్తాం
- మహారాష్ట్ర సర్కారుకు సుప్రీం హెచ్చరిక

న్యూఢిల్లీ: స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50శాతానికి మించరాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఒకవేళ రిజర్వేషన్ కోటా పరిమితులను ఉల్లంఘిస్తే ఎన్నికలను నిలిపివేయాల్సి వస్తుందని హెచ్చరించింది. ఈ మేరకు రిజర్వేషన్ల పరిమితికి సంబంధించి సుప్రీంకోర్టు మహారాష్ట్ర సర్కారుకు కీలక ఆదేశాలు జారీ చేసింది. వచ్చే నెలలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతం పరిమితికి మించకుండా చూడాలని సూచించింది. 2022లో జేకే బాంథియా కమిషన్ తన నివేదికలో ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీ)కు 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సిఫార్సు చేసింది. దానికంటే ముందున్న పరిస్థితి ప్రకారం మాత్రమే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిలతో కూడిన సుప్రీం ధర్మాసనం పేర్కొంది. అయితే మహారాష్ట్ర సర్కార్ తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అభ్యర్థన మేరకు తదుపరి విచారణను నవంబర్ 19కి వాయిదా వేసింది. అయితే ఎన్నికల్లో రిజర్వేషన్ల పరిమితి 50 శాతానికి మించకూడదని స్పష్టం చేసింది.

దిల్లీ బాంబు పేలుళ్లు...
మరో కీలక నిందితుడి అరెస్ట్

న్యూఢిల్లీ: దిల్లీ బాంబు పేలుళ్ల ఘటనకు సంబంధించి మరో కీలక నిందితుడిని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అరెస్ట్ చేసింది. ఎర్రకోట సమీపంలో పేలుడుకు పాల్పడిన ఉగ్రవాదితో కలిసి పని చేసిన మరో ముఖ్య అనుచరుడు జాసిర్ బిలాల్ ను అదుపులోకి తీసుకున్నట్టు ప్రకటించింది. ఈ ఘటనకు సంబంధించి దర్యాప్తు కొనసాగిస్తున్న ఎన్ఐఏ... జాసిర్‌ను జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో అరెస్ట్ చేసినట్టు పేర్కొంది. జాసిర్... జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా కాజిగుండ్‌కు చెందిన వ్యక్తిగా దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఇతను ఉగ్ర దాడులు చేపట్టేందుకు ఉగ్రవాదులకు డ్రోన్లు, రాకెట్లు తయారు చేయడంలో సాంకేతికంగా సాయపడినట్టు గుర్తించారు. ఉమర్ నబీతో సన్నిహితంగా పని చేస్తూ... ఎర్రకోట దాడి ప్రణాళికను రచించినట్టు దర్యాప్తు అధికారులు ఆరోపిస్తున్నారు. ఎర్రకోట సమీపంలో నవంబరు 10 జరిగిన పేలుడు ఘటనకు పాల్పడిన ఉమర్‌కు సహకరించిన నిందితుడు అమీర్ రషీద్ అలీని కట్టుదిట్టమైన భద్రత నడుమ పాటియాలా హౌస్ కోర్టు కాంప్లెక్స్‌లోని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ కోర్టు ముందు సోమవారం ఉదయం హాజరుపరిచారు. ఈ మేరకు 10 రోజుల ఎన్ఐఏ కస్టడీకి కోర్టు ఆదేశించింది. ఆ వెంటనే రషీద్‌ను ఎన్ఐఏ కార్యాలయానికి తరలించారు. అతడిని కోర్టుకు హాజరుపరిచే సమయంలో మీడియాను అనుమతించలేదు. కోర్టు కాంప్లెక్స్ చుట్టూ దిల్లీ పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది మోహరించారు.

కర్త... కర్మ... క్రియ డా.షాహీనా
దిల్లీ పేలుళ్ల కేసులో వెలుగులోకి వాస్తవాలు

న్యూఢిల్లీ: దిల్లీ పేలుడు వెనుక తవ్వేకొద్దీ సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికే అనేక కీలక విషయాలు రాబట్టిన అధికారులు... తాజాగా మరికొన్ని విషయాలు వెలుగు చూశాయి. దేశవ్యాప్తంగా అనేక చోట్ల పేలుళ్లు చేసేందుకు డాక్టర్ ఉమర్‌తో కలిసి డాక్టర్ షాహీన్ కుట్ర చేసిందని తేల్చారు. దీనికంతటికి కర్త, కర్మ, క్రియ షాహీనానే అని అధికారులు ఒక అంచనాకు వచ్చారు. జైషే మహ్మద్ ఎరవేసిన మైకంలో పడి షాహీనా పెద్ద కుట్రకు పథకం వేసినట్లు కనుగొన్నారు. ఈ గడ్డపై పుట్టి... ఈ గడ్డకే ద్రోహం చేయడానికి ప్రణాళికలు రచించింది. డిసెంబర్ 6న బాబ్రీ మసీదు కూల్చివేత వార్షికోత్సవం రోజున దేశవ్యాప్తంగా శక్తివంతమైన పేలుళ్లకు డాక్టర్ ఉమర్‌తో కలిసి షాహీన్ ప్రణాళిక వేసింది. అయితే డాక్టర్ ముజమ్మిల్ అరెస్ట్ తర్వాత అందరిలోనూ భయాందోళన మొదలైంది. డాక్టర్ ఉమర్ కూడా భయాందోళనకు గురయ్యాడు. నవంబర్ 10న ఉమర్ చాలా ఆందోళనలో ఉన్నట్లు సాక్షులు చెబుతున్నారు. దీంతో కారులో సరిగ్గా అమర్చబడని ఐఈడీ పేలిపోయింది. ఈ పేలుడు నవంబర్ 10న పేలాల్సింది కాదు. డిసెంబర్ 6న పెద్ద ఎత్తున ఆయా ప్రాంతాల్లో కారు పేలుళ్లకు షాహీన్ కుట్ర చేసింది. కానీ ముందుగానే ద్రోహం బయటపడింది. లేదంటే ఈ మారణహోమంలో దేశంలో ఎంతోమంది బలైపోయేవారు. ఉగ్ర బృందం మధ్య జరిగిన సంభాషణకు చెందిన కోడ్‌భాష వెలుగు చూసింది. 'ఆపరేషన్ డి-6' అనే కోడ్‌నేమ్ ఉపయోగించారు. ఉగ్రవాదుల దగ్గర నుంచి స్వాధీనం చేసుకున్న డైరీల్లో ఇదే ఉంది. ఈ ఆపరేషన్‌కు షాహీనే సర్జన్‌గా దర్యాప్తు అధికారులు వెల్లడించారు. దేశ వ్యాప్తంగా ఆరు నగరాల్లో ఆపరేషన్ డి-6కు ప్లాన్ చేసిందని జమ్మూకశ్మీర్, ఫరీదాబాద్‌లో అరెస్టైన వారు ఇచ్చిన సమాచారంతో ఈ కుట్ర వెలుగు చూసింది. పెద్ద ఎత్తున నగదు తరలింపులు చేసినట్లుగా గుర్తించారు. షాహీన్ ఖాతాలను అధికారులు ఆడిట్ చేస్తున్నారు. దిల్లీ, కాన్పూర్, లక్నోలో ఉన్న ఏడు బ్యాంక్ ఖాతాలు పరిశీలిస్తున్నారు.

బంగ్లా ప్రజల ప్రయోజనాలకు కట్టుబడి ఉన్నాం: భారత్

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు స్థానిక ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్ మరణ శిక్ష విధించడంపై భారత్ స్పందించింది. ఈ తీర్పును తాము గమనించినట్లు తెలిపింది. ఓ పొరుగు దేశంగా... బంగ్లాదేశ్ ప్రజల ప్రయోజనాలకు కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేసింది. బంగ్లాదేశ్‌లో శాంతి, ప్రజాస్వామ్యం, స్థిరత్వం విషయంలో అన్ని పక్షాలతో నిర్మాణాత్మకంగా వ్యవహరిస్తామని భారత విదేశాంగశాఖ ఓ ప్రకటనలో తెలిపింది. హసీనాకు విధించిన శిక్షను దృష్టిలో ఉంచుకుని ఆమెను వెంటనే అప్పగించాలని బంగ్లాదేశ్ విదేశాంగశాఖ చేసిన డిమాండ్‌పై భారత్ స్పందించలేదు. విద్యార్థుల ఆందోళనలతో ప్రధాని పదవి వీడిన షేక్ హసీనా... గతేడాది ఆగస్టులో బంగ్లాదేశ్ నుంచి భారత్‌కు వచ్చారు. నాటినుంచి దిల్లీలోని ఓ రహస్య ప్రదేశంలో నివసిస్తున్నారు. స్వదేశంలో ఆందోళనల సమయంలో మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడ్డారని ఆమెపై కేసులు నమోదయ్యాయి. వాటిని విచారించిన ఐసీటీ సోమవారం హసీనాను దోషిగా తేల్చింది. మరణ శిక్ష విధించింది.

ఐబొమ్మ నిర్వాహకుడి వద్ద
50 లక్షల మంది వ్యక్తిగత డేటా

- ఇమ్మడి రవిది నేరపూరిత స్వభావం
- పైరసీలతో రూ.30 కోట్ల సంపాదన
- భారత్ వదిలి... కరేబియన్ పౌరసత్వం
- ప్రహ్లాద్ పేరుతో పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్: సజ్జనార్

విశాలాంధ్ర – హైదరాబాద్: పైరసీ ముసుగులో ఇమ్మడి రవి అనే వ్యక్తి ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను ప్రచారం చేశాడని సీపీ సజ్జనార్ తెలిపారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ... పైరసీలతో సుమారు రూ.30కోట్ల వరకు అతడు సంపాదించాడని పేర్కొన్నారు. అతడి వద్ద 50 లక్షల మంది సబ్‌స్క్రైబర్ల డేటా ఉందన్నారు. ఇమ్మడి రవిది సొంత ఊరు వైజాగ్ అని, మహారాష్ట్రలో ప్రహ్లాద్ పేరుతో డ్రైవింగ్ లైసెన్స్ తీసుకున్నాడని వెల్లడించారు. అలాగే పాన్ కార్డ్ కూడా ప్రహ్లాద్ పేరుతో ఉందన్నారు. ముందు నుంచే ఇమ్మడి రవికి నేరపూరిత ఆలోచన ఉండేదన్నారు. అతడు కరేబియన్ ఐల్యాండ్ సిటిజన్ షిప్ తీసుకున్నాడని, ఫ్రాన్స్, దుబాయ్, థాయిలాండ్... ఇలా ఎన్నో దేశాలు తిరిగాడని వివరించారు. అమెరికా, నెదర్లాండ్స్‌లో కూడా సర్వర్లను పెట్టడంతో పాటు టెలిగ్రామ్ యాప్ లో కూడా పైరసీ సినిమాలు అప్‌లోడ్ చేశాడని తెలిపారు. ఐ బొమ్మ సైట్ ను క్లిక్ చేయగానే బెట్టింగ్ యాప్ సైట్ ఓపెన్ అవుతుందని, సినిమా మధ్యలో కూడా బెట్టింగ్ యాప్ ప్రకటనలు వచ్చాయని వీటి ద్వారా కోట్ల రూపాయలు ఆర్జించాడన్నారు. దమ్ముంటే పట్టుకోండి చూద్దాం అని సవాల్ విసిరిన ఇమ్మడి రవి ఇప్పుడు ఎక్కడున్నాడు అని ప్రముఖ నటుడు చిరంజీవి అన్నారు. హైదరాబాద్ పోలీస్‌ను అంత తక్కువ అంచనా వేయొద్దని,ఇమ్మడి రవి ని పట్టుకున్న తర్వాత చాలా మంది పోలీసుల పైన మీమ్స్ చేస్తున్నారు, అది సరైంది కాదన్నారు. చేసే వాళ్లపైన కూడా నిఘా ఉంటుందని, ఉచితంగా వస్తుంది కదా అని ఐ బొమ్మ ను ఎంకరేజ్ చేశారు. కానీ మీ డేటా మొత్తం చోరీ కి గురైంది, ఈ విషయం మర్చిపోయారని చిరంజీవి అన్నారు. చాలా ఏళ్లుగా పైరసీ బాధించిందని, లక్షలాది మంది సినిమా ఇండస్ట్రీ పై ఆధారపడి ఉన్నారని దర్శకుడు రాజమౌళి అన్నారు. ఇంతమంది కష్టాన్ని ఒకడు వచ్చి అప్పనంగా ఎత్తుకుపోతే ఎలా, గత సీపీ సీవీ ఆనంద్, ప్రస్తుత సీపీ సజ్జనార్ ఇద్దరు ఎంతో శ్రమించి పైరసీ భూతాన్ని పట్టుకున్నారన్నారు. పోలీస్ శాఖ కి మా కృతజ్ఞతలని, పైరసీని ఇక్కడితో అరికట్టాలన్నారు. పోలీసులకు సవాల్ చేసి భస్మాసుర హస్తంలా తన తలపై తానే చెయ్యి పెట్టుకున్నాడంటూ వ్యాఖ్యానించారు. ఏది ఊరికే రాదని, ఐ బొమ్మ లో ఉచితంగా సినిమాలు ఎలా వస్తున్నాయని ఒక్కసారి ఆలోచించారా అని నటుడు నాగార్జున అన్నారు. మీ పర్సనల్ డేటా ఇమ్మడి రవి అమ్ముకుంటున్నాడని, అంత పెద్ద సర్వర్లు మెయింటెన్ చేయాలి అంటే ఎంతో డబ్బు కావాలి, ఆ డబ్బంతా మీరే ఇస్తున్నారని పేర్కొన్నారు. మా సినిమా వాళ్ల కంటే... మీరే ఎక్కువగా నష్టపోతున్నారని అన్నారు. ఐ బొమ్మ రవి అరెస్ట్ అవగానే...చెన్నై నుంచి ఒక వ్యక్తి ఫోన్ చేశాడు, ఇక్కడ మేము చేయలేని పని మీ తెలంగాణ పోలీస్ చేశారని గర్వంగా చెప్పాడన్నారు. ఆరు నెలల క్రితం మా ఫ్యామిలీ మెంబర్ ఒకరిని రెండు రోజులపాటు డిజిటల్ అరెస్ట్ లో పెట్టారన్నారు. ఈ విషయంలో పోలీసులకు సమాచారం ఇచ్చామన్నారు. ఉచితంగా సినిమా చూస్తున్నాం అని మాత్రం అనుకోకండి, మీ డేటా చోరీ అవుతుంది అనేది గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ఇమ్మడి రవి అరెస్టు నేపథ్యంలో సినీ ప్రముఖులు సీపీ సజ్జనార్‌తో భేటీ అయ్యారు.

ప్రింట్ మీడియాలో ప్రకటనల రేట్లు పెంపు

- చదరపు సెం.మీ.కు రూ.47.40 నుంచి రూ. 59.68కి పెంపు
- 9వ రేట్ స్ట్రక్చర్ కమిటీ సిఫార్సులకు కేంద్రం ఆమోదం

న్యూఢిల్లీ: వార్తా పత్రికల్లో ప్రచురించే ప్రభుత్వ ప్రకటనల రేట్లను ఏకంగా 26 శాతం పెంచుతూ సోమవారం కేంద్రప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో పాటు, కలర్ ప్రకటనలకు ప్రత్యేకంగా ప్రీమియం రేట్లను కూడా ప్రవేశపెట్టింది. ఈ నిర్ణయంతో పత్రికా రంగానికి ఆర్థికంగా చేయూత లభించనుంది. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, లక్ష కాపీలు ఉన్న దినపత్రికలకు బ్లాక్ అండ్ వైట్ ప్రకటనల రేటు చదరపు సెంటీమీటర్‌కు రూ. 47.40 నుంచి రూ. 59.68కి పెరిగింది. ఇతర మీడియా నుంచి వస్తున్న పోటీ, గత కొన్నేళ్లుగా పెరిగిన నిర్వహణ ఖర్చులను దృష్టిలో ఉంచుకుని ఈ పెంపు నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ నిర్ణయం వల్ల ప్రింట్ మీడియాకు ఆర్థిక స్థిరత్వం లభిస్తుందని, తద్వారా నాణ్యమైన జర్నలిజం కొనసాగించడానికి, స్థానిక వార్తా సంస్థలకు మద్దతు ఇవ్వడానికి వీలవుతుందని కేంద్రం పేర్కొంది. మెరుగైన కంటెంట్‌పై పెట్టుబడి పెట్టడం ద్వారా ప్రజా ప్రయోజనాలకు మరింత సమర్థవంతంగా సేవ చేయవచ్చని వివరించింది.

కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖల ప్రచార కార్యక్రమాలను సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) నిర్వహిస్తుంది. చివరిసారిగా 2019 జనవరిలో ప్రకటనల రేట్లను సవరించారు. తాజా సవరణ కోసం 2021 నవంబర్‌లో 9వ రేట్ స్ట్రక్చర్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఇండియన్ న్యూస్‌పేపర్ సొసైటీ (ఐఎన్ఎస్) వంటి వివిధ వార్తాపత్రికల సంఘాల నుంచి వచ్చిన విజ్ఞప్తులను, న్యూస్‌ప్రింట్ ధర, ద్రవ్యోల్బణం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని 2023 సెప్టెంబర్‌లో తన సిఫార్సులను సమర్పించింది. ఈ సిఫార్సుల ఆధారంగానే కేంద్రం తాజా నిర్ణయం తీసుకుంది.

సంచలన ఆదేశాలు ఇవ్వలేం: సుప్రీం

న్యూఢిల్లీ: ఏటా శీతాకాలం సమీపించిందంటే దేశ రాజధాని కాలుష్య కోరల్లో చిక్కుకుపోతుంటుంది. గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 300 నుంచి 400 దాటడం సాధారణంగా మారుతోంది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తాత్కాలిక పరిష్కారాలతో కాలుష్యాన్ని అరికట్టలేమని తెలిపింది. రాజధాని నగరంలో నిర్మాణాలపై నిషేధం విధించేందుకు నిరాకరించింది. పర్యావరణ ఆందోళనలు, అభివృద్ధి మధ్య సమతుల్యం ఉండాలని సూచించింది. దిల్లీలో వేగంగా పెరుగుతోన్న కాలుష్య సమస్యను అరికట్టేందుకు సంచలన ఆదేశాలు ఇచ్చేందుకు సుముఖంగా లేమని వ్యాఖ్యానించింది. ఈ కాలుష్య సంక్షోభాన్ని పరిష్కరించే లక్ష్యంగా నవంబర్ 19లోగా ఒక ప్రణాళికతో రావాలని కేంద్రాన్ని ఆదేశించింది. తాత్కాలిక పరిష్కారాలతో ఎలాంటి ప్రయోజనం ఉండదని, దీర్ఘకాలిక పరిష్కారాలు రూపొందించాలని సూచించింది.

వ్యర్థం నుంచి సంపద!

- 20 లక్షలకు పైగా కంపోస్ట్ గుంతలు
- ప్రజల భాగస్వామ్యం అవశ్యం
- పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం
- గృహ వ్యర్థాల నిర్వహణలో విప్లవాత్మక మార్పులు

విశాలాంధ్ర – సచివాలయం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులతో వ్యర్థాల కంపోస్ట్ గుంతల నిర్మాణం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే అనేక మండలాల్లో వేలాది కంపోస్ట్ గుంతలు సిద్ధమయ్యాయి. వీటి ద్వారా సేంద్రీయ ఎరువుల ఉత్పత్తి పెరిగి, అవి రైతులకు చౌకగా అందుబాటులోకి వస్తాయనేది భావన. కాలుష్యం లేని గ్రామాలు, పట్టణాలే లక్ష్యంగా గృహ వ్యర్థాలు వృథా కాకుండా వాటిని తిరిగి వినియోగానికి కూడా హోమ్ కంపోస్టింగ్‌ను ప్రోత్సహించేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్త లక్ష్యం 20,08,727 గుంతలు కాగా, ఇప్పటి వరకు కేవలం రెండు లక్షల చిల్లర మాత్రమే కంపోస్ట్ గుంతలు పూర్తయ్యాయి. ప్రజల భాగస్వామ్యాన్ని పెంచుతూ గృహస్థులు తమ వ్యర్థాలను గుంతల్లో వేసే అలవాటు చేసుకుంటే రాష్ట్రం మొత్తం గ్రీన్ ఆంధ్రగా మారుతుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తుంది. జిల్లాలో మొత్తం 58,763 కంపోస్ట్ గుంతలకు గాను ఇప్పటి వరకు 10,853కి పైగానే పూర్తి అయినట్లు తెలిసింది. తర్వాత స్థానంలో కాకినాడ,పార్వతీపురం మన్యం జిల్లాలు ఉన్నాయి. కాకినాడలో 40,623కి గాను 15,735కి పైగానే పూర్తి అయ్యాయి. పార్వతీపురం మన్యంలో 27,315కి గాను 10,311, శ్రీసత్యసాయి, కర్నూలు తదితర జిల్లాలు బాగా వెనుకబడి ఉన్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా 21 శాతం, అనకాపల్లి 8 శాతం, కృష్ణా 9 శాతం, అన్నమయ్య 4 శాతం, ఏలూరు 3 శాతం, చిత్తూరు 3 శాతం, ఎన్టీఆర్ జిల్లా 3 శాతం, గుంటూరు 3 శాతం, నం ద్యాల 3 శాతం, కోనసీమ 2 శాతం, నెల్లూరు 2 శాతం, తిరు పతి 2 శాతం, బాపట్ల 2 శాతం, పశ్చిమగోదావరి ఒక శాతం, పల్నాడు ఒక శాతం, తూర్పు గోదావరి, అనంతపురం, విజయనగరం, వైయస్ఆర్ కడప, ప్రకాశం, కర్నూలు తదితర జిల్లాలు ఒక శాతం మాత్రమే... కంపోస్ట్ గుంటల నిర్మాణంలో పురోగతిని సాధించాయి. దాదాపుగా ఒకటి రెండు మినహా మిగతా అన్ని జిల్లాలు వెనుకబడ్డాయని గణాంకాలు ద్వారా తెలుస్తోంది. లక్ష్య సాధనలో వెనుకబడిన జిల్లాలు ఇక ముందు పనులను మరింతవేగంగా నిర్వహించి, లక్ష్యాలను సాధించాలని ప్రభుత్వం కోరింది. చెత్త నుంచి విద్యుత్ తయారీకి కూడా ప్రభుత్వం ప్రణాళికలు తయారు చేస్తోంది. ఇప్పటికే ఇందుకోసం సింగపూర్ వ్యర్థాల నిర్వహణ నమూనాను కూడా అధ్యయనం చేయడం జరిగిందంటున్నారు. రానున్న కాలంలో ఉపాధి కూలీలను ఎక్కువ సంఖ్యలో వినియోగించి, నిర్దేశిత లక్ష్యాలను త్వరితగతిన సాధించాలని, మార్చి 31, 2026 నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వ ఆదేశాలు. ఇదే క్రమంలో గ్రామాల్లో సాలిడ్వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్లను కూడా నిర్మిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు,పరిశు భ్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం గృహ వ్యర్థాలను సేంద్రీయ ఎరువులుగా మార్చే కార్యక్రమాన్ని వేగవంతం చేసింది. వ్యర్థం నుంచి సంపద సృష్టించేందుకు పక్కా ప్రణాళికతో ముందుకుపోతుంది. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో గృహ వ్యర్థాల నిర్వహణలో విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయని సంబంధిత అధికారులు అంటున్నారు.

ఇన్సాఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా అఫ్సర్, జాఫర్

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఇన్సాఫ్ రాష్ట్ర అధ్యక్షులుగా సయ్యద్ అఫ్సర్, రాష్ట్ర కార్యదర్శిగా సి.జాఫర్, ఉపాధ్యక్షులుగా ఎస్‌కే రియాజ్, ఎస్‌కే ఖాజా, ఎంఏ సాలార్, సహాయ కార్యదర్శులుగా ఎస్‌కే అహ్మదున్నీసా, ఎండీ సైఫుల్లా, ఎస్‌కే దాదా పీర్, కోశాధికారిగా షేక్ మునీర్ ఎన్నిక య్యారు. ఆల్ ఇండియా తన్జీమ్ ఈ ఇన్సాఫ్ రాష్ట్ర ముఖ్య కార్యకర్తల సమా వేశం సయ్యద్ అఫ్సర్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ దేశంలో పరిస్థితులు చాలా ఆందోళనకరంగా ఉన్నాయని, బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విభజించి పాలించే విధంగా మతాల మధ్య చిచ్చు పెడుతోందని, అన్ని రాజ్యాంగ సంస్థలను తమ గుప్పెట్లో పెట్టుకుని ఇష్టారీతిగా అధికారాన్ని చెలాయిస్తోందని విమర్శించారు. ప్రతి ఎన్నికల ముందు దేశంలో ఎక్కడో ఒకచోట అల్లర్లు సృష్టించడం, బాంబు దాడులు జరగడం సహజంగా మారాయని అన్నారు. ప్రజలు ఐక్యంగా ఉండవలసిన పరిస్థితులు సృష్టించబడుతున్నాయని, సమష్టి పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోగలమని అన్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఏ మాత్రం పాత్ర లేని బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఈనాడు నీతులు చెబుతున్నాయని విమర్శించారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన వారిని, వారి త్యాగాలను అవహేళన చేస్తున్నాయని, ప్రశ్నించిన వారిపై దాడులు జరుగుతున్నా యని, వీటన్నింటిని ఎదుర్కొనేందుకు ఆలిండియా తన్జీమ్ ఇన్సాఫ్ రాష్ట్ర వ్యాప్తంగా బలపడి తమ హక్కుల కోసం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం జి.ఈశ్వరయ్యను ఇన్సాఫ్ నూతన కమిటీ సత్కరించింది.

ఉక్కు కార్మికులపై సీఎం అనుచిత వ్యాఖ్యలు: రవీంద్రనాథ్

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: విశాఖ ఉక్కు కార్మికులపై ముఖ్యమంత్రి చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ తీవ్రంగా ఖండించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కార్మికవర్గం దశలవారీగా నిర్వహించిన పోరాటాల ఫలితంగా వచ్చిన రూ.12 వేల కోట్లు కార్మికవర్గ ప్రయోజనాలకుగానీ, ఉక్కు ఉత్పత్తిని పెంచడానికిగానీ ఉపయోగించకుండా... స్టీల్‌ప్లాంట్ అప్పులకు జమ చేసుకున్నారని తెలిపారు. తాజాగా రూ.12 వేల కోట్లను కేంద్రం ఇచ్చినప్పటికీ... దాని ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచకుండా... కార్మికులు పనిచేయకుండా హక్కుల కోసం ఉద్యమాలు చేస్తున్నారని, ఇలాగే కొనసాగితే మీపై(కార్మికుల) పీడీ యాక్టు పెడతామని చంద్రబాబు వ్యాఖ్యానిం చడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. ఈ విధంగా కార్మికవర్గాన్ని భయభ్రాంతులకు గురిచేయడం సరికా దన్నారు. ప్రైవేటీకరణ విధానాలను ఉపసంహరించు కొని... ఉత్పత్తి పెంపుదలకు అవసరమైన సొంత గనులు కేటాయించడం, ఖాళీలు భర్తీ చేయడం, ప్రైవేటీకరణ భయం లేకుండా కార్మికులు ప్రశాంతంగా వృత్తిలో నిమగ్నమై ఉత్పత్తి పెంపుదలకు దోహదపడాలని కోరారు.

ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ఆర్టీఐ నిష్ఫలం: సుప్రీం

న్యూఢిల్లీ: సమాచార కమిషనర్లను నియమించడంలో కేంద్రం సహా అనేక రాష్ట్రాలు నిర్లక్ష్యం వహించడంపై సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. దీని కారణంగా సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) నిష్ఫలంగా మారుతోందని వ్యాఖ్యానించింది. ఈ విషయమై దాఖలైన పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టు విచారించింది. కమిషనర్ల పోస్టులు ఖాళీగా ఉండటంతో ఆర్టీఐ చట్టం పనితీరు దెబ్బతింటోందని గమనించిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం... హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర సమాచార కమిషన్ (ఎస్ఐసి)లోని అన్ని ఖాళీ పోస్టులను రెండు నెలల్లోపు భర్తీ చేయాలని, అలాగే జార్ఖండ్‌లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న నియామక ప్రక్రియను ఒక నెలలోపు పూర్తి చేయాలని ఆదేశించింది. రాబోయే కొద్ది రోజుల్లో కేసును మళ్లీ విచారిస్తామని ధర్మాసనం తెలిపింది. పిటిషనర్ల తరపున హాజరైన న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ... కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ)కు రెండు నెలలకు పైగా కమిషనర్ లేకుండా ఉందని, మంజూరు చేయబడిన పది సమాచార కమిషనర్ల పోస్టులలో ఎనిమిది ఖాళీగా ఉన్నాయని కోర్టు దృష్టికి తెచ్చారు. సీఐసీ వద్ద ప్రస్తుతం దాదాపు 30వేల కేసుల పెండింగ్‌లో ఉన్నాయి. అనేక రాష్ట్ర సమాచార కమిషన్‌లు కూడా తీవ్రమైన కమిషనర్ల కొరతతో పనిచేస్తున్నాయని ప్రశాంత్ భూషణ్ కోర్టుకు తెలియజేశారు. ప్రభుత్వాలు సకాలంలో పారదర్శకంగా నియామకాలు చేయకపోవడం ద్వారా ప్రజల సమాచార హక్కును పూర్తిగా దెబ్బతీస్తున్నాయని పిటిషనర్లు వాదించారు.

అధిష్ఠానం చెంతకు సిద్ధూ-డీకే
సీఎం మార్పు ప్రచారం వేళ కీలక పరిణామం

న్యూఢిల్లీ: కర్నాటకలో కొంతకాలంగా ముఖ్యమంత్రి మార్పుపై ఊహాగానాలు వెలువడుతున్నాయి. నవంబర్‌లో సీఎం మార్పు ఉండొచ్చన్న వార్తలు ఆగడం లేదు. దీంతో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ దిల్లీలో కనిపించారు. వారిద్దరూ దేశ రాజధానిలోని కర్నాటక భవన్‌కు వెళ్లారు. బీహార్ ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం కర్నాటక రాజకీయాల్లో మార్పులు, చేర్పులు ఉంటాయని మొదటి నుంచి ప్రచారం జరుగుతోంది. పార్టీ అగ్ర నేతలు రాహుల్ గాంధీ, సోనియా గాంధీతో సిద్ధరామయ్య భేటీ అయ్యారు. ముఖ్యమంత్రిగా తానే పూర్తికాలం కొనసాగేందుకు అవకాశం ఇవ్వాలని పరోక్షంగా అధిష్ఠానాన్ని కోరిన సిద్ధరామయ్య... తదుపరి (2028) ఎన్నికలకు శివకుమార్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రతిపాదిద్దామని సూచించినట్లు తెలుస్తోంది. మరోవైపు పార్టీ అధిష్ఠానం తనను ఏ విషయమైనా అడిగేంత వరకు మౌనంగా ఉండాలని శివకుమార్ భావిస్తున్నారు. కాగా కర్నాటక మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ వార్తల నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సిద్ధరామయ్య భేటీ కానున్నారు. ఖర్గే నివాసంలో వీరు సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. కేబినెట్ విస్తరణపైనే ఆయన చర్చిస్తారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మరోవైపు, ఆదివారం డీకే, ఖర్గే సమావేశమయ్యారు. 'పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ అధ్యక్షుడు సమావేశం కావడం సర్వసాధారణం. ఇందులో కొత్తేమీ లేదు. పార్టీకి సంబంధించిన అంశాలనే మాట్లాడుకున్నాం' అని ఊహాగానాలను డీకే తోసిపుచ్చారు. ఒకవేళ కేబినెట్ పునర్వ్యవస్థీకరణకు అధిష్ఠానం ఆమోదం తెలిపితే... సిద్ధరామయ్య పూర్తికాలం సీఎంగా కొనసాగేందుకు అనుమతి లభించినట్లేనని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ముఖ్యమంత్రి స్థానాన్ని డీకేకు అప్పగించినా, అప్పగించకపోయినా, కర్నాటకలో మధ్యంతర ఎన్నికలు వస్తాయని విపక్ష నేత ఆర్.అశోక్ చెబుతున్నారు. ముందుగా చేసుకున్న ఒప్పందాన్ని అమలు చేసేందుకు సిద్ధరామయ్య సుముఖంగా లేకపోవడంతో డీకే శివకుమార్‌కు ఏం చేయాలో పాలుపోవడం లేదన్నారు. సిద్ధరామయ్యను పీఠం నుంచి తప్పించడం తేలికైన విషయం కాదన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.